సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 95

బుధవారం 26-6-2019

'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'

లాభాల వర్షం

312 పాయింట్లు పెరిగి 39,435కు సెన్సెక్స్, నిఫ్టీ 97 పాయింట్లు అప్. - బిజినెస్‌లో

సెమీస్‌లో ఆస్ట్రేలియా

ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌పై గెలుపుతో సెమీస్‌లోకి ఆసీస్ - స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

కాంగ్రెస్‌కు వారే కనిపిస్తారు

మంగళవారం పార్లమెంటులో ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

గాంధీ, నెహ్రూ కుటుంబీకులు తప్ప మరెవరూ కనిపించరు

మన్మోహన్, పీవీ వంటి వారిని విస్మరించారు

మేం ప్రణబ్‌ముఖర్జీని భారతరత్నతో గౌరవించాం

దేశాభివృద్ధికి కలసి సాగుదామంటూ మోదీ పిలుపు

5 లో

అభివృద్ధిలో అందరూ భాగస్వాములే..

జాతి నిర్మాణానికి కృషి చేసిన కొద్దిమంది పేర్లను మాత్రమే కొందరు నేతలు ప్రస్తావిస్తున్నారు. ఇతరులను మరుగుపరచడమే వారి ఉద్దేశం. మేం అలా కాదు, దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామిగా ఉన్నారనే భావిస్తాం. వారు ఎన్నడైనా పీవీ నరసింహారావు చేపట్టిన మంచి కార్యక్రమాల గురించి లోక్‌సభలో ప్రస్తావించారా? మన్మోహన్ సింగ్ జీ ఘనతపై మాట్లాడారా?

జైలుకు పంపడం కోర్టు చూసుకుంటుంది..

కాంగ్రెస్ పార్టీ నేతలను జైలుకు పంపకుంటే నాకు శాపం తగులుతుంది. వారు కనీసం బెయిల్‌పైన బయట ఉన్నందుకు సంతోషపడండి. జైలులో ఫలానా 'ఎ' ఎందుకు లేరు, 'బి' ఎందుకు లేరు అంటూ అడిగేవారికి నా సమాధానం ఒక్కటే. జైలుకు ఎవరిని పంపాలి, బెయిల్ ఎవరికి ఇవ్వాలనేది కోర్టులే చూసుకుంటాయి. ప్రజలను యథేచ్ఛగా అరెస్టులు చేయించిన ఎమర్జెన్సీ విధించిన నాటి ప్రభుత్వం కాదు మాది.

పానీ ఔర్ పాయిఖానా...

అభివృద్ధే మా ఎజెండా. ఆధునిక మౌలిక వసతులు, ప్రజా సంక్షేమం ద్వారానే ప్రతి పౌరుడి సాధికారత సాధ్యం. 'మేక్ ఇన్ ఇండియా' నినాదాన్ని మరింత ముందుకు తీసుకెళతాం. 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థగా దేశాన్ని మార్చడానికి కృషిచేద్దాం. దేశంలోని పేదలకు ముఖ్యంగా మహిళలకు (పానీ ఔర్ పాయిఖానా) నీరు, మరుగుదొడ్లు సమకూర్చడం మా లక్ష్యం.

- ప్రధాని మోదీ

న్యూస్‌రీల్

మెహుల్ చోక్సీకి ఎదురు దెబ్బ..

- పౌరసత్వం రద్దు చేస్తామన్న అంటిగ్వా ప్రధాని
- న్యాయపరమైన మార్గాలు మూసుకుపోయాక భారత్‌కు అప్పగింత

- 5లో

అంతరిక్ష కేంద్రం నుంచి క్షేమంగా భూమికి..

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి ముగ్గురు వ్యోమగాములు భూమికి క్షేమంగా చేరుకున్నారు. నాసా వ్యోమగామి అన్నే మెక్‌క్లయిన్, రష్యన్ వ్యోమగామి ఒలెగ్ కొనొనెన్కో, కెనడియన్ స్పేస్ ఏజెన్సీ వ్యోమగామి సెయింట్ జాక్వస్‌లు కజఖ్ సిటీ సమీపంలో మంగళవారం పారాచూట్ సాయంతో సురక్షితంగా భూమిపై అడుగుపెట్టారు.

-వివరాలు 5లో

పాత కారు.. యమా జోరు

భారత ఆటోమొబైల్ మార్కెట్లో కొత్త కార్ల కంటే పాత వాటికే డిమాండ్ పెరుగుతోంది. దేశవ్యాప్తంగా 2018-19లో 33.7 లక్షల కొత్త కార్లు రోడ్డెక్కగా... అదే సమయంలో ఏకంగా 40 లక్షల పాత కార్లు చేతులు మారాయి.

- బిజినెస్‌లో

పల్లెల్లో పచ్చదనం, పరిశుభ్రత

రాష్ట్రంలోని గ్రామసీమలను పచ్చదనం, పరిశుభ్రతకు కేంద్రాలుగా మార్చేందుకు ప్రభుత్వపరంగా కార్యాచరణ సిద్ధమైంది.

-వివరాలు 4లో

15 వేల పోలీసు కొలువులు

కసరత్తు చేస్తున్న రిక్రూట్‌మెంట్ బోర్డు

- 14 వేల కానిస్టేబుల్ పోస్టులు, వెయ్యి ఎస్సై పోస్టుల భర్తీ!
- ఈసారి 33 జిల్లాల ప్రాతిపదికన నియామకాలు
- ప్రస్తుత రిక్రూట్‌మెంట్ పూర్తికాగానే కొత్త నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్

నిరుద్యోగులకు మరో శుభవార్త. త్వరలోనే పోలీసుశాఖలో మరో 15,000 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు నియామక బోర్డు (టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ) కసరత్తు చేస్తోంది. త్వరలోనే భారీగా ఉద్యోగాల భర్తీ ఉంటుందని ఓ సీనియర్ ఐపీఎస్ అధికారి తెలిపారు. ప్రస్తుతం గతేడాది జారీ చేసిన పోలీసు నియామకాల ప్రక్రియను టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ వేగవంతం చేసింది. శారీరక, తుది రాత పరీక్షలు విజయవంతంగా ముగించిన అభ్యర్థులకు ప్రస్తుతం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కూడా పూర్తయింది. త్వరలోనే కటాఫ్ మార్కులు ప్రకటించి అభ్యర్థుల తుది ఎంపిక ప్రక్రియ చేపట్టే పనిలో తలమునకలైంది. ఈ ప్రక్రియ పూర్తయితే డిపార్ట్‌మెంట్‌లోకి కొత్తగా 18,500 మంది అధికారులు విధుల్లో చేరుతారు.

కొత్త జిల్లాల ప్రాతిపదికనే..

గతేడాది మేలో విడుదలైన టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ నోటిఫికేషన్ ప్రకారం పాత జిల్లాల ప్రాతిపదికగా ఖాళీల భర్తీ చేపడుతున్నారు. త్వరలో చేపట్టబోయే రిక్రూట్‌మెంట్‌లో 33 కొత్త జిల్లాల ప్రాతిపాదికన పోస్టుల నియామకం చేపట్టే ఆలోచనలో ఉన్నారు. ఆలోగా కొత్త జిల్లాలకు రాష్ట్రపతి ఆమోదం లభిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుత 18,500 పోస్టులను భర్తీ చేశాక మరోసారి వివిధ విభాగాల్లో కొత్త జిల్లాలవారీగా ఖాళీలను గుర్తిస్తారు. ఈ ప్రక్రియ పూర్తికాగానే 15,000 ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తారు. వాటిలో 14,000 కానిస్టేబుళ్లు, సుమారు 1,000 ఎస్సై పోస్టులు భర్తీ చేయనున్నారని సమాచారం.

వీక్లీ ఆఫ్ అమలుకు ఇక మార్గం సుగమం

ప్రస్తుతం పోలీసుశాఖలో 54,000 మంది పోలీసులు ఉన్నారు. ఇప్పటికే సిబ్బంది కొరతతో కొట్టుమిట్టాడుతున్న పోలీసుశాఖ దశాబ్దాల తరువాత వీక్లీ ఆఫ్‌ను అమలు చేస్తోంది. త్వరలో డిపార్ట్‌మెంట్‌లోకి 18,500 మంది చేరికతో పనిభారం తగ్గనుంది. వారికి అదనంగా 15 వేల మంది చేరితే డిపార్ట్‌మెంట్‌కు మరింత ఉపశమనం లభించనుంది.

ఉండవల్లిలో అక్రమంగా నిర్మించిన ప్రజావేదిక భవనాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

ప్రజావేదిక కూల్చివేత ప్రారంభం

ముందుగా క్యాంటీన్, వంట షెడ్, ప్రహరీ నేలమట్టం

భవనంలోని వస్తువులు ఏపీ సచివాలయానికి తరలింపు

2 లో

గురువులకు గుడ్‌న్యూస్

ప్రమోషన్ల పండుగ

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. నాలుగేళ్లుగా పదోన్నతులు లేక తీవ్ర అసంతృప్తిలో ఉన్న టీచర్లను ప్రమోషన్లతో గౌరవించాలని నిర్ణయించింది. న్యాయ వివాదాలకు తావు లేకుండా యాజమాన్యాలవారీగా పదోన్నతులు కల్పించడానికి సర్కారు అంగీకారం తెలిపింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి అధ్యక్షతన మంగళవారం జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో 2015 తర్వాత టీచర్లకు ఇప్పుడు పదోన్నతులు లభించబోతున్నాయి. విద్యాశాఖ కార్యదర్శి బి.జనార్దన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో విద్యాశాఖ, న్యాయశాఖ, ఆర్థిక శాఖ, సాధారణ పరిపాలన శాఖ అధికారులతో సీఎస్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యతో నాలుగేళ్లుగా పదోన్నతులు ఆగిపోయిన నేపథ్యంలో ఈసారి ఎలాంటి న్యాయ వివాదాలూ తలెత్తకుండా చూసేందుకు యాజమాన్యాల వారీగా పదోన్నతులు కల్పించాలని నిర్ణయించారు. ముందుగా సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతులు కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే పండిట్లు, పీఈటీల అప్‌గ్రేడేషన్‌కు ఉత్తర్వులు జారీచేసినందున వారికి ప్రయోజనం కల్పించేలా వాటిని అమల్లోకి తీసుకురానున్నారు. మిగతా కేడర్ల విషయంలోనూ వివాదాల్లేకుండా ముందుకు సాగాలని నిర్ణయించారు.

- యాజమాన్యాలవారీగా టీచర్లకు పదోన్నతులు
- మార్గదర్శకాల రూపకల్పనకు సర్కారు ఆదేశం..
- కొత్త జిల్లాలవారీగా పదోన్నతులకు నిర్ణయం

వివాదాలకు తావులేని రీతిలో మార్గదర్శకాలు: రాష్ట్రంలో 68వేల మందికి పైగా ఎస్జీటీలు ఉండగా, 40వేల మందికి పైగా స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. ఈ నేపథ్యంలో యాజమాన్యాలవారీగా పదోన్నతులు కల్పిస్తే ఎవరి నుంచి అభ్యంతరాలు రావని భావిస్తున్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్తు

మిగతా 2వ పేజీలో ▶

తెలంగాణ నాడి బాగుంది!

- ఆరోగ్యరంగంలో చక్కని పురోభివృద్ధి
- 21 పెద్ద రాష్ట్రాల్లో మనకు 4వ స్థానం
- కేసీఆర్ కిట్‌తో ఆస్పత్రుల్లో పెరిగిన ప్రసవాలు
- నవజాత శిశుమరణాల తగ్గింపులో పురోగతి
- ఐదేళ్లలోపు పిల్లల మరణాల రేటు తగ్గించడంలో వెనుకబాటు
- నీతి ఆయోగ్ నివేదికలో వెల్లడి

- వివరాలు 2లో

వ్యాపార దిగ్గజం మీలా.. అస్తమయం

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత
- రాష్ట్రపతి పురస్కారం అందుకున్న స్వాతంత్ర్య సమరయోధుడు
- పారిశ్రామికవేత్తగా దేశవ్యాప్తంగా గుర్తింపు.. ప్రముఖుల సంతాపం

-వివరాలు 2లో

మీలా సత్యనారాయణ

వెబ్ ఆప్షన్లు వాయిదా?

- రేపటి నుంచి ఎంసెట్ ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ కష్టమేనంటున్న అధికారులు
- ఫీజుల ఖరారులో గందరగోళమే కారణం
- కోర్టుకెక్కిన కాలేజీలకు అనుకూలంగా వెలువడిన తీర్పు!.. ఆ ఉత్తర్వులు తమకూ వర్తింపజేయాలంటున్న మరో 75 కాలేజీలు
- ఇంకా సీఎం దృష్టికి వెళ్లని వ్యవహారం
- మంత్రి జగదీశ్‌రెడ్డితో తుమ్మల పాపిరెడ్డి భేటీ

సాక్షి, హైదరాబాద్

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ సజావుగా జరిగేనా? షెడ్యూల్ ప్రకారం ఈ నెల 27 నుంచి వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుందా? అంటే ఉన్నతాధికారుల నుంచి ఏమోనన్న అభిప్రాయమే వ్యక్తమవుతోంది. ఫీజుల వ్యవహారంలో తలెత్తిన గందరగోళం ప్రవేశాల కౌన్సెలింగ్‌కు అడ్డంకిగా మారింది. కాలేజీల వారీగా ఫీజులను తేల్చకుండా వెబ్ ఆప్షన్ల ప్రక్రియను ప్రారంభించే అవకాశం లేకపోవడంతో ఈనెల 27 నుంచి జరగాల్సిన వెబ్ ఆప్షన్లు వాయిదా పడే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. దీంతో రాష్ట్రంలో ఇంజనీరింగ్ ఎంసెట్ అర్హత సాధించి ప్రవేశాల కోసం లక్ష మందికిపైగా విద్యార్థులకు ఎదురుచూపులు తప్పేలా లేవు.

ఫీజులు ఖరారు కాకపోవడం వల్లే...

రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాల కోసం గత నెలలో నిర్వహించిన ఎంసెట్ ఫలితాలను ఎంసెట్ కమిటీ ఈ నెల 9న ప్రకటించింది. దానికి అనుగుణంగా ఉన్నత విద్యా మండలి, సాంకేతిక విద్యాశాఖ ప్రవేశాల కమిటీని ఏర్పాటు చేసి ఈ నెల 22న ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేశాయి. అయితే వచ్చే మూడేళ్లలో ఏటా వసూలు చేయాల్సిన ఫీజులను ఖరారు చేయకుండా ఆరు కాలేజీలు కోర్టును ఆశ్రయించాయి. అయితే ప్రభుత్వం తెలంగాణ ఫీజులు, ప్రవేశాల నియంత్రణ కమిటీ (టీఏఎఫ్‌ఆర్‌సీ)కి చైర్మన్‌ను నియమించకుండా జాప్యం చేసినందున యాజమాన్యాలు టీఏఎఫ్‌ఆర్‌సీకి ప్రతిపాదించిన ఫీజును అమలు చేయాలని, చైర్మన్‌ను నియమించి ఫీజులు ఖరారు చేశాక ఎక్కువ తక్కువలు ఉంటే సర్దుబాటు చేసుకునేలా చర్యలు చేపట్టాలని హైకోర్టు తీర్పు ఇచ్చినట్లు ఉన్నత విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఆ తీర్పు కాపీ ఇంతవరకు ప్రభుత్వానికే అందలేదని అధికారులు పేర్కొంటున్నారు. కోర్టు తీర్పు కాపీ అందగానే అప్పీల్‌కు వెళ్లాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు. అంటే ఈ నెల 27 నాటికి తీర్పు కాపీ అందుతుందా? అప్పీల్‌కు వెళతారా? లేదా? అన్న గందరగోళం నెలకొంది. మరోవైపు ఆరు కాలేజీలే కాకుండా మరో 75 కాలేజీలు కూడా అవే ఉత్తర్వులను తమకు వర్తింపజేయాలంటూ కోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది. దీంతో కోర్టు తీర్పును అమలు చేస్తే యాజమాన్య ప్రతిపాదిత

మిగతా 2వ పేజీలో ▶

తెలంగాణ అప్పు రూ. 1,80,239 కోట్లు

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అప్పు గత ఐదేళ్లలో 159 శాతం పెరిగిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. మంగళవారం రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ మహ్మద్ అలీఖాన్ అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానం ఇచ్చారు. 2014 జూన్ 2 నాటికి రూ. 69,517 కోట్ల అప్పు ఉండగా 2019 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి అది రూ. 1,80,239 కోట్లకు చేరిందని వివరించారు. ద్రవ్య జవాబుదారీ, విత్త నిర్వహణ (ఎఫ్ఆర్బీఎం) పరిమితికి మించి ఒకసారి అదనంగా అప్పు తెచ్చుకునేందుకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. దీని ద్వారా 2016-17లో ఉదయ్ స్కీమ్‌లో భాగంగా డిస్కంల అప్పులను ప్రభుత్వ పరిధిలోకి తెచ్చుకునేందుకు వీలుగా రూ. 8,923 కోట్లు అప్పు తెచ్చుకుందని వివరించారు. 2014-15లో ప్రభుత్వ అప్పు రూ.79,880 కోట్లు ఉండగా వడ్డీ చెల్లింపు రూ. 5,593 కోట్లుగా ఉందని, 2015-16లో రూ. 97,992 కోట్ల అప్పు ఉండగా వడ్డీ చెల్లింపు రూ. 7,942 కోట్లుగా ఉందని వివరించారు. 2016-17 నాటికి అప్పు మొత్తం రూ. 1,34,738 కోట్లకు పెరగ్గా వడ్డీ చెల్లింపు రూ. 8,609 కోట్లుగా ఉందని, 2017-18 నాటికి మొత్తం అప్పు రూ. 1,51,133 కోట్లు ఉండగా.. వడ్డీ చెల్లింపు రూ. 11,139 కోట్లుగా ఉందని తెలిపారు. 2018-19లో మొత్తం అప్పు రూ. 1,80,239 కోట్లకు చేరగా వడ్డీ చెల్లింపు రూ. 11,691 కోట్లుగా ఉందని సీతారామన్ తెలిపారు.

మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు

- కొత్త సచివాలయం, అసెంబ్లీ భవనాల నిర్మాణంపై అధ్యయనం
- ఎర్రమంజిల్ ప్యాలెస్, సచివాలయ భవనాల కూల్చివేతపై పరిశీలన
- కమిటీ సిఫారసుల ఆధారంగా నిర్ణయాలు

సాక్షి, హైదరాబాద్: కొత్త సచివాలయం, అసెంబ్లీ భవన సముదాయాల నిర్మాణంపై అధ్యయనం కోసం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటైంది. ఈ కమిటీలో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎక్సైజ్ శాఖ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ సభ్యులుగా వ్యవహరించనున్నారు. రోడ్లు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ మంత్రివర్గ ఉపసంఘానికి సహాయ, సహకారాలు అందించనున్నారు. సచివాలయం, ఎర్రమంజిల్ భవనాల కూల్చివేత, సచివాలయంలోని ప్రభుత్వ శాఖల కార్యాలయాల తరలింపు, కొత్త సచివాలయం, అసెంబ్లీ భవన సముదాయాల నిర్మాణం, ఈ భవనాలకు సంబంధించిన డిజైన్ల ఖరారు తదితర అంశాలపై మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం జరిపి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించనుంది. ఈ నివేదిక ఆధారంగా సచివాలయం, ఎర్రమంజిల్ భవనాల కూల్చివేత, కొత్త భవనాల నిర్మాణంపై ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకోనున్నారు. సాధ్యమైనంత త్వరగా నివేదిక సమర్పించాలని ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని కోరింది.

శంకుస్థాపనలకు ఏర్పాట్లు...

కొత్త సచివాలయం, అసెంబ్లీ భవనాల శంకుస్థాపన కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 27న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కొత్త సచివాలయం, అసెంబ్లీ భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్న విషయం తెలిసిందే. సచివాలయంలోని డీ-బ్లాక్ భవనం వెనుక భాగంలోని పార్కింగ్ ఎదురుగా ఉన్న గార్డెన్‌లో కొత్త సచివాలయం నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. అదేవిధంగా ఎర్రమంజిల్ ప్యాలెస్, ఆర్ అండ్ బీ కార్యాలయ భవన సముదాయం మధ్యలోని ఖాళీ స్థలంలో కొత్త అసెంబ్లీ భవన నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించనున్నారు. శంకుస్థాపన కార్యక్రమాల ఏర్పాట్లలో భాగంగా ఈ రెండు చోట్లా శిలాఫలకాలను సిద్ధం చేస్తున్నారు. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మంగళవారం సాయంత్రం సచివాలయం, ఎర్రమంజిల్‌ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

నూతన సచివాలయ భూమిపూజ కోసం మంగళవారం ప్రస్తుత సచివాలయంలోని డీ-బ్లాక్ వెనుకవైపు ఉన్న పార్కులో తవ్వుతున్న దృశ్యం

స్వచ్ఛభారత్ నిధులు మళ్లించారు

ధన్యవాద తీర్మానంపై చర్చలో ఎంపీ ధర్మపురి అర్వింద్

సాక్షి, న్యూఢిల్లీ: తన లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో మహిళలు అత్యధికంగా ఓటు హక్కు వినియోగించుకోవడం కారణంగానే తాను లోక్‌సభలో ఉన్నట్లు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పేర్కొన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మంగళవారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. మహిళలను గౌరవించడం అందరి బాధ్యత అని, స్వచ్ఛ భారత్ కార్యక్రమం మహిళల ఆత్మ గౌరవాన్ని పెంచిందని పేర్కొన్నారు. కానీ తెలంగాణలో మహిళలకు ఆత్మ గౌరవాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిరాకరించిందని, ఈ పథకం కింద కేటాయించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన ఫ్లాగ్‌షిప్ పథకాల కోసం మళ్లించిందని ఆరోపించారు. ఈమేరకు కాగ్ నివేదిక కూడా ఇచ్చిందని ఆయన తెలిపారు. స్థలాల ధరలు ఆకాశాన్ని అంటడం, నిర్మాణ సామగ్రి ధరలు విపరీతంగా పెరగడంతో పేదలు, అత్యల్ప ఆదాయ వర్గాలు ఇల్లు కట్టుకోవడం అసాధ్యంగా మారిందని ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేయూత ఉంటేనే 2022 నాటికి అందరికీ ఇళ్లు కలసాకారం అవుతుందని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద ఆరోగ్య బీమా పథకమైన ఆయుష్మాన్ భారత్ పథకం లక్షలాది కుటుంబాలకు అండగా ఉందని వివరించారు. అయితే తెలంగాణ ఈ స్కీమ్‌ను ఎంచుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజలు నమ్మి గెలిపిస్తే ఈ తీరుగా వ్యవహరించడం ఆక్షేపణీయమని అర్వింద్ పేర్కొన్నారు.

తెలంగాణ నాడి బాగుంది!

- ఆరోగ్యరంగంలో చక్కని పురోభివృద్ధి
- 21 పెద్ద రాష్ట్రాల్లో మనకు నాలుగో స్థానం
- నీతి ఆయోగ్ నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఆరోగ్య రంగంలో పురోభివృద్ధి సాధిస్తున్న పెద్ద రాష్ట్రాల్లో తెలంగాణ నాలుగో స్థానంలో నిలిచిందని నీతి ఆయోగ్ వెల్లడించింది. 'ఆరోగ్య రంగంలో వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న పురోభివృద్ధి పై'మంగళవారం ఓ నివేదిక విడుదల చేసింది. 2016-17 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2017-18లో ఆరోగ్య రంగంలో జరిగిన అభివృద్ధిని ఇందులో అంచనా వేసింది. ఆరోగ్య రంగంలో 23 అంశాలను ప్రాతిపదికగా చేసుకొని ఆయా రాష్ట్రాలకు ర్యాంకులు కేటాయించింది. ఆ రెండు సంవత్సరాల మధ్య జరిగిన పురోగతిని, వెనుకబాటును విశ్లేషించింది. దీని ప్రకారం దేశంలో 21 పెద్ద రాష్ట్రాల్లో తెలంగాణ నాలుగో స్థానంలో నిలిచిందని పేర్కొంది. నవజాత శిశు మరణాల రేటును తగ్గించడంలో మన రాష్ట్రం అత్యధిక పురోభివృద్ధి సాధించిందని తెలిపింది. 2016-17లో ప్రతి వెయ్యి మందిలో 23 మంది మరణించగా.. 2017-18 లో ఆ సంఖ్య 21కి తగ్గిందని వివరించింది. టీబీ కేసులకు అవసరమైన వైద్యం అందించడంలో పెద్ద ఎత్తున పురోగతి సాధించినట్లు వెల్లడించింది. వ్యాక్సిన్లు వేయడం, ఇమ్యునైజేషన్‌లో భారీ మెరుగుదల ఉన్నట్లు తెలిపింది. అయితే ఐదేళ్లలోపు పిల్లల మరణాల రేటులో మాత్రం మెరుగుదల లేదని, రెండేళ్లలో పరిస్థితి అలాగే ఉందని పేర్కొంది. తక్కువ బరువుతో పిల్లలు పుడుతున్నా చర్యలు తీసుకోవడంలో పెద్దగా పురోగతి లేదని వెల్లడించింది. 2016-17లో వెయ్యి మంది మగ శిశువులకు 918 మంది ఆడ శిశువులు జన్మిస్తే, 2017-18లో అది 901కు తగ్గిందని వివరించింది.

కేసీఆర్ కిట్ భారీ హిట్..

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేయించుకునే మహిళల కోసం తెలంగాణ సర్కారు అనేక ప్రోత్సాహకాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆడబిడ్డ పుడితే రూ.13 వేలు, మగబిడ్డ పుడితే రూ.12 వేలు ప్రభుత్వం అందజేస్తోంది. దీంతోపాటు కేసీఆర్ కిట్ కింద మాతా శిశువుల కోసం వివిధ వస్తువులను ఇస్తున్నారు. దీంతో గ్రామాల్లో కేసీఆర్ కిట్‌కు ఆదరణ భారీగా పెరిగింది. ఫలితంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరిగాయి. 2016-17లో ఆసుపత్రుల్లో ప్రసవాల శాతం 85.35 శాతముంటే, 2017-18లో అవి 91.68 శాతానికి చేరాయి. మరోవైపు ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఏఎన్ఎంల కొరత తీర్చడంలోనూ ప్రభుత్వం విజయం సాధించింది. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో స్టాఫ్ నర్సుల కొరత కూడా పెద్దగా లేదని నీతి ఆయోగ్ పేర్కొంది. అంతకుముందు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్ల కొరత ఉండేది. కానీ ఆ తర్వాత సంవత్సరంలో పరిస్థితి మెరుగుపడింది. రాష్ట్ర ప్రభుత్వం అనేక పీహెచ్‌సీల్లో వైద్యుల పోస్టులను భర్తీ చేసింది. ఇక జిల్లా ఆసుపత్రుల్లో స్పెషలిస్టు వైద్యుల కొరత నుంచి కూడా రాష్ట్రం బయటపడింది. ఈ విషయంలో మంచి పురోగతి ఉందని నీతి ఆయోగ్ వెల్లడించింది. వైద్యులు, ఇతర సిబ్బంది మొత్తంలో కూడా ఆ రెండేళ్లలో మెరుగుదల కనిపించింది. అయితే, జిల్లాల్లో గుండె సంబంధిత యూనిట్ల నిర్వహణలో మాత్రం ఎలాంటి మార్పు రాలేదని నీతి ఆయోగ్ నివేదిక పేర్కొంది. శిశు జననాల నమోదు ప్రక్రియలో భారీ మెరుగుదల ఉందని తెలిపింది. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) ద్వారా వచ్చే నిధులు ఖర్చు చేయడంలో కూడా తెలంగాణ పురోభివృద్ధి సాధించినట్లు నీతి అయోగ్ వివరించింది.

ప్రమోషన్ల పండుగ

▶ మొదటి పేజీ తరువాయి

యాజమాన్యాల వారీగా ఏ యాజమాన్యం వారికి ఆ యాజమాన్యంలోనే పదోన్నతులు కల్పించడం ద్వారా సబ్జెక్టుల నిపుణుల కొరతను తీర్చవచ్చని యోచిస్తున్నారు. గతంలో బదిలీలు చేపట్టినపుడు తెలంగాణ పాత జిల్లాలవారీగా చేశారు. అయితే పదోన్నతులు మాత్రం కొత్త జిల్లాల వారీగానే ఇవ్వాలని కోర్టు ఆదేశించడంతో.. ఆ మేరకే ఈ ప్రక్రియ చేపట్టాలని భావిస్తున్నారు. తొలుత 31 జిల్లాలు ఉండగా.. తర్వాత ప్రభుత్వం మరో రెండు జిల్లాలను ప్రకటించింది. ప్రస్తుతం ఆ రెండు జిల్లాలను రాష్ట్రపతి ఉత్తర్వుల్లో చేర్చేందుకు చర్యలు చేపట్టింది. ఆ ప్రక్రియ పూర్తయ్యేనాటికి ఉపాధ్యాయ పదోన్నతులకు అంతా సిద్ధం చేసి ఉంచాలని నిర్ణయించారు. అందుకు అనుగుణంగా పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలు రూపొందించి పంపించాలని సీఎస్ జోషి ఆదేశించారు. ఏ స్థాయిలోనూ వివాదాలకు అవకాశం ఇవ్వని రీతిలో మార్గదర్శకాలు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలవారీగా పోస్టుల విభజనకు కూడా మార్గదర్శకాలు ఇవ్వాలన్నారు. కొత్త జిల్లాల్లో కొన్నింటిలో ఎక్కువ పోస్టులు ఉంటే కొన్నింటిలో తక్కువ పోస్టులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వాటి విభజన శాస్త్రీయంగా ఉండాలని, న్యాయ వివాదాలకు ఆస్కారం ఇవ్వకుండా పదోన్నతులు చేపట్టేందుకు అందరి అభిప్రాయాలను తీసుకొని మార్గదర్శకాలు రూపొందించాలని ఆయన సూచించారు. వాటన్నింటినీ సిద్ధం చేసి సాధారణ పరిపాలన శాఖకు పంపిస్తే, సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తామని, అనంతరం మరో సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకుందామని పేర్కొన్నారు.

నేటి నుంచి అంతర్జాతీయ విత్తన సదస్సు

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ విత్తన పరీక్షల సంఘం (ఇస్టా) కాంగ్రెస్ గురువారం నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరగనుంది. ఆసియాలోనే మొదటిసారిగా హైదరాబాద్‌లో ఈ సదస్సు జరుగుతుండటంతో అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్ర వ్యవసాయశాఖ సహాయమంత్రి కైలాస్ చౌదరి ఈ సదస్సును ప్రారంభిస్తారు. ముగింపు కార్యక్రమానికి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ హాజరు కానున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి వ్యవసాయ శాస్త్రవేత్తలతోపాటు 80 దేశాల నుంచి దాదాపు 440 మంది విత్తనరంగ నిపుణులు ఈ సదస్సులో పాల్గొంటారు.

తెలంగాణ చేనేత కార్మికులను ఆదుకోండి

ఢిల్లీలో ధర్నా చేపట్టిన నేతన్నల ఐక్య కార్యాచరణ కమిటీ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్రంలో చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ నేతన్నల ఐక్య కార్యాచరణ కమిటీ మంగళవారం ఢిల్లీలో ధర్నా చేపట్టింది. చేనేత కార్మికుల ఆత్మహత్యలు నివారించి వారు ఆత్మాభిమానంతో బతికేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది. కమిటీ చైర్మన్ దాసు సురేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీ వివేక్ సంఘీభావం తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా చేనేత కార్మికుల ఆత్మహత్యలు ఆగకపోవడం విచారకరమని వక్తలు పేర్కొన్నారు. ఇప్పటికే ఆత్మహత్యలు చేసుకున్న నేతన్నల కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. చేనేత రంగానికి ఎంతో చేశామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో పథకాల అమలు లోపభూయిష్టంగా ఉందన్నారు. దీని వల్ల చేనేతలకు చేయూత అందక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. గతంలో ప్రాథమిక వృత్తిగా భావించే చేనేత రంగంలో ఈ రోజు నేతన్నలు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి ఏర్పడిందని సుధాకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వీరిని ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, జీఎస్టీ తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు చేనేతలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి కేసీఆర్ విస్మరించారని మాజీ ఎంపీ వివేక్ విమర్శించారు. బతుకమ్మ చీరల పంపిణీ కాంట్రాక్టులను చేనేత కార్మికులకు ఇవ్వాలని, నేతన్నలకు ప్రభుత్వం బీమా, హెల్త్ కార్డులు కల్పించాలని కోరారు.

వ్యాపార దిగ్గజం మీలా.. అస్తమయం

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత

సూర్యాపేట: ప్రముఖ వ్యాపార దిగ్గజం, స్వాతంత్ర్య సమరయోధుడు, సుధాకర్ పీవీసీ గ్రూప్ కంపెనీ అధినేత, మాజీ మున్సిపల్ చైర్మన్ మీలా సత్యనారాయణ (88) మంగళవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా మీలా సత్యనారాయణ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. మీలా సతీమణి కమలమ్మ నాలుగేళ్ల క్రితమే కన్నుమూశారు. మీలాకు కుమారులు మహదేవ్, వాసుదేవ్, జయదేవ్, కుమార్తెలు విజయ, ఇందిర, రత్నకుమారిలు ఉన్నారు. మీలా అంత్యక్రియలు బుధవారం సూర్యాపేట మండలం గాంధీనగర్‌లోని వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించనున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు.

సుధాకర్ పీవీసీ కంపెనీకి ప్రత్యేక గుర్తింపు..

1971లో ఉపాధ్యాయ వృత్తిని వీడిన మీలా సత్యనారాయణ సుధాకర్ పీవీసీ పైపుల కంపెనీని ప్రారంభించారు. సుధాకర్ పీవీసీ పైపుల కంపెనీకి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు వచ్చేలా కృషి చేశారు. దేశవ్యాప్తంగా పీవీసీ పైపుల కంపెనీలను స్థాపించారు. దీంతో సుధాకర్ అంటే మీలా.. మీలా అంటే సుధాకర్ అన్న రీతిలో పేరు ప్రఖ్యాతులు పొందారు.

రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు..

ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి స్వాతంత్ర్య సమరయోధుడు మీలా సత్యనారాయణను ప్రతిష్టాత్మక రాష్ట్రపతి పురస్కారానికి ఎంపిక చేయగా అప్పటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ నుంచి ఆయన అవార్డును అందుకున్నారు. పారిశ్రామిక రంగంలో ప్రతిష్టాత్మక భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య అవార్డును సొంతం చేసుకున్నారు. హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అవార్డును అమెరికాలో భారత రాయబారి అబీద్ హుస్సేన్ చేతుల మీదుగా తీసుకున్నారు. మీలా సత్యనారాయణ మృతి పట్ల విద్యాశాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ మంత్రి ఆర్.దామోదర్‌రెడ్డి, మల్లు స్వరాజ్యం, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గండూరి ప్రవళికలు ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

నేటి నుంచి గ్రూప్-2 వెబ్ ఆప్షన్లు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్-2 ఇంటర్వ్యూకు అర్హత సాధించిన అభ్యర్థులు పోస్టులు, జోన్ల ప్రాధాన్యత ఆధారంగా నేటి నుంచి వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని టీఎస్‌పీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే ఒకసారి ఇచ్చిన వెబ్ ఆప్షన్స్ మళ్లీ మార్చుకునే అవకాశం ఉండనందున, అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు ఇచ్చేటప్పుడు జాగ్రత్త వహించాలని, వీటి ఆధారంగానే తుది ఎంపిక ఉంటుందని పేర్కొంది. ఇంటర్వ్యూకు హాజరయ్యేలోగా వెబ్ ఆప్షన్ల ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించింది. పూర్తి వివరాలకు అభ్యర్థులు www.tspsc.gov. in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించింది.

కాళోజీకి ఏఐయూలో సభ్యత్వం

సాక్షి, హైదరాబాద్: కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయానికి భారతీయ విశ్వవిద్యాలయాల సంఘం సభ్యత్వం లభించింది. ఈ మేరకు ఏఐయూ సెక్రటరీ జనరల్ ఉత్తర్వులిచ్చారు. ఈ సభ్యత్వంతో కాన్ఫరెన్స్, సెమినార్‌లలో పాల్గొనే అవకాశం వీసీకి లభిస్తుంది.

వెబ్ ఆప్షన్లు వాయిదా?

▶ మొదటి పేజీ తరువాయి

ఫీజును 81 కాలేజీల్లో అమలు చేయాల్సి వస్తుంది. అదే జరిగితే తల్లిదండ్రులపై అధిక భారం పడే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో టీఏఎఫ్ఆర్‌సీకి చైర్మన్ నియామకం, వచ్చే మూడేళ్లపాటు వసూలు చేయాల్సిన ఫీజుల ఖరారు వ్యవహారం, హైకోర్టు ఉత్తర్వులు తదితర అంశాలేవీ ముఖ్యమంత్రి దృష్టికి కూడా వెళ్లనట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి మంగళవారం విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డితో ఈ వ్యవహారంపై చర్చించినట్లు తెలిసింది. మంత్రి కూడా ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళతానని, సమస్యను త్వరగా పరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

రేపటికల్లా స్పష్టత వచ్చేనా?

ప్రవేశాల కౌన్సెలింగ్‌లో భాగంగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్, విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకునే ప్రక్రియ ఈ నెల 27 నుంచి ప్రారంభించేలా ప్రవేశాల కమిటీ ఇప్పటికే షెడ్యూల్ జారీ చేసింది. ఇప్పటివరకు 37,909 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకొని సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకున్నారు. 27వ తేదీన వెరిఫికేషన్ చేయించుకున్న వారు అదే రోజు నుంచి వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంది. కానీ ఇంతవరకు ఫీజుల వ్యవహారమే తేలలేదు. ఫీజుల వ్యవహారంలో కోర్టు తీర్పు కాపీనే అందలేదంటున్న అధికారులు దానిపై అప్పీల్‌కు వెళ్లడం ఈ రెండు రోజుల్లో సాధ్యం కాకపోవచ్చన్న వాదనలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో వెబ్ ఆప్షన్ల ప్రక్రియను వాయిదా వేసే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. వాయిదా వేయకుండా 27వ తేదీ నుంచి వెబ్ ఆప్షన్లు ప్రారంభించాలంటే కోర్టు ఉత్తర్వుల అమలుతోనే ముందుకు వెళ్లాల్సి వస్తుంది. లేదంటే ఇప్పటివరకు కోర్టు తీర్పు కాపీ అధికారికంగా అందలేదని చెబుతున్నారు కాబట్టి కొత్త ఫీజులు ఖరారు చేసే వరకు పాత ఫీజులే అన్న ఆప్షన్‌ను పెట్టి వెబ్ ఆప్షన్లను ప్రారంభించే అవకాశం ఉన్నట్లు సమాచారం. కోర్టు తీర్పు వ్యవహారం అయినందున ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపడుతుందా? లేదా? అన్నది బుధవారం తేలనుంది. మరోవైపు వెబ్ ఆప్షన్ల ప్రక్రియను వాయిదా వేయకుండా ఏమేం ప్రత్యామ్నాయాలు ఉన్నాయన్న అంశాన్ని పరిశీలిస్తున్నామని తుమ్మల పాపిరెడ్డి తెలిపారు.

యాత్రికులను రక్షించండి: కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: మానస సరోవరం యాత్రలో చిక్కుకున్న తెలుగు యాత్రికులను రక్షించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని నేపాల్‌లోని భారత ఎంబసీ అధికారులను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశించారు. దీంతో ఎంబసీ అధికారులు యాత్రికులను ప్రత్యేక హెలికాప్టర్ల ద్వారా నేపాల్ రాజధాని కఠ్మాండుకు తరలించి అక్కడి నుంచి స్వస్థలాలకు పంపే ఏర్పాట్లు చేస్తున్నారు. యాత్రికుల తరలింపు పరిస్థితిని ఎప్పటికప్పుడు తన కార్యాలయానికి తెలియజేయాల్సిందిగా అధికారులకు కిషన్‌రెడ్డి సూచించారు. సదరన్ ట్రావెల్స్ నిర్వాకం వల్ల మానస సరోవరం యాత్రకు వెళ్లిన తెలుగు యాత్రికులు చైనా-నేపాల్ సరిహద్దుల్లో చిక్కుకొని గత ఐదు రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 13న హైదరాబాద్‌కు చెందిన 40 మంది మానస సరోవర్ యాత్రకు వెళ్లారు. యాత్ర ముగించుకొని తిరుగు ప్రయాణమైన తమను సదరన్ ట్రావెల్స్ సంస్థ పట్టించుకోకుండా వదిలేసిందని యాత్రికులు వాపోతున్నారు.

కాళేశ్వరానికి ఒక్క పైసా ఇవ్వలేదు

రాజ్యసభలో కె. కేశవరావు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్రం ఒక్క పైసా కూడా ఇవ్వకపోవడం విచారకరమని టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మంగళవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. 'ఆయుష్మాన్ భారత్ స్కీమ్ గురించి నిన్న నడ్డా మాట్లాడారు. మేము ఆ స్కీమ్‌ను తిరస్కరించాం. మీది కేవలం రూ.300 కోట్ల పథకం. అది 20 లక్షల మందికి ఉద్దేశించింది మాత్రమే. కానీ మా ప్రభుత్వం రూ.800 కోట్ల పథకం తెచ్చింది. ఇది 80 లక్షల మందికి ప్రయోజనం కల్పిస్తోంది. అలాగే మేం రూ.300 కోట్లతో ప్రసూతి సాయం అందిస్తున్నాం. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నాం. కానీ మీరు ఒక్క పైసా ఇవ్వలేదు. మా రాష్ట్రానికి ఈ ప్రాజెక్టుకు రూ.80 వేల కోట్లు ఖర్చయితే ఒక్క పైసా ఇవ్వకపోవడం సమాఖ్య స్ఫూర్తి ఎలా అవుతుంది?..'అని కేశవరావు ప్రశ్నించారు.

గత టీడీపీ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఉండవల్లిలోని ప్రజావేదికను కూల్చివేస్తున్న దృశ్యం

ప్రజావేదిక కూల్చివేత ప్రారంభం

- ముందుగా క్యాంటీన్, వంట షెడ్, ప్రహరీల నేలమట్టం
- భవనంలోని విలువైన వస్తువులు ఏపీ సచివాలయానికి తరలింపు
- భారీ బందోబస్తు ఏర్పాటు

సాక్షి, అమరావతి/తాడేపల్లిరూరల్ (మంగళగిరి): ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించినట్లే అక్రమ నిర్మాణాల కూల్చివేత ఉండవల్లిలోని ప్రజావేదిక నుంచే మొదలైంది. ఏపీ ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు అధికారంలో ఉండగా ఉండవల్లిలో కృష్ణా నది కరకట్టపై అక్రమంగా నిర్మించిన ప్రజావేదికను కూల్చివేయాలని కలెక్టర్ల సమావేశంలో ఏపీ ముఖ్యమంత్రి నిర్ణయించిన విషయం విదితమే. సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ విజయకృష్ణన్ నేతృత్వంలో అధికారుల బృందం మంగళవారం సాయంత్రం ప్రజావేదిక వద్దకు చేరుకుని కూల్చివేతకు అవసరమైన సూచనలు జారీ చేశారు. అందులో ఉన్న ఫర్నిచర్, కంప్యూటర్లు, ఏసీలు, మైక్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ సామగ్రి, పూల మొక్కలు కుండీలు సహా అన్నింటి వివరాలు నమోదు చేసుకుని ఆ తర్వాత కూల్చివ

30 లక్షల సభ్యత్వాల లక్ష్యం

- బీజేపీ సభ్యత్వ నమోదుకు టార్గెట్
- బీజేపీ మెంబర్‌షిప్ ఇన్‌చార్జి ధర్మారావు

సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల 6 నుంచి చేపట్టనున్న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చేపట్టాలని నిర్ణయించినట్లు బీజేపీ సభ్యత్వ నమోదు రాష్ట్ర ఇన్‌చార్జి ఎం.ధర్మారావు పేర్కొన్నారు. ఇందులో భాగంగా తెలంగాణలో నెల రోజుల్లో 30 లక్షల సభ్యత్వాల నమోదు లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఈనెల 26న మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలంగాణకు వస్తున్నారని, సభ్యత్వ కార్యక్రమంపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారని వెల్లడించారు. ప్రతి కార్యకర్త వారం రోజుల పాటు సభ్యత్వం కోసం విస్తారక్‌గా పని చేస్తారన్నారు. రాష్ట్రంలో భారీ సభ్యత్వంతో పార్టీ కీలకంగా మారబోతోందన్నారు.

టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే..

టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమేనని ధర్మారావు స్పష్టం చేశారు. టీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలకు భూమి ఇచ్చుకున్న ప్రభుత్వం బీజేపీ కార్యాలయాల కోసం దరఖాస్తు చేస్తే సెంటు భూమి కూడా ఇవ్వలేదని ఆయన విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల నుంచి పార్లమెంట్ ఎన్నికలకు వచ్చే సరికి టీఆర్ఎస్‌కు పరిస్థితి మారిపోయిందన్నారు. కొత్త అసెంబ్లీ, శాసన మండలి, సచివాలయం నిర్మాణాల కోసం రూ.వందల కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధం అయ్యారని, అది ప్రజలపై భారం మోపడమేనని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ పని అయిపోయిందని, ఇతర పార్టీలకు చెందిన వారు కూడా బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడింది బీజేపీయేనని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, మీడియా కన్వీనర్ సుధాకరశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫెడ్‌లో 'వ్యాట్' కుంభకోణం

మినహాయింపు తీసుకోకపోవడంతో రూ. 3.76 కోట్ల మేర నష్టం

- అధికారుల నిర్లక్ష్యంతో ఈ దుస్థితి... లాభపడ్డ కొందరు అధికారులు
- చర్యలు తీసుకోవడానికి వెనకాడుతున్న ఉన్నతాధికారులు
- మంత్రికి విషయం తెలియకుండా జాగ్రత్త పడుతున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్

తెలంగాణ ఆయిల్‌ఫెడ్‌లో 'వ్యాట్' కుంభకోణం ఆలస్యంగా వెలుగుచూసింది. కొందరు అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆయిల్‌ఫెడ్ దాదాపు రూ. 3.76 కోట్ల మేర నష్టపోయినట్లు విశ్వసనీయ సమాచారం. అంత పెద్ద స్థాయిలో నష్టం జరగడానికి బాధ్యులను గుర్తించినా చర్య తీసుకోవడంలో ఉన్నతాధికారులు ఒత్తిళ్లకు లోనవుతున్నారన్న చర్చ జరుగుతోంది. పైగా దానికి బాధ్యులైన కొందరు సీనియర్ ఉద్యోగులు పైస్థాయిలో అండదండలు చూసుకుని జరిగిన నష్టానికి ఏమాత్రం బాధ్యత వహించడం లేదని తెలిసింది. వ్యవహారం బయటకు పొక్కకుండా పక్కదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డికి ఈ వ్యవహారం తెలియకుండా దాచేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇది నిర్లక్ష్యమా? లేక కోట్ల రూపాయల నష్టం చవిచూడడంలో ఎవరికైనా లబ్ధి జరిగిందా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఆయిల్‌ఫెడ్‌లో ఇతర ఉద్యోగులు కూడా దీనిపై ఉన్నతస్థాయిలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది.

ఆ తర్వాతే మొదలైన అసలు కథ...

ఆయా కంపెనీలు రూ. 3.76 కోట్లు వ్యాట్ చెల్లించాయి. కంపెనీ ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీ, మరో ఫ్యాక్టరీ ఆధునీకరణ అనంతరం అక్కడ పామాయిల్ ఉత్పత్తి జరుగుతోంది. అలా ఉత్పత్తి అయిన పామాయిల్‌ను ఆయిల్‌ఫెడ్ విక్రయిస్తుంది. అలా విక్రయించిన పామాయిల్‌కు కూడా వ్యాట్‌ను చెల్లిస్తుంది. ఇక్కడ జరిగిందేంటంటే ఒకవైపు ఫ్యాక్టరీ, దానికి సంబంధించిన యంత్రాలకు ఆయా కంపెనీలు అప్పటికే వ్యాట్ చెల్లించాయి. మరోసారి ఆయిల్‌ఫెడ్ అవే ఫ్యాక్టరీల ద్వారా తాను ఉత్పత్తి చేసిన పామాయిల్ విక్రయాలపైనా వ్యాట్‌ను చెల్లించింది. కానీ ఇలా చేయాల్సిన అవసరంలేదని ఆయిల్‌ఫెడ్ వర్గాలు చెబుతున్నాయి. ఆయా ఫ్యాక్టరీల మెటీరియల్‌కు వ్యాట్ చెల్లించినందున, వాటి ద్వారా ఉత్పత్తి అయి విక్రయించిన దానికి వ్యాట్ చెల్లించాల్సిన అవసరంలేదని అంటున్నారు. అంటే అక్కడ మినహాయింపు కోరాల్సిన అవసరం ఉంది. ఆయా కంపెనీలు చెల్లించిన రూ. 3.76 కోట్లను మినహాయింపు కోరే అవకాశం ఆయిల్‌ఫెడ్‌కు ఉంది. అంటే ఆయిల్‌ఫెడ్ తాను అమ్మే పామాయిల్‌కు చెల్లించే వ్యాట్ సొమ్ములోనుంచి రూ. 3.76 కోట్లు మినహాయించుకోవాలి. కానీ అలా కొద్ది సొమ్మును మాత్రమే మినహాయించినట్లు తెలిసింది. దీంతో ఆ మేరకు సంస్థ నష్టపోయిందని ఆయిల్‌ఫెడ్ వర్గాలు చెబుతున్నాయి. దీనిపై వ్యాఖ్యానించేందుకు అధికారులు ముందుకు రావడంలేదు.

అసలేం జరిగిందంటే?

2016 నుంచి 2017 జూన్ మధ్య కాలంలో జరిగిన వ్యవహారం ఇది. అప్పట్లో అప్పారావుపేటలో ఆయిల్‌ఫాం ప్లాంటును నెలకొల్పారు. అందుకోసం ఆయిల్‌ఫెడ్ పామాయిల్ ప్లాంటుకు, సివిల్ పనులకు, అన్ని రకాల పనుల కోసం రూ. 75.13 కోట్లు ఖర్చు చేసింది. పామాయిల్ ప్లాంటు, ఇతర యంత్రాలు నెలకొల్పే బాధ్యత ప్రీ యూనిక్ అనే సంస్థకు అప్పగించారు. అందులో ఆ ఒక్కదానికే రూ. 45.42 కోట్లు ఖర్చు చేసింది. ఇలా వివిధ కంపెనీలకు వివిధ రకాల పనులను అప్పగించింది. ఆయా కంపెనీలన్నీ కూడా మిషనరీని కొనుగోలు చేసి అప్పారావుపేటలో ఫ్యాక్టరీని, దానికి సంబంధించిన ఇతర పనులను పూర్తిచేశాయి. మెటీరియల్ విలువను ఆధారం చేసుకొని ఆ కంపెనీలు వ్యాట్‌ను ప్రభుత్వానికి చెల్లించాయి. ఆ మొత్తం వ్యాట్ విలువ రూ. 3.63 కోట్లు. మరోవైపు అశ్వారావుపేటలో అప్పటికే ఉనికిలో ఉన్న పామాయిల్ ఫ్యాక్టరీ ఆధునీకరణ పనుల కోసం ఆయిల్‌ఫెడ్ కొన్ని కంపెనీలకు బాధ్యత అప్పగించింది. ఆ కంపెనీలు రూ. 6 కోట్లకు పైగా విలువైన మెటీరియల్‌ను వాడారు. అందుకోసం దాదాపు రూ. 12.74 లక్షలకు పైగా వ్యాట్ సొమ్ము చెల్లించాయి. రెండూ కలిపి మొత్తంగా రూ. 3.76 కోట్ల వ్యాట్‌ను రెండు ఫ్యాక్టరీలకు కలిపి జరిగిన పనులకు ఆయా కంపెనీలు చెల్లించాయి.

పదేళ్లు ఒకే రిజర్వేషన్

- ఈసారి అమలుచేసే రిజర్వేషనే వచ్చేసారి కూడా వర్తింపు
- పంచాయతీరాజ్ చట్టం తరహాలోనే పురపాలక చట్టం
- వచ్చే ఎన్నికల్లో అమలు చేసేందుకు ప్రభుత్వ యోచన

సాక్షి, హైదరాబాద్: పుర, నగర పాలక సంస్థలకు ప్రస్తుతం ఖరారు చేసే రిజర్వేషన్ రెండు పర్యాయాలు (పదేళ్లు) వర్తింపజేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. గతేడాది అమలులోకి వచ్చిన నూతన పంచాయతీరాజ్ చట్టం తరహాలోనే పుర చట్టంలో ఈ మేరకు మార్పులు, చేర్పులు చేస్తోంది. రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లను అమలుచేయడం వల్ల అభివృద్ధి కుంటుపడుతుందని, అవినీతికి అవకాశం కల్పిస్తుందని భావించిన రాష్ట్ర ప్రభుత్వం.. రొటేషన్ పద్ధతికి స్వస్తి పలికింది. దీనికి అనుగుణంగా కొత్త పంచాయతీరాజ్ చట్టంలో రొటేషన్ స్థానే.. రెండు దఫాలు ఒకే రిజర్వేషన్ వర్తించేలా పొందుపరిచింది. గత జనవరిలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఈ విధానానికి శ్రీకారం చుట్టింది. ఇదే పద్ధతిని త్వరలో జరిగే మునిసిపల్ ఎన్నికల్లోను అనుసరించాలని ప్రభుత్వం దాదాపుగా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కొత్తగా రూపొందిస్తున్న పురపాలక చట్టం-2019లో పొందుపరిచింది. కౌన్సిలర్/కార్పొరేటర్, చైర్‌పర్సన్/మేయర్ పదవులకు ఈ ఏడాది ఖరారు చేసే రిజర్వేషనే వచ్చేసారి కూడా అమలు కానుంది. రెండు పర్యాయాల అనంతరం రొటేషన్ పద్ధతిలో ఆ తర్వాత పదేళ్లకు రిజర్వేషన్‌ను ప్రకటిస్తారు. జూలైలో ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడం.. దానికి అనుగుణంగా పురపాలకశాఖ ఓటర్ల నమోదు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల గుర్తింపు ప్రక్రియను ప్రారంభించిన సంగతి తెలిసిందే. అయితే, మున్సిపల్ చట్టం కొలిక్కివచ్చినా.. ఇప్పటికిప్పుడు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే యోచనలో ప్రభుత్వం లేనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఈ చట్టాన్ని అర్డినెన్స్ ద్వారా మనుగడలోకి తీసుకురావాలని భావిస్తోంది. ఈ మేరకు వచ్చే నెలలో అర్డినెన్స్ జారీ చేసే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం న్యాయశాఖ పరిశీలనలో ఉన్న ముసాయిదా చట్టం నేడో, రేపో ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరనుందని అధికారవర్గాలు తెలిపాయి.

50శాతం మహిళలకు!

స్థానిక సంస్థల్లో అమలు చేస్తున్నట్లుగానే 50 శాతం స్థానాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీలకు కేటాయిస్తారు. 50% మించకుండా రిజర్వేషన్లను అమలు చేయనున్నా రు. కాగా, రిజర్వ్‌డ్ సీట్లేగాకుండా.. అన్‌రిజర్వ్‌డ్ స్థానాల్లో సగం స్థానాలను మహిళలకు కేటాయించనున్నారు. అలాగే చైర్‌పర్సన్/మేయర్, కౌన్సిలర్/కార్పొరేటర్ పదవులకు కూడా ఇదే విధానంలో రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు.

పౌష్టికాహార లభ్యతపై దృష్టి సారించాలి

- స్పష్టం చేసిన శాస్త్రవేత్తలు
- హైదరాబాద్‌లో ఏఎన్‌హెచ్ అకాడమీ వీక్ అంతర్జాతీయ సదస్సు

సాక్షి, హైదరాబాద్: ప్రజలందరికీ పౌష్టికాహారం అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన ప్రయత్నాలు జరగాల్సిన అవసరముందని పలువురు శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. వ్యవసాయం, పౌష్టికత, ఆరోగ్యం అనే అంశాలపై హైదరాబాద్‌లో అంతర్జాతీయ సదస్సు ఒకటి మొదలైంది. ఏఎన్‌హెచ్ అకాడమీ వీక్‌గా పిలుస్తున్న ఈ సదస్సును ఇక్రిశాట్, ఎన్ఐఎన్, లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రాపికల్ మెడిసన్, సీజీఐఏఆర్‌లు సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. ఈ సదస్సులో 35 దేశాలకు చెందిన సుమారు 3,560 మంది శాస్త్రవేత్తలు పాల్గొంటున్నారు. వ్యవసాయం ద్వారా పౌష్టికాహారాన్ని అందించడం ఎలా? తద్వారా ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం ఎలా? అనే అంశాలపై ఈ సదస్సులో చర్చించారు. సదస్సు ప్రారంభం సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీజీఐఏఆర్ పరిశోధనా విభాగం అగ్రికల్చర్ ఫర్ న్యూట్రిషన్ అండ్ హెల్త్ డైరెక్టర్ జాన్ మెక్‌డర్మెట్ మాట్లాడుతూ.. ఆహార భద్రత కోసం భారత్ దశాబ్దాల క్రితం చేపట్టిన హరిత విప్లవం మంచి ఫలితాలిచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం పౌష్టికాహార లభ్యతపై దృష్టి పెట్టడం అవసరమని అన్నారు. ఇప్పటివరకూ ప్రభుత్వం వరి, గోధుమ వంటి ధాన్యాల ఉత్పత్తిని ప్రోత్సహించే విధానా లను అవలంబించిందని.. వీటిని మార్చుకుని పుష్టినిచ్చే కాయగూరలు, పప్పు దినుసులు, చేపలు, ఆకుకూరల పెంపకానికి అనువైన విధానాలను సిద్ధం చేయాలని సూచించారు.

లింగ వివక్ష కోణమూ ఉంది: కడియాల సంగీత

వ్యవసాయం, ఆరోగ్యం, పౌష్టికతల్లో లింగ వివక్ష కోణమూ ఉందని.. పొలాల్లో ఎక్కువ కాలం పనిచేసే మహిళలు పౌష్టికాహారం తీసుకోలేని పరిస్థితుల్లో ఉన్నారని ఇది కాస్తా వారి ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతోందని లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ కడియాల సంగీత తెలిపారు. వాతావరణ మార్పుల ప్రభావం ముంచుకొస్తున్న నేపథ్యంలో పరిస్థితి మరింత అధ్వానంగా తయారయ్యే అవకాశముందని హెచ్చరించారు. ఏఎన్‌హెచ్ అకాడమీ వీక్‌లో భాగంగా తాము ఆయా రంగాల్లో వస్తున్న కొత్త కొత్త అధ్యయనాల ఫలితాలను ఆచరణ రూపంలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని.. ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ఈ చర్యలు కీలకమని అన్నారు. పౌష్టికాహారం పొందేందుకు ఆదాయం ముఖ్యమైన అంశమైనప్పటికీ అదొక్కటే కారణం కాదని అభిప్రాయపడ్డారు. వ్యవసాయం అధిక దిగుబడుల కోసం మాత్రమే కాకుండా.. పోషకాలు అందించేలా మారాల్సిన అవసరముందని చెప్పారు. ఏఎన్‌హెచ్ అకాడమీ వీక్‌కు ఆతిథ్యం ఇస్తున్న జాతీయ పోషకాహార సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ భారతీ కులకర్ణి మాట్లాడుతూ, పౌష్టికాహారం విషయంలో ఎన్ఐఎన్ విస్తృత స్థాయిలో పరిశోధనలు చేస్తోందని.. ప్రభుత్వానికి విధానపరమైన సలహాలు సూచనలు ఇస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్ఐఎన్ సీనియర్ శాస్త్రవేత్త జి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



నేడో, రేపో తహసీల్దార్ల బదిలీలు

- సీఎంవోకు చేరిన ఫైలు..
- ఒకట్రెండు రోజుల్లో ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: నేడో, రేపో తహసీల్దార్ల బదిలీలు కానున్నాయి. అసెంబ్లీ ఎన్నికల వేళ ఒకే జిల్లాలో మూడేళ్లు పనిచేస్తున్న, సొంత జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న తహసీల్దార్లకు ఈసీ ఆదేశాల మేరకు ప్రభుత్వం స్థానచలనం కలిగించింది. గతేడాది సెప్టెంబర్‌లో బదిలీ అయిన తహసీల్దార్లు, ఆర్డీఓలకు వెనువెంటనే వచ్చిన లోక్‌సభ, పంచాయతీ, పరిషత్ ఎన్నికలతో అక్కడే కొనసాగే పరిస్థితి ఏర్పడింది. నెల రోజులక్రితం ఎన్నికల కోడ్ ముగియడంతో పాత జిల్లాలకు బదిలీ చేయాలని రెవెన్యూ అధికారులు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నారు. కుటుంబాలకు దూరంగా విధులు నిర్వర్తిస్తున్నామని, గతంలో పనిచేసిన జిల్లాలకు పంపాలని వేడుకున్నారు. అప్పుడు.. ఇప్పుడు అంటూ దాటవేసిన రెవెన్యూ శాఖ తాజాగా 466 మంది తహసీల్దార్లు, 42 మంది ఆర్డీఓల బదిలీల జాబితాను సీఎం కార్యాలయానికి పంపింది. దీనిపై ఒకట్రెండు రోజుల్లో నిర్ణయం వెలువడే అవకాశముందని ఉన్నతస్థాయి వర్గాలు తెలిపాయి. ఇదిలావుండగా, ప్రస్తుతం నగర శివారు జిల్లాల్లో పనిచేస్తున్న తహసీల్దార్లు తమను బదిలీ చేయకుండా తెరవెనుక చక్రం తిప్పుతున్నట్లు రెవెన్యూ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. మరోవైపు ప్రస్తుతం పనిచేస్తున్న తహసీల్దార్లనే కొనసాగించాలని ఒక జిల్లా కలెక్టర్ లేఖ రాయడం కూడా చర్చనీయాంశంగా మారింది.

తిరుమల తిరుపతి దేవస్థానములు: తిరుపతి
SE-I సర్కిల్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

Roc.Adv. No.13/TA/SE-I/TTD/TPT/2019-20 తేది: 24-06-2019

SE-I సర్కిల్‌లో పంతొమ్మిది (19) పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్‌పై ఇ-టెండర్లు కోరబడుచున్నవి. NIT నంబర్లు దిగువ విధంగా ఉన్నవి:

EE-II	NIT నం.: 72 నుండి 87/EE-II/2019-20	(16 పనులు)
EE-VII	NIT నం.: 36 నుండి 38/EE-VII/2019-20	(03 పనులు)

వివరాల కోసం www.tirupati.org కి లేదా www.tirumala.org కి లాగాన్ చేయండి. పని వివరాల కోసం https://tender.apeprocurement.gov.inకు లాగిన్ చేయండి.

Roc. No.PR4/13907/Adv.No.133/PRO/2019, Dt:25-06-2019 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

తెలంగాణ ప్రభుత్వం
గిరిజన సంక్షేమ శాఖ, వరంగల్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

1) e-Proc. No.DB4/56/E-P-NIT/119 to 124/2019-2020 తేది: 21.06.2019

NIT No.SE/TW/WGL/NIT/119 to 124/2019-20, తేది: 21.06.2019. పనిపేరు : జయశంకర్ భూపాలపల్లి, ఆసిఫాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాలలో ఉన్న గిరిజన సంక్షేమ విద్యాసంస్థలలో ప్రస్తుతమున్న టాయిలెట్స్ మరియు బాత్‌రూమ్స్ పునరుద్ధరణ చేపట్టుటకు దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV: రూ.182.00 లక్షలు. 2) e-Proc.Notice No.DB4/56/E-P-Products/NIT/59 to 61/2019-20, తేది: 22.06.2019, NIT No.SE/TW/WGL/Products/NIT/125/2019-20 తేది: 01.06.2019. పని పేరు: ఆదిలాబాద్, ఖమ్మం మరియు వరంగల్ జిల్లాలలో ఉన్న వివిధ గిరిజన సంక్షేమ విద్యాసంస్థలలో RO ప్లాంట్ 500 LPH కెపాసిటీ (19 నం.లు) తయారీ, సరఫరా, స్థాపన, ప్రారంభం మరియు AMC. మొత్తం ECV: రూ.23.46 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ మరియు ముగింపు తేది (ఆన్‌లైన్): 27.06.2019 సా.5 గం. నుండి 08.07.2019 మ.3 గం. వరకు. టెక్నికల్ బిడ్ తెరుచు తేది: 08.07.2019 సా.5 గం.కు. కమర్షియల్ బిడ్ తెరుచు తేది: 08.07.2019 సా.5.30 గం.కు. ఫోన్ నం.0870-2567645, మెయిల్ ఐడి:setwwgl7@gmail.com. తదుపరి వివరాలకు దర్శించండి www.eprocurement.gov.in

సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, గిరిజన సంక్షేమం, వరంగల్

DIPR RO.No.430-DP/CL/Advt/1/2019-20, Dt:25.06.2019

M/s తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
(తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ)
రిజిస్టర్డ్ కార్పొరేట్ ఆఫీస్ : # 6-2-915, HMWSSB ప్రెమిసెస్, రియర్ బ్లాక్, 3వ అంతస్తు, ఖైరతాబాద్, హైదరాబాద్ - 500 004,
ఇమెయిల్ ID: tsmdcltd@gmail.com
టెలిఫోన్: 040-23323150, టెలిఫ్యాక్స్: 040-23373155,
ISO 9001: 2015 కార్పొరేషన్
CIN: U14220TG2014SGC 095923
TSMDC GST No: 36AAFCT1641L127

సంక్షిప్త ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు

దిగువ ఇచ్చిన వివరాల ప్రకారం దిగువ తెలిపిన పనుల కోసం తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (TSMDC) సంక్షిప్త ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు కోరుతోంది.

టెండరు నం:TSMDC/IT/ERP/2019-20/ తేది:24.06.2019

పనిపేరు: TSMDC లిమిటెడ్ కోసం ఒరాకిల్ E-బిజినెస్ సూట్ (Suite) అమలుచేయుట, నిర్వహణ కోసం ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీ ఎంపిక కోసం.

కాగోరు బిడ్డరు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ https://tender.telangana.gov.in ద్వారా పాల్గొనవలెను. టెండర్ల నియమనిబంధనలతో పాటు పైన తెలిపిన టెండరు షెడ్యూళ్ళ వివరాలను పైన తెలిపిన వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవలెను.

ఎట్టి కారణం తెలియచేయకుండా అన్ని లేదా ఏదైనా టెండర్లను తిరస్కరించేందుకు TSMDC కి హక్కు కలదు.

సం/-
(డా. G. మల్సూర్)
వైస్‌చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్
TSMDC లిమిటెడ్

DIPR RO.No.190-PP/CL/Advt/1/2019-20, Dt: 25.06.2019

నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా
(సాంస్కృతిక మంత్రిత్వశాఖ భారత ప్రభుత్వం పరిధిలోని స్వయం ప్రతిపత్తి గల సంస్థ)
బెంగళూరు సెంటర్
యాక్టింగ్‌లో ఒక సంవత్సర ఇంటెన్సివ్ కోర్సు 2019-20
ప్రవేశ ప్రకటన

నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, బెంగళూరు సెంటర్‌వారు యాక్టింగ్‌లో తమ రెసిడెన్షియల్ ఒక సంవత్సర ఇంటెన్సివ్ సర్టిఫికెట్ కోర్సుకు ప్రవేశం కొరకు దరఖాస్తులు కోరుచున్నారు. కోర్సు 1 ఆగస్టు, 2019 నుండి ప్రారంభమగును. దేశం (భారతదేశం) అంతటి నుంచి ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చును.

బోధనా మాధ్యమం: బోధన భాష ఇంగ్లీషులో ఉంటుంది. పెర్ఫార్మెన్స్ భాష బహు భాషలలో ఉంటుంది (దక్షిణ భారత ద్రావిడ భాషలు). పరీక్ష రాసే భాష ఇంగ్లీషులో గాని లేదా దక్షిణ ప్రాంతంలోని ఏదేని ఒక భాషలో ఉంటుంది.

సీట్ల సంఖ్య: 20 (ఇరవై)

అర్హత:

1. కనీస విద్యార్హత గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుండి ఏదేని డిసిప్లిన్‌లో గ్రాడ్యుయేషన్ లేదా తత్సమానమైన డిగ్రీ ఉండాలి. గిరిజన, జానపద మరియు సాంప్రదాయ ప్రదర్శన కళల కుటుంబాల నుండి అసాధారణ ప్రతిభ గల అభ్యర్థుల విషయంలో దీనికి సడలింపు ఉంటుంది.
2. కనీసం 4 (నాలుగు) ప్రొడక్షన్స్‌లో పాల్గొనడంతో నాటకరంగంలో తగిన పరిజ్ఞానం ఉండాలి.

వయోపరిమితి: 1 జూన్, 2019 నాటికి కనీసం 21 సంవత్సరాలు మరియు గరిష్టంగా 30 సంవత్సరాలు.

స్కాలర్‌షిప్: కోర్సుకు తుదిగా షార్ట్‌లిస్ట్ చేయబడిన అభ్యర్థులకు విద్యా సంవత్సరానికి నెలకు రూ.4,500/- స్కాలర్‌షిప్ ఇవ్వబడును.

ఫారాల లభ్యత: NSD వెబ్‌సైట్ **www.nsd.gov.in** నుండి ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చును మరియు NSD, బెంగళూరు చాప్టర్ పేరున రూ.150/-ల DD తో దాఖలు చేయాలి. పూర్తిచేసిన ఫారాన్ని దిగువ చిరునామాకు పోస్ట్ ద్వారా పంపవచ్చును లేదా స్వయంగా ఇవ్వవచ్చును.

చిరునామా: సెంటర్ డైరెక్టర్, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, బెంగళూరు సెంటర్, కళగ్రామ, మల్లతల్లి బెంగళూరు యూనివర్సిటీ వెనుక, జ్ఞానభారతి క్యాంపస్, బెంగళూరు-560056.

తదుపరి ఏదేని విచారణ కొరకు సంప్రదించండి ఫోన్ నం. 080-2318-3027/ లేదా ఇ-మెయిల్: **nsdbengalurucentre@gmail.com**

చివరి తేది:

పూర్తిచేసిన దరఖాస్తు ఫారం దాఖలుకు చివరి తేది 10 జూలై, 2019. ఈ తేది తరువాత దరఖాస్తులు స్వీకరించబడవు.

28, 29 తేదీల్లో ఇద్దరు సీఎంల భేటీ

- ప్రగతి భవన్‌లో సమావేశమవ్వనున్న కేసీఆర్, జగన్
- జూలై 3న గవర్నర్ సమక్షంలో సీఎస్‌ల భేటీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఏపీ మధ్య విభజన వివాదాల పరిష్కారం దిశగా ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మళ్లీ సమావేశమై చర్చలు జరపనున్నారు. రాష్ట్ర విభజన జరిగి ఐదేళ్లు పూర్తవుతున్నా రెండు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు సత్వర ముగింపు పలికేందుకు ముఖ్యమంత్రులిద్దరూ ఇప్పటికే మూడు పర్యాయాలు సమావేశమై చర్చలు జరిపారు. ఈ నెల 28, 29 తేదీల్లో జరగనున్న ఈ సమావేశానికి కేసీఆర్ క్యాంపు కార్యాలయం ప్రగతి భవన్ వేదిక కానుంది. కృష్ణా, గోదావరి నదీ జలాల పంపకాలతో పాటు విద్యుత్ ఉద్యోగుల విభజన, విద్యుత్ సంస్థల ఆస్తులు, అప్పుల పంపకాలు, రెండు రాష్ట్రాల విద్యుత్ సంస్థలు పరస్పరం చెల్లించుకోవాల్సిన విద్యుత్ బిల్లుల బకాయిలు, పౌర సరఫరాల శాఖ విభజన తదితర అంశాలను ఈ సమావేశ ఏజెండాలో చేర్చినట్లు తెలిసింది. ఈ సమస్యల పరిష్కారం దిశగా సీఎంలిద్దరూ సానుకూల దృక్పథంతో చర్చలు జరిపి పలు విషయాల్లో ఉమ్మడిగా ఓ అభిప్రాయానికి వచ్చే అవకాశముంది. రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు నెలకొల్పడంలో భాగంగా వివాదాల పరిష్కారానికి ఇద్దరు సీఎంలూ చొరవ చూపుతుండటంతో ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఈ సమావేశంలో వచ్చిన ఫలితం ఆధారంగా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు ఎస్‌కే జోషి, ఎల్వీ సుబ్రమణ్యం వచ్చే నెల 3న రాజ్‌భవన్‌లో గవర్నర్ ఈఎస్ ఎల్ నరసింహన్ సమక్షంలో భేటీ అయి చర్చలు జరిపి తుది నిర్ణయం తీసుకోనున్నారు.

కచ్చితంగా పార్టీ మారిపోతా: రాజగోపాల్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో మునిగిపోయే కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు లేదని, తాను కచ్చితంగా ఆ పార్టీని వీడతానని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ శాసనసభా పక్షం టీఆర్ఎస్‌లో విలీనమైన నేపథ్యంలో మిగిలిన సభ్యులను ఏవిధంగా పరిగణిస్తారన్న విషయంలో స్పష్టత కోసం ఎదురుచూస్తున్నట్టు ఆయన తెలిపారు. రాష్ట్రంలో టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...తనలాంటి యువత, దేశ యావత్ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని కోరుకుంటోందని, రాష్ట్రంలో కూడా బలమైన శక్తిగా ఎదిగేందుకు ఒక్క బీజేపీకి మాత్రమే అవకాశముందని చెప్పారు. అందుకే ఆ పార్టీకి దగ్గరవుతున్నట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం, పార్టీ ఇన్‌చార్జి కుంతియా వల్లే ఎన్నికల్లో ఓడిపోవాల్సి వచ్చిందని, అయినప్పటికీ నాయకత్వ మార్పు గురించి రాహుల్‌గాంధీ పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్‌లో ఉండి తాను ప్రజలకు న్యాయం చేయలేకపోతున్నానని, దేశాభివృద్ధికి, తన నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసం బీజేపీకి దగ్గరవుతున్నట్టు చెప్పారు.

నేతల తీరుతోనే కాంగ్రెస్ ఖాళీ: పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: అనాలోచిత నిర్ణయాలు, అసమర్థ నాయకత్వం, అయోమయ వైఖరికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన తెలంగాణ కాంగ్రెస్ పార్టీ దుకాణం ఖాళీ అవుతున్నా.. పార్టీ నాయకత్వం వైఖరిలో ఏమాత్రం మార్పు కనిపించడం లేదని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దిశ తెలియని నావలో ప్రయాణం చేయలేక చాలా మంది కాంగ్రెస్ నేతలు రాజకీయ భవిష్యత్తు కోసం బీజేపీని ఎంచుకుంటున్నారన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో పాటు తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి చెందిన చాలా మంది నేతలు బీజేపీ హైకమాండ్‌తో టచ్‌లో ఉన్నారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంత పెద్దఎత్తున తెలంగాణ కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వలసలు పెరగడానికి కారణం కాంగ్రెస్ నాయకత్వంపై నమ్మకం లేకపోవడమేనని సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ కాంగ్రెస్‌లో సమర్థులైన, అంకితభావం గల నేతలను కుంగదీసి, చెంచాగిరీ చేసే నేతలను ప్రోత్సహిస్తున్నారని ఇదే విషయాన్ని తాను రాహుల్ గాంధీకి చెప్పినప్పటికీ ఆయన పట్టించుకోలేదన్నారు. కొందరు నేతల తీరుతో పార్టీ అధ్యక్ష పదవి నుంచి వైదొలగుతానని భీష్మించుకు కూర్చున్న రాహుల్‌ను ఒప్పించడానికే కాంగ్రెస్ సీనియర్లకు సమయం చాలడం లేదని ఎద్దేవా చేశారు. రాహుల్‌కే కాంగ్రెస్‌లో దిక్కులేనప్పుడు ఇక ఆ పార్టీలో ఉండి సాధించేదేముంటుందని తెలంగాణ కాంగ్రెస్ నేతలు బీజేపీ తీర్థం పుచ్చుకుంటున్నారని ఆయన వివరించారు.

బెంగాల్ రాజకీయాలు కుదరవు: కర్నె

సాక్షి, హైదరాబాద్: బెంగాల్ తరహా రాజకీయాలు తెలంగాణలో కుదరవని, తమకు కనీస రాజకీయ బలం లేని రాష్ట్రాల్లోనూ అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ నేతలు విచిత్ర విన్యాసాలు చేస్తున్నారని టీఆర్ఎస్ శాసనమండలి సభ్యులు కర్నె ప్రభాకర్ మండిపడ్డారు. అసెంబ్లీ ఆవరణలోని టీఆర్ఎస్ శాసనసభా పక్షం కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణలో జరిగే ప్రతీ చిన్న విషయానికి బీజేపీ నేతలు మతం రంగు పులుముతున్నారన్నారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న బీజేపీ ఎంపీలు.. రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తూ అల్లర్లను ప్రేరేపిస్తున్నారన్నారు. ఆదిలాబాద్ వంటి జిల్లాల్లోనూ స్థానిక ఎంపీ సోయం బాపూరావు వర్గాల నడుమ చిచ్చు పెడుతున్నారని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ఆయనతో క్షమాపణ చెప్పించాలని డిమాండు చేశారు. పార్టీ ఎంపీ సంజయ్, ఎమ్మెల్యే రాజాసింగ్ హింసను ప్రేరేపిస్తూ రాజకీయ లబ్దికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పశ్చిమ బెంగాల్ తరహాలో తెలంగాణలోనూ బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు సాగవని, తెలంగాణలో మత రాజకీయాలకు స్థానం లేదని కర్నె ప్రభాకర్ అన్నారు. తెలంగాణలో బీజేపీ నేతలు చేసే యాత్రల ప్రభావం ఏ మాత్రం ఉండదన్నారు. రాష్ట్రంలో నాలుగు సీట్లు గెలిచిన బీజేపీ వాపును చూసి బలుపు అనుకుంటోందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికలు మొదలుకుని అన్ని ఎన్నికల్లోనూ బీజేపీ దారుణంగా ఓటమి పాలైందని కర్నె ప్రభాకర్ విమర్శించారు.

టీఆర్ఎస్ ప్రజా ప్రతినిధుల విరాళం

సాక్షి, హైదరాబాద్: జిల్లా కేంద్రాల్లో టీఆర్ఎస్ పార్టీ కార్యాలయ భవనాల నిర్మాణం కోసం ఆ పార్టీకి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు విరాళాలు అందజేశారు. ఈ మేరకు పలువురు టీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు మంగళవారం బేగంపేటలోని ప్రగతిభవన్‌లో పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌తో భేటీ అయ్యారు. ఒక్కో ప్రజాప్రతినిధి రూ.2.50 లక్షల చొప్పున భవన నిర్మాణాల కోసం వినియోగించాల్సిందిగా కోరుతూ కేటీఆర్‌కు చెక్కులు అందజేశారు. మాజీమంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీలు భానుప్రసాద్‌రావు, పురాణం సతీశ్, ఎమ్మెల్యే బాల్క సుమన్ చెక్కులు అందజేసిన వారిలో ఉన్నారు. కాగా టీఆర్ఎస్ జిల్లా కార్యాలయాల నిర్మాణం కోసం విరాళం ఇచ్చిన ప్రజా ప్రతినిధులను కేటీఆర్ అభినందించారు.

ట్రాఫిక్‌కు పరిష్కారం చూపాలి: జగ్గారెడ్డి

సాక్షి, హైదరాబాద్: నగరంలో వర్షం పడితే గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతోందని, ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. మంగళవారం గాంధీ భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ సమస్యలకు ప్రభుత్వం ప్రత్యామ్నాయం ఆలోచించాలన్నారు. వాహనాల రద్దీతో అంబులెన్స్‌లకు దారివ్వలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకొని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఔటర్ రింగ్‌రోడ్డు, మెట్రోలను తీసుకొచ్చారని గుర్తు చేశారు. ట్రాఫిక్ జామ్‌పై ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు తక్షణమే సమీక్ష నిర్వహించి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు ప్రజలు వందసీట్లు కట్టబెట్టారని కానీ అప్పుడు ఇచ్చిన హామీలను గులాబీ నాయకులు గాలికొదిలేశారని విమర్శించారు. వర్షం పడినప్పుడు నగరవాసులను బయటకు రావద్దని చెప్పడం వరకు బాగుందని, అసలు వర్షం పడుతుందని ప్రజలకు ముందే ఎలా తెలుస్తుందని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ట్రాఫిక్‌కు కాంగ్రేసే కారణమంటూ టీఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలు సరికావని జగ్గారెడ్డి మండిపడ్డారు.

పల్లెల్లో పచ్చదనం, పరిశుభ్రత

ప్రభుత్వ పరంగా సిద్ధమైన కార్యాచరణ

- సిటీ సౌకర్యాలను పల్లె ప్రజలకు అందించాలని నిర్ణయం
- దోమల నిరోధానికి వారంలో ఓ రోజు 'డ్రై డే' నిర్వహణ
- విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్న పంచాయతీ రాజ్ శాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామసీమలను పచ్చదనం, పరిశుభ్రతకు కేంద్రాలుగా మార్చేందుకు ప్రభుత్వపరంగా కార్యాచరణ సిద్ధమైంది. గ్రామపంచాయతీల్లో పచ్చదనం, పరిశుభ్రత ప్రధాన అంశాలుగా విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలతోపాటు వాటి అమలుకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోంది. నగరాల్లో పౌరులకు అందుబాటులోకి వచ్చే సౌకర్యాలన్నీ కూడా పల్లె ప్రజలకు కూడా అందేలా మార్పు తీసుకురావాలని నిర్ణయించింది. గ్రామాల్లోనూ పూర్తిస్థాయిలో పారిశుధ్యం, వీధి దీపాలు, ఇతర మౌలిక సౌకర్యాల కల్పనకు కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకొచ్చిన ప్రభుత్వం.. దీనిని పకడ్బందీగా అమలు చేసేందుకు కార్యక్రమాలను రూపొందించింది. పంచాయతీల్లో సౌకర్యాలు మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రచార కార్యక్రమాలకు సంబంధించి గతంలోనే సీఎం కేసీఆర్ ఆదేశాలిచ్చారు. వీటిని తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు, జెడ్పీపీ సీఈవోలు, జిల్లా పంచాయతీ అధికారులకు పీఆర్ శాఖ కొన్ని రోజుల క్రితం ఒక మెమోను కూడా జారీ చేసింది. పచ్చదనం, పరిశుభ్రతకు సంబంధించిన పనుల పర్యవేక్షణను గ్రామపంచాయతీ, సర్పంచ్‌లతోపాటు ఈవోపీఆర్డీ, ఎంపీడీవోలు చేపట్టాలని సూచించింది. పచ్చదనం, పరిశుభ్రత క్యాంపెయిన్ సందర్భంగా అన్ని గ్రామాల్లో ఎంపీడీవోలు, ఈవోపీఆర్‌లు, డీపీవోలు, డీఎల్‌పీవోలు విస్తృతంగా పర్యటించి ప్రభుత్వం నిర్ణయించిన కార్యక్రమాలు పక్కాగా అమలయ్యేలా చూడాలని ఆదేశించింది.

ఈ-పంచాయతీలు...

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో ఉపయోగించుకుని గ్రామ పంచాయతీలను ఈ-పంచాయతీలుగా మార్చే క్రమంలో సాంకేతికంగా ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులు, సామగ్రిని ఉపయోగించుకోవడంతో పాటు మెరుగైన సాంకేతికతలను అనుసరించే దిశలో చర్యలు చేపట్టనున్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఆన్‌లైన్‌లో వివిధ కార్యకలాపాల నిర్వహణపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. పంచాయతీల్లో ఆన్‌లైన్ డేటాఎంట్రీపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పంచాయతీ మాడ్యూల్స్‌ను అప్‌లోడ్ చేయడం వంటివి పూర్తిచేయాలని జిల్లా పంచాయతీ అధికారుల (డీపీవో)ను పీఆర్ శాఖ ఆదేశించింది. భవన నిర్మాణ అనుమతులు, లే అవుట్ల పర్మిషన్లను ఆన్‌లైన్‌లోనే జారీ చేసేందుకు వీలుగా సాంకేతిక ప రమైన వసతులు సమకూర్చుకోవాలని సూచించింది. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, భూరి కార్డుల మ్యుటేషన్లు, ట్రేడ్ లైసెన్స్‌ల జారీ వంటి వాటిని ఆన్‌లైన్‌లోనే అందించేందుకు వీలుగా ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంది. గ్రామ పంచాయతీల పరిధిలో జరిగే వివాహాలను తప్పనిసరిగా అక్కడే రిజిష్టర్ చేసేలా చూడాలని సూచించింది. పంచాయతీ కార్యదర్శులకు పనితీరు సూచికలు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం.

పంచాయతీల్లో 'డ్రై డే'..

గ్రామ పంచాయతీల్లో దోమల వృద్ధి లేకుండా నిరోధించేందుకు వారానికి ఒకరోజు 'డ్రై డే' నిర్వహించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా పంచాయతీ సిబ్బంది వారానికి ఒకరోజు ఇంటింటికి వెళ్లి డ్రై డే పాటించాల్సిన ప్రాముఖ్యతను వివరిస్తారు. ఇళ్లు, వాటి చుట్టూ ఉన్న పరిసరాల్లోని గుంటలు, తొట్టెలు, పాత టైర్లు తదితరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసేలా ప్రజల్లో చైతన్యం కల్పిస్తారు. రాష్ట్రంలోని అన్ని పల్లెలను పచ్చదనం, పరిశుభ్రతతో కూడిన గ్రామాలుగా తీర్చిదిద్దడంలో భాగంగా వివిధ రూపాల్లో విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఇదివరకే పీఆర్ శాఖ సూచించింది.

మంగళవారం పార్టీ కార్యాలయంలో దత్తాత్రేయను సన్మానిస్తున్న లక్ష్మణ్, మురళీధర్‌రావు. చిత్రంలో రాజాసింగ్ తదితరులు

ఐసీయూలో కాంగ్రెస్..

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్
- ఎమర్జెన్సీలో జైలుకు వెళ్లిన వారికి సన్మానం

సాక్షి, హైదరాబాద్: ఎమర్జెన్సీ సమయంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక మంది నాయకులు, ప్రజలను జైలుపాలు చేసిందని, ఇప్పుడు అదే పార్టీ నేడు ఎమర్జెన్సీ వార్డులో చేరిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ విమర్శించారు. ఎమర్జెన్సీ సమయంలో వాజ్‌పేయి, జయప్రకాశ్‌నారాయణ్ వంటి నేతలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్టు చేసిందని, ఇతర పార్టీ నేతలెవ్వరినీ బయట తిరగనివ్వకుండా ఎన్నో అరాచకాలకు పాల్పడిందని ఆయన గుర్తు చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జూన్ 25 ఎమర్జెన్సీ వ్యతిరేక దినం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఎమర్జెన్సీ రోజుల్లో ఇందిరా గాంధీ ప్రభుత్వం అరెస్సెస్‌పై నిషేధం విధించినా ప్రజలను కాపాడేందుకు గొప్పగా పోరాడిందన్నారు. తనకు ఎదురులేదని ఎన్నికలకు వెళ్లిన ఇందిరా గాంధీ ప్రభుత్వాన్ని జనసంఘ్ ఓడించిందన్నారు. ఆ ఎన్నికల్లో ఇందిరాగాంధీతో సహా కాంగ్రెస్ నుంచి పోటీచేసిన అనేకమంది నేతలు ఓటమి పాలయ్యారన్నారు. నాడు కాంగ్రెస్ పార్టీకి పట్టించిన గతినే నేడు తెలంగాణలో టీఆర్ఎస్‌కూ పట్టిస్తారన్నారు. నియంతృత్వ పోకడలకుపోయిన వారు పతనం కాక తప్పదని హెచ్చరించారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు మాట్లాడుతూ.. జూన్ 25 నేపథ్యం అందరూ తెలుసుకోవాలని, ఎమర్జెన్సీ తరువాతే తాను ఆరెస్సెస్‌లో చేరానని చెప్పారు. ఎంతోమంది నాయకులు త్యాగాలు చేయడంతో పాటు ప్రజల సమయస్ఫూర్తితోనే దేశంలో మళ్లీ ప్రజాస్వామ్యం పరిఢవిల్లిందన్నారు. బీజేపీకి ప్రజాస్వామ్యమే శ్వాస అని పేర్కొన్నారు. బీజేపీ మినహా ఏ పార్టీకి అంతర్గత ప్రజాస్వామ్యం లేదన్నారు. ఇందిరా పార్కు వద్ద వ్యతిరేకత కనిపించకుండా చేయాలని చూస్తే రాష్ట్ర వ్యాప్తంగా మరింత వ్యతిరేకత వచ్చిందన్నారు. బీజేపీలో పదవులను ఆశించి ఎవరూ చేరరన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజాసింగ్, మాజీ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దత్తాత్రేయతో సహా ఎమర్జెన్సీ సమయంలో జైలుకు వెళ్లిన వారిని సన్మానించారు.

ప్రతి పశువుకూ బీమా

- రైతు బీమా తరహాలో అమలు చేసే యోచనలో ప్రభుత్వం
- గోపాలమిత్రలకు రాష్ట్రస్థాయి శిక్షణలో మంత్రి తలసాని

సాక్షి, మెదక్: రైతుబీమా తరహాలో ప్రతి పశువుకూ బీమా చేసే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రంలోని ఓ గార్డెన్‌లో మంగళవారం రాష్ట్ర స్థాయిలో గోపాలమిత్రలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధి చెందాలని, ఇందులో గోపాలమిత్రలు కీలకపాత్ర పోషించాలని సూచించారు. గోపాలమిత్రలకు గతంలో గౌరవ వేతనం రూ.3,500 ఉండగా.. ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.8,500కు పెంచారని గుర్తు చేశారు. రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలని చెప్పారు

గొర్రెల పంపిణీ విజయవంతం..

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకుగాను అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం చేపడుతోందని తలసాని వివరించారు. ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ కార్యక్రమం విజయవంతమైందని.. ఈ కార్యక్రమంతో గొల్ల, కుర్మల కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయన్నారు. మరో 15 రోజుల్లో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపడతామని చెప్పారు. దేశం గర్వపడే విధంగా తెలంగాణలో గొల్లకుర్మల కుటుంబాలు ఆర్థికంగా ఎదుగుతున్నాయన్నారు.

త్వరలో వెటర్నరీ ఆస్పత్రుల అప్‌గ్రేడ్

రాష్ట్రంలోని వెటర్నరీ ఆస్పత్రులను కొన్నింటిని అప్‌గ్రేడ్ చేయడంతో పాటు శిథిలావస్థలో ఉన్న వాటిని వెంటనే మరమ్మతులు చేయిస్తామని మంత్రి తలసాని తెలిపారు. అంతకుముందు పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ స్టాళ్లను మంత్రి, మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ కార్యదర్శి సందీప్‌కుమార్, టీఎస్ఎల్‌డీఏ చైర్మన్ రాజేశ్వరరావు తదితరులతో కలసి ప్రారంభించారు.

ఇది పట్టింపు లేని ప్రభుత్వం: కరుణాగోపాల్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగర పౌరులకు టీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని, నగరవాసుల బాధలను అసలు పట్టించుకోవట్లేదని బీజేపీ జాతీయ నాయకురాలు కరుణాగోపాల్ విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. 2014లో టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దుతామని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. కేవలం కొద్ది మిల్లీమీటర్ల వర్షంతోనే జనజీవనం పూర్తిగా స్తంభించిపోయే ఒక అంతర్జాతీయ స్థాయి నగరం ఇలానే ఉంటుందా అని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ప్రధాని 2015 లో స్మార్ట్‌సిటీ మిషన్‌ను ప్రకటించినప్పుడు, తమది ఇప్పటికే స్మార్ట్‌సిటీ కాబట్టి తాము ఈ మిషన్‌లో భాగం కాదలచుకోలేదని అప్పటి మంత్రి కేటీఆర్ అన్నారని గుర్తు చేశారు. భూగర్భ మురుగునీటి పారుదల సక్రమంగా లేకపోతే నగరంలో వరదలు సంభవిస్తాయని, నాలాల్లో పూడికతీత, ఆక్రమణల తొలగింపు, పెద్ద ఎత్తున ప్రచారాన్ని నిర్వహించడం వంటివి ప్రణాళిక బద్ధంగా చేపట్టాలన్నారు.

గిరిజన ప్రాంతాల్లోనే వైద్య పరీక్షలు

- వ్యాధుల నిర్ధారణకు మొబైల్ డయాగ్నొస్టిక్స్ ల్యాబ్‌లు
- ప్రతి ఒక్కరికీ నెలకోసారి పరీక్షలు చేయాలని సర్కారు నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: గిరిజనుల వైద్యంపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో మొబైల్ డయాగ్నొస్టిక్స్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. గిరిజన ప్రాంత ప్రజలకు అన్ని రకాల రక్త, మూత్ర పరీక్షలు చేసేలా చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం అధునాతన యంత్రాలను కొనుగోలు చేసి మొబైల్ వాహనాల్లో గిరిజన ప్రాంతాలకే వెళ్లి పరీక్షలు నిర్వహించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయం తీసుకుంది. ఆ శాఖ మంత్రి ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో అధికారులు ఇప్పటికే యంత్రాలను పరిశీలించారు. ఒక్కొక్కటి రూ.40 లక్షల వ్యయంతో 12 నుంచి 15 అత్యాధునిక యంత్రాలు కొనుగోలు చేయడానికి వైద్యారోగ్యశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

గిరిజన వైద్యానికి పెద్దపీట

గతంలో గిరిజన గ్రామాల్లో ప్రజలు అనారోగ్యం బారిన పడితే సరైన వైద్యం అందకపోవడంతో మరణాల సంఖ్య కూడా అధికంగా ఉండేది. వర్షాలు ప్రారంభమైతే మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, అతిసారం వంటి వ్యాధులు గిరిజనుల పాలిట శాపంగా మారేవి. ఈ నేపథ్యంలో తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రభుత్వం గిరిజన వైద్యానికి పెద్దపీట వేసింది. క్షేత్రస్థాయిలో సిబ్బంది వైద్యసేవలను మెరుగుపర్చడంతో పాటు ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో వ్యాధుల నివారణ సాధ్యమైంది. గత మూడేళ్లుగా గిరిజన గూడేల్లోని మలేరియా మరణాలకు బ్రేక్ పడింది. ఏటా వందల సంఖ్యలో ఉండే మరణాలను పూర్తిగా నివారించగలిగింది. ప్రాథమిక దశలోనే వ్యాధులను నిర్ధారించి చికిత్సలు చేయడంతో ఏజెన్సీలో గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా పలు వ్యాధులకు కారణమయ్యే దోమకాటుకు గురికాకుండా గిరిజన ప్రజలకు దోమతెరలు పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అలాగే వ్యాధులను ముందుగానే నిర్ధారించేందుకు డయాగ్నొస్టిక్స్ సెంటర్లను వారి చెంతకే తీసుకెళ్లనున్నారు. ప్రస్తుతం అధికారులు ఎంపిక చేసిన యంత్రం సాయంతో ఒక్కసారే 200 మందికి సంబంధించిన రక్త నమూనాలకు గంట వ్యవధిలోనే వివిధ రకాల పరీక్షలు నిర్వహించవచ్చు. ప్రతి గ్రామంలో నెలకు కనీసం ఒకసారి ఈ యంత్రాల సాయంతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు చేయనున్నారు. ప్రస్తుతం గిరిజన ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నప్పటికీ, అక్కడ అవసరమైన రోగ నిర్ధారణ యంత్రాలు లేవు. ఏదైనా రోగం వస్తే, అది ముదిరే వరకు గిరిజనులు ఆస్పత్రులకు రావడంలేదు. దీంతో ప్రాణ నష్టం జరుగుతోంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో విష జ్వరాలు, వైరస్‌లు విజృంభించే ప్రమాదముంది. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరగా మొబైల్ ల్యాబ్‌లు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి ఈటల రాజేందర్ అధికారులకు సూచించారు.

రాజగోపాల్‌కు ఆ హక్కు లేదు: మల్లు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడే నైతిక హక్కు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి లేదని పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే నావ అనడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మంగళవారం గాంధీభవన్‌లో మల్లు రవి మాట్లాడుతూ పార్టీ మారిన రాజగోపాల్‌రెడ్డిలు ఎందరో కనుమరుగయ్యారని, భవిష్యత్తు కాంగ్రెస్‌దే అని జోస్యం చెప్పారు. ముందు రాజగోపాల్‌రెడ్డి తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బీజేపీలో చేరాలని డిమాండ్ చేశారు.

రూ. 200 కోట్లతో మౌలిక సదుపాయాలు

- ఆస్పత్రుల్లో ఫర్నిచర్ సహా అన్నింటినీ కల్పించాలని యోచన
- పీహెచ్‌సీలు మొదలు బోధనాసుపత్రుల్లో కల్పన
- వైద్య ఆరోగ్య శాఖ ప్రణాళికలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుప

కాంగ్రెస్‌కు వారే కనిపిస్తారు

మన్మోహన్, పీవీ వంటి వారిని విస్మరించారు • మేం ప్రణబ్‌ను భారతరత్నతో గౌరవించాం

- దేశాభివృద్ధికి కలిసి సాగుదాం
- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మోదీ

మంగళవారం లోక్‌సభలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: గాంధీ–నెహ్రూ కుటుంబసభ్యులు మినహా మరెవరినీ కాంగ్రెస్ పార్టీ పట్టించుకోలేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. దేశం కోసం పనిచేసిన ఇతర నేతలకు కనీసం గుర్తింపు కూడా ఆ నేతలు ఇవ్వలేదని ఆరోపించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ముగింపు సందర్భంగా మంగళవారం ప్రధాని లోక్‌సభలో సుదీర్ఘంగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన.. 'దేశంలో అత్యవసర పరిస్థితి విధించి దేశం ఆత్మను చంపేసింది. ముస్లిం మహిళలకు సాధికారిత కల్పించేందుకు వచ్చిన అవకాశాలను జార విడిచింది'అంటూ కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అభివృద్ధి చెందిన, బలమైన దేశంగా ఎదిగేందుకు పార్టీలకతీతంగా కలిసి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానానికి సభ మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది.

వారు మాత్రమేనా?

రెండోసారి అధికార బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా ప్రధాని లోక్‌సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన.. తమ నేతల సేవలను గుర్తించడం లేదంటూ కాంగ్రెస్ చేస్తున్న విమర్శలపై స్పందించారు. 'జాతి నిర్మాణానికి కృషి చేసిన కొద్దిమంది పేర్లను మాత్రమే కొందరు నేతలు ప్రస్తావిస్తున్నారు. ఇతరులను మరుగుపరచడమే వారి ఉద్దేశం. మేం అలా కాదు, దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామిగా ఉన్నారనే భావిస్తాం. వారు ఎన్నడైనా పీవీ నరసింహారావు చేపట్టిన మంచి కార్యక్రమాల గురించి లోక్‌సభలో ప్రస్తావించారా? మన్మోహన్ సింగ్ జీ ఘనతపై మాట్లాడారా?' అని ప్రశ్నించారు. వాజపేయి అందించిన సేవలను యూపీఏ ప్రభుత్వం గుర్తించలేదన్నారు. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ వంటి నేతలను భారతరత్న పురస్కారంతో తాము గౌరవించామన్నారు.

మీరు పైకి ఎదిగితేనే మాకు సంతోషం

విమర్శలతో తమ పార్టీ స్థాయిని మోదీ ఏమాత్రం దిగజార్చలేరని అనంతరం కాంగ్రెస్ పక్ష నేత అధిర్ రంజన్ తిప్పికొట్టారు. దీనికి ప్రధాని స్పందిస్తూ..'ఉన్నత స్థాయిలో ఉన్నట్లుగా మీరు ఎంతగా భావిస్తే కింద ఉన్నవారు అక్కడ తక్కువగా, అసహ్యంగా మీకు కనిపిస్తారు. మాకు అంత ఎత్తుకు ఎదగాలని లేదు. ప్రజలతో నేలపై ఉండటంలోనే మాకు ఆనందం' అని అన్నారు. 'కాంగ్రెస్ పార్టీ నేతలను జైలుకు పంపకుంటే నాకు శాపం తగులుతుంది. వారు కనీసం బెయిల్‌పైన బయట ఉన్నందుకు సంతోషపడండి' అని సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను ఉద్దేశించి పరోక్షంగా అన్నారు.'జైలులో ఫలానా 'ఎ'ఎందుకు లేరు, 'బి' ఎందుకు లేరు అంటూ అడిగేవారికి నా సమాధానం ఒక్కటే. జైలుకు ఎవరిని పంపాలి, బెయిల్ ఎవరికి ఇవ్వాలనేది కోర్టులే చూసుకుంటాయి. ప్రజలను యథేచ్ఛగా అరెస్టులు చేయించిన ఎమర్జెన్సీ విధించిన నాటి ప్రభుత్వం కాదు మాది' అని ప్రధాని అన్నారు.

అభివృద్ధిని విస్మరించబోం

'అభివృద్ధే మా ఎజెండా. దీనిని మేం విస్మరించబోం. ఆధునిక మౌలిక వసతులు, ప్రజా సంక్షేమం ద్వారానే ప్రతి పౌరుడి సాధికారిత సాధ్యం. 'మేక్ ఇన్ ఇండియా' నినాదాన్ని మరింత ముందుకు తీసుకెళతాం. 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థగా దేశాన్ని మార్చడానికి కలిసి కృషిచేద్దాం' అన్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చాక తాము తీసుకున్న చర్యలు రైతులు, వ్యాపారులు, యువతతోపాటు ఇతర వర్గాల వారికి ఎంతో ప్రయోజనం కలిగిస్తాయన్నారు. 'సోషలిస్ట్ నేత రాం మనోహర్ లోహియా చెప్పినట్లుగా దేశంలోని పేదలకు ముఖ్యంగా మహిళలకు (పానీ ఔర్ పాయిఖానా) నీరు, మరుగుదొడ్లు సమకూర్చడం మా లక్ష్యం' అని అన్నారు. పేదల సంక్షేమం, ఆధునిక మౌలిక సదుపాయాలు కలిగిన సమ్మిళిత భారతం కోసం విభేదాలు మరిచి కలిసి పనిచేద్దామన్నారు.

ఇది ఎమర్జెన్సీ ప్రకటించిన రోజు

కాంగ్రెస్ హయాంలో 1975 జూన్ 25వ తేదీన విధించిన ఎమర్జెన్సీ దేశ ప్రజాస్వామ్యంపై మాయని మచ్చ అని ప్రధాని అన్నారు. 'పత్రికల గొంతులు నొక్కి, న్యాయ వ్యవస్థను అగౌరవపరిచిన ఎమర్జెన్సీకి నేటితో 44 ఏళ్లు. అప్పటి చీకటి రోజులను మర్చిపోలేం. దేశంలో అత్యవసర పరిస్థితి విధించి దేశం ఆత్మను చంపేసింది' అని అప్పటి ఇందిరా గాంధీ ప్రభుత్వాన్ని విమర్శించారు.

ముస్లింలను ఎదగనివ్వలేదు

ముస్లిం మహిళలకు సాధికారిత కల్పించేందుకు వచ్చిన ఎన్నో అవకాశాలను కాంగ్రెస్ జార విడిచింది. 'ముస్లింలను ఎదగనివ్వడం మా పార్టీ బాధ్యత కాదు. వారు బురదలోనే ఉండాలనుకుంటే అలాగే ఉండనివ్వండి' అంటూ అప్పటి నేతలు అనే వారని రాజీవ్ గాంధీ హయాంలో మంత్రిగా పనిచేసిన మంత్రి ఒకరు ఇటీవల తనకు చెప్పారని మోదీ తెలిపారు. ఈ వ్యాఖ్యలతో కాంగ్రెస్ సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. సదరు నేత వ్యాఖ్యల వీడియోను యూట్యూబ్‌లో ఉంచుతామని మోదీ అన్నారు. ముస్లిం మహిళల అభివృద్ధి కోసం వచ్చిన మరో అవకాశాన్ని వదలకండంటూ త్వరలో ప్రవేశపెట్టబోయే ట్రిపుల్ తలాక్ బిల్లునుద్దేశించి అన్నారు.

అంతరిక్ష కేంద్రం నుంచి క్షేమంగా భూమికి..

కజఖ్ సిటీ దగ్గర్లో ల్యాండ్ అయిన వ్యోమగామి అన్నే మెక్‌క్లయిన్

జెజ్కాజ్‌గన్: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి ముగ్గురు వ్యోమగాములు భూమికి క్షేమంగా చేరుకున్నారు. నాసా వ్యోమగామి అన్నే మెక్‌క్లయిన్, రష్యన్ వ్యోమగామి ఒలెగ్ కొనోనెన్కో, కెనడియన్ స్పేస్ ఏజెన్సీ వ్యోమగామి సెయింట్ జాక్వస్‌లు కజఖ్ సిటీ సమీపంలో మంగళవారం పారాచూట్ సాయంతో సురక్షితంగా భూమిపై అడుగుపెట్టారు. రష్యన్ అంతరిక్ష కార్యక్రమంలో భాగంగా సోయుజ్ రాకెట్‌లో ఈ ముగ్గురు అంతరిక్ష కేంద్రానికి డిసెంబర్ 3న వెళ్లారు. అంతకుముందు అక్టోబర్‌లో రష్యా, అమెరికాకు చెందిన వ్యోమగాములు అలెస్కీ, నిక్ హాగ్‌లను తీసుకెళ్లేందుకు సోయుజ్ రాకెట్ బయలుదేరింది. అయితే ప్రయోగించిన నిమిషాల్లోనే కొన్ని సమస్యల కారణంగా వారిద్దరు అత్యవసరంగా భూమిపై ల్యాండయ్యారు. ఇక ఎక్కువ రోజులు అంతరిక్షంలో గడిపిన మొదటి కెనడా వ్యోమగామిగా సెయింట్ జాక్వస్ రికార్డు సృష్టించారు.

భారత్‌తో బంధానికి తహతహ

దృఢమైన ద్వైపాక్షిక సంబంధాలను కోరుతున్న అమెరికా, బ్రిటన్

భారత్ ఒక బిగ్ మార్కెట్. 2018 నాటికి ప్రపంచంలో ఆరో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. అంతవరకు ఆరో స్థానంలో వున్న ఫ్రాన్స్‌ను వెనక్కి నెట్టేసింది. ఈ యేడాది భారత్ ఐదో స్థానానికి చేరుకోగలదని లండన్‌కు చెందిన ఐహెచ్ఎస్ మార్కిట్ లిమిటెడ్ (గ్లోబర్ ఇన్ఫర్మేషన్ ప్రొవైడర్) అంచనా వేస్తోంది. భారత్ 2019–23 మధ్య కాలంలో ఏడాదికి సగటున ఇంచుమించు 7% వృద్ధిరేటు నమోదు చేయగలదని, రానున్న రెండు దశాబ్దాల్లో ఏడాదికి సగటున 75 లక్షల మంది ఆర్థిక కార్యకలాపాల్లోకి ప్రవేశించే అవకాశముందని ఆ సంస్థ చెబుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మన దేశం 7.5% వృద్ధి రేటు సాధించగలదని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. ఈ నేపథ్యంలో భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను బలపరచుకోవాలని అభివృద్ధి చెందిన దేశాలు భావిస్తున్నాయి. దీనిపై దృష్టి సారించని ప్రభుత్వాలపై వేలెత్తి చూపుతున్నాయి. భారత్ పట్ల ట్రంప్ ప్రభుత్వ వైఖరి మారాలని డెమోక్రాట్లు కోరుతున్నారు. బ్రెగ్జిట్‌ను దృష్టిలో వుంచుకుని భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలకు పెద్దపీట వేయాలంటోంది యూకే పార్లమెంటరీ నివేదిక.

వ్యూహాత్మక భాగస్వామ్యం బలోపేతం

భారత్‌తో సంప్రదింపులు జరపడానికి బదులు వివిధ అంశాలకు సంబంధించి ఆ దేశంపై ట్రంప్ సర్కారు ఒత్తిడి తీసుకువస్తోందనే అభిప్రాయం బలం పుంజుకుంటోందని అంటున్నారు అమెరికా దిగువసభ విదేశీ వ్యవహారాల కమిటీ అధ్యక్షులు ఇలియట్ ఇంజల్. దీనిపై అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మైకేల్ పాంపియోకు సోమవారం ఆయన లేఖ రాశారు. భారత్ సహా ఆసియాలో పాంపియో జరుపుతున్న పర్యటన నేపథ్యంలో ఈ లేఖ ప్రాధాన్యత సంతరించుకుంది. భారత్‌కు ప్రాధాన్య వాణిజ్య హోదా (జీఎస్‌పీ) రద్దు చేయడాన్ని, ఇరాన్ నుంచి ముడి చమురు దిగుమతి చేసుకోరాదంటూ మన దేశంపై ఆంక్షలు విధించడాన్ని ఈ లేఖ ప్రధానంగా ప్రస్తావించింది. పాంపియో తన భారత్ పర్యటనలో భాగంగా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవాలని ఇలియట్ సూచించారు. భారత్ విషయంలో పాలకుల మాటలకు – చేతలకు మధ్య పొంతన లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. మన దేశం పట్ల అమెరికా అవలంభిస్తోన్న అస్థిర వైఖరి – దశాబ్దాలుగా నిర్మించుకుంటూ వచ్చిన ఇరుదేశాల భాగస్వామ్యాన్ని దెబ్బ తీసిందని వ్యాఖ్యానించారు.

ద్వైపాక్షిక సంబంధాలకు పెద్దపీట

ప్రపంచ పోటీలో అంతకంతకూ వృద్ధి చెందుతున్న భారతదేశంతో పోల్చుకుంటే బ్రిటన్ వెనకబడిందని, పెరుగుతున్న భారత్ పలుకుబడికి సరితూగగలిగేలా తన వ్యూహం సరిచేసుకోవడంలో విఫలమయ్యిందని తాజాగా వెలువడిన బ్రిటిష్ పార్లమెంటరీ పరిశీలన నివేదిక పేర్కొంది. 'బిల్డింగ్ బ్రిడ్జెస్ : రీఅవేకనింగ్ యూకే – ఇండియా టైస్' శీర్షికన వెలువడిన ఈ నివేదికను 'యూకె – ఇండియా వీక్ 2019' సందర్భంగా బ్రిటన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. భారతీయ యాత్రికులు, విద్యార్థులు, వృత్తి నిపుణులకు ప్రయోజనకరమైన వీసా, వలస విధానాలను రూపొందించుకోవాల్సిన అవసరాన్ని ఈ నివేదిక వివరించింది. ద్వైపాక్షిక సంబంధాల ద్వారా బ్రిటన్ తగిన అవకాశాలను అందిపుచ్చుకోలేకపోయిందని వ్యాఖ్యానించింది. భారత్‌తో తన సంబంధాలను సరిచేసుకునేందుకు ఆచరణయోగ్యమైన కొన్ని చర్యలను బ్రిటన్ తీసుకోవాలని, ప్రత్యేకించి చదువు – ఉద్యోగం – సందర్శన కోసం భారతీయులు సులభంగా బ్రిటన్ వచ్చేందుకు వీలు కల్పించాలని నివేదిక పేర్కొంది. వీసాల విషయంలో ప్రజాస్వామ్య రహిత చైనా కంటే కఠిన నిబంధనలను బ్రిటన్ అమలు చేయడంపై ఆందోళన వ్యక్తం చేసింది.

మసీదులో నక్కిన ఉగ్రవాది అరెస్ట్

సాక్షి, బెంగళూరు: మసీదు పెద్దలకు తప్పుడు సమాచారం ఇచ్చి ఆశ్రయం పొందుతున్న ఉగ్రవాదిని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. బెంగళూరు దగ్గర్లోని దొడ్డబళ్లాపుర మసీదులో అతడిని పట్టుకున్నారు. అయిదు రోజుల నుంచి రెక్కీ నిర్వహించి మరీ పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. అరెస్టయిన ఉగ్రవాది బంగ్లాదేశ్‌లోని జమాత్ ఉల్ ముజాహిద్దీన్ సంస్థకు చెందిన హబీబుల్ రెహమాన్‌గా గుర్తించారు. 2014లో బెంగాల్‌లోని బుర్ద్వాన్‌లో జరిగిన పేలుళ్లలో ఇతడు ప్రధాన నిందితుడు. బెంగళూరులోని ఎన్ఐఏ కోర్టులో హాజరుపరిచి ఎన్ఐఏ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు.

శ్యామలేశ్వరి ఎక్స్‌ప్రెస్, టవర్ కార్ ఢీ

రాయగడ/తాటిచెట్లపాలెం(విశాఖ): తూర్పు తీర రైల్వే కేఆర్ (కొత్త వలస–రాయగడ) లైన్‌లో మంగళవారం రైలు ప్రమాదం జరిగింది. జగదల్‌పూర్ నుంచి హౌరా వెళ్తున్న శ్యామలేశ్వరి ఎక్స్‌ప్రెస్, రైల్వే విద్యుదీకరణ చేస్తున్న టవర్ కార్ మంగళవారం ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురు రైల్వే సిబ్బంది మరణించారు. రైలులోని ప్రయాణీకులు క్షేమంగా బయటపడ్డారు. ప్రమాదం జరిగిన ప్రాంతానికి ఇరువైపులా ఉన్న కేతుగూడ, సింగపూర్ రోడ్ స్టేషన్ మాస్టర్లను సస్పెండ్ చేసినట్టు తూర్పు తీర రైల్వే అధికారి జేపీ మిశ్రా తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై రైల్వే అధికారులు విచారణ సాగిస్తున్నారు.

నీతిఆయోగ్ ఆరోగ్య సూచీలో కేరళ టాప్

న్యూఢిల్లీ: ఆరోగ్యవంతమైన రాష్ట్రాల సూచీలో కేరళ టాప్‌లో నిలిచింది. ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్రలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇక ఉత్తర ప్రదేశ్, బిహార్‌లు ఈ సూచీలో దిగువ స్థానాల్లో ఉన్నాయి. 2015–16 నుంచి 2017–18కాలంలో ఆరోగ్యపరిరక్షణకు ఆయా రాష్ట్రాలు తీసుకున్న చర్యలను పరిగణనలోకి తీసుకుని నీతి ఆయోగ్ 'ఆరోగ్యవంతమైన రాష్ట్రాలు–అభివృద్ధి భారతం'పేరుతో మంగళవారం రెండో ఆరోగ్య సూచీని విడుదల చేసింది. సూచీలో గుజరాత్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్‌లు వరుసగా 4, 5, 6 స్థానాల్లో నిలిచాయి. ఉత్తరప్రదేశ్, బిహార్, ఒడిశా అత్యంత దయనీయ స్థాయిలో ఉన్నాయి. హరియాణా, రాజస్తాన్, జార్ఖండ్ అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల జాబితాలో ముందున్నాయి.

మేము జోక్యం చేసుకోలేం

గుజరాత్ రాజ్యసభ ఎన్నికల పిటిషన్ విచారణకు సుప్రీం నో

న్యూఢిల్లీ: గుజరాత్‌లో ఖాళీ అయిన రెండు రాజ్యసభ స్థానాలకు వేర్వేరుగా ఎన్నికలు నిర్వహించాలన్న ఈసీ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్ విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ మొదలైందని, అందువల్ల తాము జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పింది. ఎన్నిక ముగిసిపోయిన తర్వాత కావాలంటే గుజరాత్ కాంగ్రెస్ శాఖ ఎన్నికల పిటిషన్ దాఖలు చేసుకునే స్వేచ్ఛను కల్పించింది. కేంద్ర మంత్రులు అమిత్ షా, స్మృతి ఇరానీలు లోక్‌సభకు ఎన్నిక కావడంతో గుజరాత్‌లో రెండు రాజ్య సభ స్థానాలు ఖాళీ అయ్యాయి. జస్టిస్ సంజీవ్ ఖన్నా, బీఆర్ గవాయిలతో కూడిన వెకేషన్ బెంచ్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక కోర్టుకి ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకునే అధికారం ఉండదని తెలిపింది. 'ఈ విషయంలో ప్రాథమిక హక్కులకు ఏ విధంగా భంగం కలిగింది ? ఎన్నికల్లో పోటీ చేయడం ఎవరికైనా చట్టబద్ధంగా వచ్చిన హక్కు. మీరు అవసరం అనుకుంటే ఎన్నికల పిటిషన్ దాఖలు చేసుకోండి' అని న్యాయమూర్తులు గుజరాత్ అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రతిపక్ష నాయకుడు పరేశ్ భాయ్ ధనాని దాఖలు చేసిన పిటిషన్ తరపున వాదించడానికి కోర్టుకు వచ్చిన సీనియర్ అడ్వకేట్ వివేక్ టాంఖాకు సలహా ఇచ్చారు. 182 స్థానాలున్న గుజరాత్ అసెంబ్లీలో బీజేపీకి 100 స్థానాలుంటే, కాంగ్రెస్‌కు 75 ఉన్నాయి.

రాజ్యసభకు నామినేషన్ వేసిన జైశంకర్

గాంధీనగర్: విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ గుజరాత్ నుంచి రాజ్యసభ స్థానానికి మంగళవారం నామినేషన్ దాఖలుచేశారు. జైశంకర్ సోమవారమే బీజేపీ సభ్యత్వాన్ని తీసుకున్న సంగతి తెలిసిందే. జైశంకర్‌తోపాటు గుజరాత్ బీజేపీ ఓబీసీ సెల్ అధ్యక్షుడు జుగల్జీ ఠాకూర్ గుజరాత్ రాజ్యసభ మరో స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. అమిత్ షా, స్మృతీ ఇరానీ ఇటీవలి ఎన్నికల్లో లోక్‌సభకు ఎన్నికకావడంతో రెండు రాజ్యసభ స్థానాల్లో ఖాళీలు ఏర్పడ్డాయి.

తుపాకీ గురిపెట్టి తనిఖీలు..

వాహనదారులపైకి తుపాకీలను గురిపెట్టిన పోలీసులు

బదౌన్: బైక్ మీద వెళుతున్న ప్రయాణికులను పోలీసులు బారికేడ్లు పెట్టి ఆపి, పాయింట్‌బ్లాంక్‌లో గన్ పెట్టి సోదా చేస్తే ఎలా ఉంటుంది. అలాంటి పరిస్థితే ఉత్తరప్రదేశ్‌లోని బదౌన్‌లో ద్విచక్ర వాహనదారులకు ఎదురైంది. బైక్‌ను ఆపి, దిగి చేతులు వెనక్కు పెట్టి కదలకుండా ఉండాల్సిందిగా ఆజ్ఞాపించారు. అనంతరం సోదాలు నిర్వహించారు. సోదా నిర్వహిస్తుండగా ఇద్దరు పోలీసులు గన్ గురిపెట్టి నిల్చున్న వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతూ తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఇలా పౌరులను భయభ్రాంతులకు గురి చేయడం సరి కాదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇవి కేవలం పోలీసులు తమను తాము రక్షించుకోవడానికే అని జిల్లా సూపరింటెండెంట్ పోలీసు అశోక్ కుమార్ త్రిపాఠి సోమవారం వివరణ ఇచ్చారు. కొందరు నేరగాళ్లు తమ వెంట ఆయుధాలు తెచ్చుకొని పోలీసులపై దాడిచేసే అవకాశం ఉందని అందుకే ఈ జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు.

ఢిల్లీ చేరుకున్న పాంపియో

న్యూఢిల్లీ/వాషింగ్టన్: అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మైక్ పాంపియో మంగళవారం ఢిల్లీకి చేరుకున్నారు. విదేశాంగ మంత్రి జైశంకర్ బుధవారం ఆయనతో భేటీ కానున్నారు. రష్యా నుంచి ఎస్400 క్షిపణి వ్యవస్థల కొనుగోలు, ఉగ్రవాదం, హెచ్1బీ వీసా, వాణిజ్యం, ఇరాన్‌పై ఆంక్షలతో చమురు కొనుగోళ్లపై ప్రభావం వంటి పలు అంశాలు వారి మధ్య చర్చకు వచ్చే అవకాశం ఉంది. బుధవారం పాంపియో ప్రధాని మోదీతోనూ సమావేశం కానున్నారు. ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగే కార్యక్రమంలో భారత, అమెరికా వాణిజ్యవేత్తలతో పాంపియో మాట్లాడతారు.

మోదీతో భేటీ కానున్న ట్రంప్

జపాన్‌లోని ఒసాకాలో 28, 29 తేదీల్లో జరిగే జీ20 దేశాల సమావేశానికి హాజరుకానున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రధాని మోదీసహా పలువురు ప్రపంచ దేశాధినేతలతో సమావేశం కానున్నారు. భారత్, ఆస్ట్రేలియా, జపాన్ ప్రధానులతో పాటు జర్మనీ చాన్స్‌లర్ మెర్కెల్, చైనా అధ్యక్షులు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్, సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్, టర్కీ అధ్యక్షుడు ఎర్దోగన్‌లతో ఆయన సమావేశం కానున్నట్టు యూఎస్ ప్రభుత్వాధికారి ఒకరు సోమవారం విలేకరులకు తెలిపారు.

మెహుల్ చోక్సీకి ఎదురు దెబ్బ

- పౌరసత్వం రద్దు చేస్తామన్న ఆంటిగ్వా ప్రధాని
- న్యాయపరమైన మార్గాలు మూసుకుపోయాక భారత్‌కు అప్పగింత

ఆంటిగ్వా/న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకుకి రూ.14వేలకోట్లు కుచ్చుటోపి పెట్టిన కేసులో పరారీలో ఉన్న నిందితుడు, వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఆంటిగ్వా ప్రభుత్వం అతని పౌరసత్వాన్ని రద్దు చేస్తామని, న్యాయపరమైన ప్రక్రియ ముగిశాక భారత్‌కు అప్పగిస్తామని ప్రకటించింది. న్యాయపరంగా అన్ని దారులు మూసుకుపోతే భారత్‌కు పంపిస్తామని ఆంటిగ్వా ప్రధాని గ్యాస్టన్ బ్రౌనే చెప్పారు. చోక్సీ బ్యాంకుకి డబ్బులు ఎగ్గొట్టాక కరేబియన్ దీవులకు పరారై ఆంటిగ్వాలో తలదాచుకుంటున్నాడు. పీఎన్‌బీలో భారీ స్కామ్ వెలుగులోకి వచ్చాక చోక్సీ గత ఏడాది జనవరిలో పరారయ్యాడు. అంతకు ముందే 2017 నవంబర్‌లో సిటిజెన్‌షిప్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రోగ్రామ్ (సీఐపీ) కింద ఆంటిగ్వా, బార్బడా జంట దీవుల పౌరసత్వాన్ని తీసుకున్నాడు. కాగా, లక్ష అమెరికా డాలర్లను ఇన్‌వెస్ట్ చేసి ఆంటిగ్వా, బార్బడా పౌరసత్వాన్ని ఎవరైనా తీసుకోవచ్చు. మరోవైపు చోక్సీ తానేమీ పారిపోలేదని, వైద్య చికిత్స కోసం ఆంటిగ్వాకు వచ్చానని ట్రీట్‌మెంట్ అయిపోగానే భారత్‌కు వస్తానని అతని కేసు విచారిస్తున్న బాంబే హైకోర్టుకు వెల్లడించాడు. గీతాంజలి జెమ్స్ కంపెనీకి చెందిన వజ్రాల వ్యాపారులైన చోక్సీ, నీరవ్ మోదీలు పంజాబ్ నేషనల్ బ్యాంకుకి రుణాలు ఎగ్గొట్టి దేశం విడిచి పారిపోయారు. ప్రస్తుతం నీరవ్ లండన్ జైల్లో ఉన్నాడు. వారిద్దరినీ తిరిగి భారత్‌కు తీసుకురావడానికి ఈడీ, సీబీఐ గత కొంత కాలంగా ప్రయత్నాలు చేస్తున్నాయి.

'ఎమర్జెన్సీ హీరో'లకు ప్రధాని సెల్యూట్



న్యూఢిల్లీ: అత్యవసర పరిస్థితిని ఎదురించి, ప్రజాస్వామ్యం కోసం పోరాడిన వారికి ప్రధాని మోది నివాళులర్పించారు. నియంతృత్వంపై ప్రజాస్వామ్యం విజయం సాధించిందన్నారు. 'ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా తీవ్రంగా పోరాడిన మహనీయులందరికీ దేశం సెల్యూట్ చేస్తోంది. నియంతృత్వ విధానాలపై భారత దేశ ప్రజాస్వామ్య విలువలు విజయం సాధించాయి. 1975లో ఇదే రోజు అధికారం కోసం కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది. దానికి వ్యతిరేకంగా ఎందరో భారతీయ జన్ సంఘ్, ఆర్ఎస్ఎస్ నేతలు ముందుండి పోరాడారు' అని ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. దేశ చరిత్రలో ఎమర్జెన్సీ చీకటిరోజులుగా మిగిలిపోయాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం కోసం పోరాటం చేసిన వారందరికీ నివాళులర్పించారు.

ఐదేళ్లుగా సూపర్ ఎమర్జెన్సీ:మమత

అప్పటి ప్రభుత్వం ఇదే రోజు 1975లో దేశంలో విధించిన అత్యవసర పరిస్థితి దాదాపు రెండేళ్లు కొనసాగిందనీ, కానీ బీజేపీ ప్రభుత్వం హయాంలో గత ఐదేళ్లుగా దేశంలో సూపర్ ఎమర్జెన్సీ పరిస్థితులున్నాయని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మండిపడ్డారు.

1975 జూన్ 25.. అప్పుడేం జరిగింది?

భారతదేశ చరిత్రలో చీకటి రోజు అది. ఒక్క కలం పోటుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన రోజు. సరిగ్గా 44 ఏళ్ల కిందట అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ అధికారంకోసం యావత్ జాతి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హరించిన రోజు. అప్పటి ఇందిర ప్రత్యర్థి రాజ్ నారాయణ్ తరపున వాదించిన లాయర్లలో ఒకరైన జేపీ గోయెల్ అత్యవసర పరిస్థితి ప్రకటించిన రోజు జరిగిన ఘటనలకు ప్రత్యక్ష సాక్షిగా ఉన్నారు. గోయెల్ చెప్పిన ఆ విషయాలను ఆయన కుమార్తె రమా గోయెల్ 'సేవింగ్ ఇండియా ఫ్రం ఇందిర'పేరుతో పుస్తకంగా తీసుకువచ్చారు. అందులోని వివరాల ప్రకారం ఆ రోజు ఏం జరిగిందంటే.. పార్లమెంట్ ఎన్నికల్లో రాయ్‌బరేలీ నుంచి గెలుపు సాధించేందుకు ఇందిర అక్రమాలకు పాల్పడ్డారని, ఆమె ఎన్నికను రద్దు చేయాలంటూ ఆమె ప్రధాన ప్రత్యర్థి రాజ్ నారాయణ్ అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ వేశారు. నారాయణ్ ఆరోపణలకు తగిన ఆధారాలున్నందున ఇందిర ఎన్నిక చెల్లదంటూ 1975 జూన్ 12వ తేదీన అలహాబాద్ హైకోర్టు తీర్పు వెలువరించింది. అయితే, ఇందిర రాజీనామా చేయకుండా హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జూన్ 25వ తేదీన మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో జస్టిస్ కృష్ణ అయ్యర్ తాను ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల్ని బయటకు చదివి వినిపించారు. అలహాబాద్ హైకోర్టు తీర్పుపై స్టే ఇస్తూనే ఇందిర ప్రధాని పదవిలో ఉండొచ్చని కానీ, తుది తీర్పు వెలువడే వరకు ఆమె ఎంపీగా కొనసాగరాదని స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో ఇందిర మాట్లాడవచ్చు కానీ ఓటు వేసే అధికారం ఆమెకు ఉండదని ఆ తీర్పులో పేర్కొన్నారు. తీర్పు కాపీతో నేను బయటకు వచ్చేసరికి సుప్రీంకోర్టు ఆవరణ ఒక జనసంద్రంగా మారింది. పత్రికా విలేకరులు, ఇతర లాయర్లందరినీ దాటుకొని చాంబర్‌కు వెళ్లడానికి గంటకు పైగా పట్టింది.

ప్రతిపక్షాల తీర్మానం

చాంబర్‌లోకి వెళ్లిన కాసేపటికే రాజ్ నారాయణ్ ఆయనకు ఫోన్ చేశారు. అలహాబాద్ ఉత్తర్వులపై సుప్రీం పూర్తిస్థాయిలో స్టే విధించకపోవడంతో ఇందిర దిగిపోవాల్సి ఉంటుందని, ఈ విషయాన్ని ప్రతిపక్ష పార్టీలకు అర్థమయ్యేలా చెప్పాలంటూ అభ్యర్థించారు. అప్పటికే విపక్ష నేతలందరూ మొరార్జీ

సాక్షి
బుధవారం, జూన్, 26

విలక్షణ పాలనకు శ్రీకారం

గత నెల 30న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసింది మొదలు ప్రతి సందర్భం లోనూ తన పాలన ఎలా ఉండబోతున్నదో, తన ప్రాధమ్యాలేమిటో చెబుతూ వస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తొలిసారి రెండురోజులపాటు నిర్వహించిన జిల్లా కలెక్టర్లు, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ల సదస్సులో వాటిని మరింత తేటతెల్లం చేశారు. పాలనకు సంబంధించిన ప్రతి అంశంలోనూ లోతైన అవగాహన ఉన్న పాలకుడు అధికార శ్రేణులకు ఏవిధంగా దిశా నిర్దేశం చేయ గలడో ఈ రెండురోజులూ ఆయన ప్రసంగాలను నిశితంగా గమనించినవారికి అర్థమవుతుంది. 'మనం పాలకులం కాదు... ప్రజలకు సేవకులం. వారి ఆకాంక్షల మేరకు మనం పనిచేయాలి' అని చెప్పడంలోనే ఆయన హృదయం ఎక్కడుందో తెలుస్తుంది. 341 రోజులపాటు 3,684 కిలోమీటర్ల మేర సాగించిన పాదయాత్ర వేసిన చెరగని ముద్ర ఈ సదస్సులో ఆయన నోటివెంబడి వెలువడిన ప్రతి పలుకులోనూ వ్యక్తమైంది. ఏఏ సమస్యలు ప్రజలను పట్టిపీడిస్తున్నాయో, ఎక్కడెక్కడ వారు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో... ఏం చేస్తే అవన్నీ సరిచేయవచ్చునో ఆయనకు స్పష్టత ఉంది. అవినీతిరహిత, పారదర్శక పాలన అందించాలనడం, ఏదైనా పరిష్కరిస్తామని హామీ ఇస్తే దాన్ని అనుకున్న సమయానికి ఖచ్చితంగా పూర్తిచేయడం ద్వారా ప్రజల్లో విశ్వసనీయత పెంచు కోవాలని ఉద్బోధించడం జగన్ వ్యక్తిత్వానికి అద్దం పడతాయి. ప్రజలతో వ్యవహరించవలసి వచ్చినప్పుడు, వారి సమస్యల పరిష్కారానికి పూనుకున్నప్పుడు ఉదారతతో వ్యవహరించాలని, అందులో మానవీయ స్పర్శ ఉండాలని ఆయన ప్రసంగం విన్నాక అధికారులందరికీ అర్థమై ఉండాలి. అసలు ఈ సదస్సు నిర్వహణ కోసం ప్రజావేదికను ఎంచుకోవడంలోనే ఆయనొక సందే శాన్నిచ్చారు. గత పాలకుల హయాంలో చట్ట ఉల్లంఘనలు ఏ స్థాయిలో జరిగాయో, ఎటువంటి అక్రమాలు చోటు చేసుకున్నాయో అందరికీ తేటతెల్లం చేయడానికే సదస్సును అక్కడ నిర్వహిం చారు. పర్యావరణ చట్టాలను, ఇతర మార్గదర్శకాలను ఉల్లంఘించి చేసిన నిర్మాణాలన్నిటినీ కూల గొట్టడం ఖాయమని, ఆ కార్యక్రమం 'ప్రజావేదిక'తోనే మొదలవుతుందని ఆయన ప్రకటించారు. దానికనుగుణంగా సదస్సు ముగిసిన కొన్ని గంటల్లోనే వేదిక కూల్చివేత పనులు ప్రారంభ మయ్యాయి.

గత అయిదేళ్ల పాలనలో తమకెదురైన అనుభవాలు ఎటువంటివో ప్రతి అధికారికీ తెలుసు. ఎంతటి వారినైనా ఆ అనుభవాలు ఒకవిధమైన నిర్లిప్తతలోకి నెట్టేస్తాయి. నిర్వ్యాపకత్వానికి లోను చేస్తాయి. నిరాశానిస్పృహలు కలిగిస్తాయి. ఇసుక మాఫియాను అడ్డుకోవడానికి చిత్తశుద్ధితో ప్రయత్నించిన మహిళా ఎమ్మార్వో పట్ల ఒక ప్రజాప్రతినిధి ఎంత కిరాతకంగా వ్యవహరించాడో... సీనియర్ అధికారి బాలసుబ్రహ్మణ్యంను టీడీపీ ప్రజాప్రతినిధులు ఎలా అవమానించారో, ఈ రెండు ఉదంతాల్లోనూ గత ప్రభుత్వం వ్యవహరించిన తీరేమిటో ఏ అధికారీ మర్చిపోరు. విజ యవాడ, మరికొన్ని ఇతర నగరాల్లో చోటుచేసుకున్న కాల్‌మనీ సెక్స్‌రాకెట్ వ్యవహారంలో పోలీసు అధికారుల చేతులెలా కట్టేశారో, నిందితులకు ఎలా అండదండలందించారో వారికి గుర్తుండే ఉంటుంది. వీటిని దృష్టిలో ఉంచుకునే ఆయన అధికారులకు తన పాలన ఎలా ఉండబోతున్నదో స్పష్టం చేశారు. పరిపాలనకు ప్రజాప్రతినిధులు ఒక కన్ను అయితే, అధికార శ్రేణులు మరో కన్ను అని, ఈ రెండూ ఒక్కటైనప్పుడు మాత్రమే ప్రజలకు మంచి జరుగుతుందని చెప్పడం ద్వారా వారికిచ్చే సమాన ప్రాముఖ్యతను, ప్రాధాన్యతను సూచించారు. ప్రజాప్రతినిధులు ఇచ్చే వినతి పత్రాలపై సానుకూలంగా స్పందించమని అధికారులను కోరడంతోపాటు, అదే సమయంలో వారు అక్రమాలు, అవినీతి, దోపిడీ వగైరాల కోసం ఇచ్చే ఎలాంటి ఆదేశాలనైనా తిరస్కరించమని పిలుపు నిచ్చారు. ఇంత సూటిగా, ఇంత స్పష్టంగా, ఇంత నిర్మొహమాటంగా బహుశా దేశంలో మరే ముఖ్య మంత్రీ అధికారులకు చెప్పి ఉండరు. సంక్షేమ పథకాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు ఉద్దేశిత వర్గాల్లోని చిట్టచివరి వ్యక్తి వరకూ చేరాలని జగన్ సూచించడం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వ్యవహార శైలిని తలపిస్తుంది. అయిదేళ్లనాటి అసెంబ్లీ ఎన్నికల్లోనూ, తాజా ఎన్ని కల్లోనూ గిరిజనులంతా వైఎస్సార్ కాంగ్రెస్‌కు అండగా నిలిచి నూరుశాతం ఆ పార్టీ అభ్యర్థుల్ని గెలి పించారు. వారికి వాగ్దానం చేసినవిధంగానే బాక్సైట్ తవ్వకాలకు సంబంధించిన జీవోను రద్దు చేస్తున్నట్టు ప్రకటించి ఆ గిరిజనుల అభీష్టాన్ని జగన్ నెరవేర్చారు.

గత అయిదేళ్లుగా తెలుగు రాష్ట్రాల ప్రజలు వింటున్న మాట 'పాలనానుభవం'. అరిగిపోయిన రికార్డులా తెలుగుదేశం నేతలు పదే పదే వాడి ఆ పదాన్ని దుర్వినియోగం చేశారు. సమర్థతకు కొలమానం అనుభవం కాదని... ప్రజలపట్ల నిబద్ధత, వారిపట్ల సహానుభూతి ఉండే నాయకుడికి వారెదుర్కొంటున్న సమస్యల విషయంలో సంపూర్ణ అవగాహన ఉంటుందని, పరిష్కార మార్గం పట్ల స్పష్టత ఏర్పడుతుందని జగన్ నిరూపించారు. అందుకే నిర్దేశిత సమయంలోనే ఆయన తాను చెప్పదల్చుకున్నది అధికార శ్రేణులకు చేరేయగలిగారు. బాబు హయాంలో కలెక్టర్ల సదస్సులెలా జరిగేవో ఎవరూ మరిచిపోరు. ఎక్కాల పుస్తకం ఒప్పజెప్పినట్టు ఆద్యంతమూ గణాంకాలు గుప్పిం చడం... వాటిని గ్రాఫిక్స్‌తో మేళవించడం... విషయమేమీ లేకుండా గంటలతరబడి మాట్లాడటం, మధ్యమధ్యన స్వోత్కర్షలకు పోవడం తప్ప అందులో ఏమీ ఉండేది కాదు. అందుకు భిన్నంగా జగన్ తనను తాను అధికార గణంలో భాగం చేసుకుని, అందరం కలిసి ప్రజలకు మెరుగైన పాలన అందిద్దామని పిలుపునిచ్చి వారిలో స్ఫూర్తిని నింపారు. సమయపాలనకు ప్రాముఖ్యమిచ్చారు. భిన్న అంశాలపై ముఖ్యమంత్రి వైఖరి ఎలా ఉన్నదో, ఆయన సందేశంలోని సారాంశమేమిటో అధికారయంత్రాంగం అవగాహన చేసుకున్నది గనుక రానున్న కాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మెరుగైన, సమర్థవంతమైన పాలన అందగలదని ఆశించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం, తిథి బ.నవమి రా.2.15 వరకు, తదుపరి దశమి నక్షత్రం రేవతి తె.5.30 వరకు (తెల్లవారితే గురువారం) తదుపరి అశ్విని, వర్జ్యం సా.4.09 నుంచి 5.52 వరకు దుర్ముహూర్తం ప.11.35 నుంచి 12.28 వరకు అమృతఘడియలు... రా.2.33 నుంచి 4.13 వరకు.

సూర్యోదయం : 5.31
సూర్యాస్తమయం: 6.33
రాహుకాలం : ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

సామరస్యమే సరైన పరిష్కారం

విశ్లేషణ



ఐవైఆర్ కృష్ణారావు

ఏ సమస్యల పరిష్కారానికైనా కాలగతి ఎంత ముఖ్యమో అనువైన వాతావరణం కూడా అంతే ముఖ్యమని హిపోక్రిటస్ పేర్కొన్నాడు. విభజనానంతరం తెలంగాణ, ఆంధ్రప్ర దేశ్ రాష్ట్రాల మధ్య గతంలో చాలా చిక్కుముళ్లు ఏర్పడటం వాస్తవమే కానీ రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య ప్రస్తుతం ఉన్న సుహృద్భావ వాతావరణం మిగిలి ఉన్న సమస్యల పరిష్కారానికి అత్యంత అనుకూలతను ఏర్పరుస్తోంది. ఉద్యోగుల విభజన వంటి కొన్ని అంశాలు గతంలోనే దాదాపుగా పరిష్కృతమయ్యాయి. మిగిలి ఉన్న రెండు ప్రధాన అంశాలు షెడ్యూల్ 9 షెడ్యూల్ 10కి చెందిన సంస్థల విభజన. కోర్టుల వరకు వెళ్లిన షెడ్యూల్ 10కి చెందిన సంస్థల విభజన అంశాన్ని ఇప్పుడు రెండు రాష్ట్రాలు ఉమ్మడిగా పరిష్కరించుకోవచ్చు. ఇక 9వ షెడ్యూల్‌కి చెందిన వాణిజ్యపరమైన సంస్థల విషయంలో కూడా సామరస్యంగా పరిష్కరించుకోవడం పెద్ద సమస్య కాకపోవచ్చు.

సాధారణంగా అన్నదమ్ముల మధ్య ఆస్తి తగా దాలు అంత సులభంగా పరిష్కారం కావు. పంతాలు, పట్టింపులు ప్రధాన పాత్ర పోషిస్తాయి కాబట్టి మామూలుగా అంత ప్రధానం కాని అంశాలు కూడా ప్రాధాన్యతను సంతరించు కుంటాయి. రాష్ట్రాల విభజనలో కూడా ఇటువంటి పరిస్థితులే ఉత్పన్నం అవుతాయనడంలో సందేహం లేదు. ముఖ్యంగా విభజన రెండు ప్రాంతాల సమ్మతితో జరగనప్పుడు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విభజన రెండు ప్రాంతాల సమ్మతితో జరగలేదు. విభజన జరిగే నాటికి కే చంద్ర శేఖరరావు అప్పుడే ఉద్యమ నేతగా ఉద్యమాన్ని నడిపి అధికార బాధ్య తలు చేపట్టారు.

ఉద్యమ స్ఫూర్తితో అధికారంలోకి వచ్చినప్పుడు ఆ ఉద్యమానికి కారణభూతమైన అంశాలు వారి ఆలోచనలను ప్రభావితం చేయటం సహజమే. విభజన చట్టం లోపభూయిష్టంగా, అస్పష్టంగా ఉండటం కూడా విభజన అంశాల పరిష్కారంలో సమస్యలకు కారణమైంది. కాల క్రమేణా ఆవేశాలకు బదులు ఆలోచనలు ప్రధాన భూమిక పోషించే కొద్దీ సమస్యల పరిష్కారానికి అనువైన వాతావరణం ఏర్పడుతుంది. సమ స్యల పరిష్కారానికి కాలగతి ఎంత ముఖ్యమో అనువైన వాతావరణం కూడా అంతే ముఖ్యమని హిపోక్రిటస్ మహనీయుడు పేర్కొన్నాడు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల మధ్య మిగిలి ఉన్న సమస్యల పరిష్కారానికి నేడు ఇలాంటి అనుకూలమైన వాతావరణం ఏర్పడింది . కేసీఆర్, జగన్ మోహన్ రెడ్డి మధ్య ఉన్న సుహృద్భావ వాతావరణమే ఈ సమస్యల పరిష్కారానికి సరైన అవకాశాన్ని కల్పిస్తూ ఉన్నది.

ఉద్యోగుల విభజన పూర్తయినట్లే!

నేడు మిగిలి ఉన్న విభజన సమస్యల పరిష్కారాన్ని గురించి ఆలోచించే ముందు గత ఐదేళ్లలో ఈ అంశాల పరిష్కారంలో పురోగతిని సమీక్షించు కుందాం. ప్రప్రథమంగా పరిష్కారమైన అంశం అఖిల భారత సర్వీస్ అధికారుల విభజన. దీనికోసం కేంద్ర ప్రభుత్వమే ప్రత్యూష్ సిన్హా నేతృ త్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. చాలా త్వరగా మొదటి ఆరునె లల్లోనే అఖిల భారత సర్వీసు అధికారుల విభజన పూర్తయి రెండు రాష్ట్రాలకు వాళ్ళ కేటాయింపు అయిపోయింది. సరైన విధానాన్ని కమిటీ అనుసరించలేదని భావన కొందరు అధికారులకు ఉన్నా, వారు వారి రాష్ట్ర కేడర్లలో ఇమిడిపోయి పనిచేయడం ప్రారంభించారు. ఇక రెండో ప్రధాన అంశం ఉద్యోగుల విభజన.

దీనికోసం విశ్రాంత ఐఏఎస్ అధికారి కమలనాథన్ గారి నాయక త్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఒకవైపు ప్రత్యేక తెలంగాణకు, మరొక వైపు సమైక్యాంధ్రాకు జరిగిన ఉద్యమాలలో ఉద్యోగస్తులు ప్రధాన పాత్ర పోషించిన నేపథ్యంలో విభజన అంశంలో నిర్ణయాలు కొన్ని వారి ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉండే అవకాశం ఉన్నందున ఉద్యోగస్తుల కేటాయింపు చాలా జటిలమైన సమస్యగా తయారైంది. కానీ కమలనాథన్ ఆధ్వర్యంలో కమిటీ చాలా ఓర్పుతో ఈ జటిలమైన సమస్యను పరిష్కరించింది. ఈరోజు కోర్టు సమస్యల దృష్ట్యా ఆగిపో యిన ఒకటి రెండు కేడర్లు తప్పితే మిగిలిన అన్ని కేడర్ల అధికారులను, ఇతర సిబ్బందిని రెండు రాష్ట్రాల మధ్య కేటాయించారు. ఇది ఒక క్లిష్ట సమస్యను విజయవంతంగా పరిష్కరించినట్లేనని చెప్పాలి.

ఇక పరిష్కారం కాకుండా మిగిలి ఉన్న రెండు ప్రధాన అంశాలు షెడ్యూల్ 9 షెడ్యూల్ 10కి చెందిన సంస్థలు. షెడ్యూల్ 10 సంస్థలన్నీ

ప్రధానంగా శిక్షణ నైపుణ్య తర్ఫీదు కోసం ఏర్పాటు చేసిన సంస్థలు. రాష్ట్ర విభజన చట్టంలో ఈ సంస్థలను పొందుపరిచేటప్పుడు చాలా పొరపాట్లు జరిగాయి. రాష్ట్ర ఎన్నికల సంఘంలాంటి రాజ్యాంగబద్ధ సంస్థల నుంచి చట్టబద్ధమైన మహిళా సంస్థల దాకా అన్నింటిని ఈ షెడ్యూల్లో పొందు పరచారు. రెండు రాష్ట్రాల మధ్య ఒక సమయంలో ఘర్షణ వాతావరణం ఏర్పడడానికి ఈ సంస్థలకు సంబంధించిన విభజన ప్రధాన పాత్ర చోటు చేసుకుంది. దీనికి కారణం విభజన చట్టం చాలా లోపభూయిష్టంగా ఉండటమే.

ఆస్తుల పంపకంలో ఇచ్చిపుచ్చుకోవచ్చు

విభజన చట్టంలోని సెక్షన్ 75ను అనుసరించి ఇవి తమకే వర్తిస్తాయి కాబట్టి తెలంగాణ ఆరవ భాగంలోని ప్రకరణలకు అనుగుణంగా ఈ సంస్థలు తమవేనని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వాదించింది. చివరకు ఈ అంశం సుప్రీంకోర్టు దాకా వెళ్లి ఈ సంస్థలు రెండు రాష్ట్రాల మధ్య విభ జించాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం, దానిలో కేంద్ర ప్రభుత్వానికి అధికారాన్ని కల్పిస్తూ వెసులుబాటు కల్పించారు. దీనికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఈ సంస్థల మూలనిధిని రెండు రాష్ట్రాల మధ్య జనాభా ప్రాతిపదికపై కేటాయిస్తూ ఆస్తులు ఈ సంస్థలు ఎక్కడ ఉంటే ఆ రాష్ట్రానికే చెందుతాయి అని ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్త ర్వులు సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా లేవంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టులో కేసు వేసింది. ఈ అంశాన్ని ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో రెండు రాష్ట్రాలు పరిష్కరించుకోవచ్చు. ఈ సంస్థలను కొత్త రాష్ట్రంలో ఏర్పాటు చేయడానికి ఆంధ్రప్రదేశ్‌కు నిధుల అవసరం ఎంతైనా ఉంది.

ఈ నిధులను కేంద్ర ప్రభుత్వం గానీ, తెలంగాణ గానీ సమకూర్చితే ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో వేసిన కేసును ఉపసంహరించుకొని ఆ నిధు లతో ఈ సంస్థలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసుకో వడం ఉత్తమం. దీనికి అనుగుణంగా ఎక్కడి సంస్థలు ఆ రాష్ట్రంలోనే ఉండిపోతాయి. కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్తగా వీటిని ఏర్పాటు చేసుకోవడానికి కావలసిన నిధులు ఏపీకి వస్తాయి. ఈ సమస్యను శాశ్వ తంగా పరిష్కరించడానికి ఇదే ఉత్తమమైన మార్గం.

ఇక రెండవ ప్రధాన అంశం షెడ్యూల్ 9 సంస్థల విభజన. ఇవి అన్నీ వాణిజ్యపరమైన సంస్థలు. ఈ సంస్థల విభజనకు విశ్రాంత ఐఏఎస్ ఆఫీ సర్ షీలా భిడే నాయకత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. దాదాపు 90 సంస్థల్లో 40 సంస్థలకు ఆ కమిటీ తన సిఫార్సులను అందజేసింది. మంచి వ్యక్తిత్వం, నిబద్ధత కలిగిన అధికారిణి షీలా భిడే. ఆ కమిటీ సిఫా ర్సులను రెండు రాష్ట్రాలు ఆమోదించి ఈ అంశాన్ని కూడా పరిష్కరించు కునే అవకాశం ఉంది. ఈ వాణిజ్యపరమైన సంస్థల ప్రధాన కార్యాల యాలు విభజన చట్టంలోని అంశాలకు అనుగుణంగా జనాభా ప్రాతిప దికపై రెండు రాష్ట్రాల మధ్య విభజితమవుతాయి కాబట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాటాకు వచ్చే ఆస్తులను తెలంగాణ రాష్ట్రం మార్కెట్ ధరకు తీసు కుంటే ఉత్తమం. ఆ వచ్చిన నిధులతో ఈ సంస్థల కార్యాలయాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వారు ఏర్పాటు చేసుకోవచ్చు. ఇది అంగీకారయో గ్యం కాకపోతే పరస్పర అవగాహనతో కొన్ని భవనాలను తెలంగాణ, కొన్ని భవనాలను ఆంధ్రప్రదేశ్ తీసుకుంటే ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన భవ నాలను మార్కెట్ ధరకు అమ్ముకుని ఆ వచ్చిన నిధులతో ఈ సంస్థలను స్వరాష్ట్రంలోనే ఏర్పాటు చేసుకునే అవకాశం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి లభిస్తుంది.

పరస్పర అవగాహన తప్పనిసరి

ఇక చట్టంలోని లోపం మూలంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న పరిశ్రమ లకు సంబంధించి వాయిదా వేసిన పన్నులు, వారి ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లో ఉన్నందున ఇక్కడే చెల్లిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కేంద్రానికి చట్టంలోని ఈ లోపాన్ని సవరించవలసిందిగా అభ్యర్థించింది. చట్టసవరణకు చాలా సమయం పట్టే అవకాశం ఉంది కనుక తెలంగాణ రాష్ట్రం స్వచ్ఛందంగా ఈ నిధులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బదిలీ చేయటం మంచి సంకేతాలను పంపిస్తుంది. ఇది వివాదాలకు తావు లేని అంశం. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విద్యుత్ బాకీలను తెలంగాణ చెల్లిం చాలని, లేదు.. ఆంధ్రప్రదేశే మాకు చెల్లించాలని ఒక వివాదం నడుస్తూ ఉన్నది. సామరస్యపూర్వక వాతావరణంలో ఈ అంశాన్ని పరిష్కరించు కోవడం పెద్ద సమస్య కాకపోవచ్చు. నాకు తెలిసి నేను ముఖ్య కార్యద ర్శిగా ఉన్నప్పుడు ఈ అంశంపై జరిగిన చర్చలో తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం వాయిదా పద్ధతుల్లో చెల్లించటానికి సమయం అడిగింది కానీ ఈ బాకీలు సరికావని ఏనాడు పేర్కొనలేదు.

చాలా జటిలమైన సమస్య వెంటనే పరిష్కారం అవడానికి అవకా శం లేని సమస్య నదీ జలాల పంపిణీ. ఇది కేవలం తెలంగాణ–ఆంధ్ర రాష్ట్రాలకు సంబంధించిన అంశం మాత్రమే కాదు. నదీ పరీవాహక ప్రాంతానికి చెందిన అన్ని రాష్ట్రాలకు చెందిన అంశం. రాష్ట్రాల మధ్య ఈ అంశంపై ఎన్ని వివాదాలు ఉన్నాయో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల మధ్య కూడా అన్ని వివాదాలు ఉన్నాయి. ఈ సమస్య పరిష్కారం కేవలం నిపుణులతో కూడిన కమిటీ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే న్యాయబద్ధ మైన ధర్మబద్ధమైన మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించవలసి ఉంటుంది. ఈ సమస్యలకు పరిష్కారం లభించటానికి కొంత సమయం పట్టవచ్చు.

రెండు రాష్ట్రాలలో ఈ విభజన అంశాల పరిష్కారానికి ఏర్పడిన కమిటీలోని అధికారులకు సర్వీసులో సమర్థులైన, నిష్పాక్షికతకు పేరొందిన ఆఫీసర్లుగా మన్నన ఉంది. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ అంశాల పరిష్కారాన్ని వీరికి వదిలేసి వారి సూచనలకు అనుగు ణంగా సమస్యల పరిష్కారానికి ప్రయత్నం చేస్తే త్వరితగతిలో అందరికీ ఆమోదయోగ్యంగా పరస్పర అవగాహనతో ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో ఈ సమస్యలను పరిష్కరించుకోవచ్చు.

వ్యాసకర్త ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి
ఈ–మెయిల్ : iyrk45@gmail.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఉలికిపాటు

"నదీ గర్భాన్ని పూడ్చి కట్టిన అక్రమ కట్టడాలను కూల్చి వేయాలని ప్రభుత్వం నిర్ణయిస్తే టీడీపీ నేతలు ఎందుకు ఉలిక్కి పడుతున్నారు? అవి ఇళ్లు లేని పేదలు కట్టుకున్నవి కాదు. వ్యవస్థల్ని మేనేజ్ చేసి పెద్దోళ్లు నిర్మించుకున్నవి. ఇన్నాళ్లు చట్టాల కళ్లుగప్పారు. ఇకపై సాధ్యం కాదు"

– విజయసాయిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

వీడియో

"తమ రాజకీయ లబ్ధి కోసం చాలామంది పాత వీడియోలను పోస్ట్ చేస్తున్నారు. ఒక ఏడాది క్రితం వీడియోలను కూడా పోస్ట్ చేస్తున్నారు. ఏదైనా వీడియోను పోస్ట్ చేయాలనుకుంటే ఆ వీడియో ఏ సందర్భంలో నిది, ఎక్కడ, ఎప్పుడు తీశారో చెప్పాలి. ఒకవేళ మీకు ఈ విషయాలు తెలియనట్లయితే వీడియోలు పోస్ట్ చేయకండి. దయచేసి సామాజిక మాధ్యమాల్లో బాధ్యతగా మెలగండి"

– ప్రతీక్ సిన్హా
ఆల్ట్ న్యూస్ సహ వ్యవస్థాపకుడు

మెజారిటీ

"నాకు తెలిసినవారు కాకపోతే బీజేపీకి ఇంకెవరు ఓటేశారు? నాకు తెలిసిన వారెవరూ వాడక పోతే ఫెయిర్ అండ్ లవ్లీ పాపులర్ ఎలా అయ్యింది? ఏడాదికోసారో, రెండుసార్లో మీ డ్రైవర్‌తోనో, పనిమనిషితోనో మాట్లాడి మీకు ప్రజల నాడి తెలుసునని చెప్పకండి. వాళ్ల మాటలను బట్టి మొత్తం దేశ ప్రజల అభిప్రాయాన్ని అంచనావేయలేం"

– శిల్పారత్నం, జర్నలిస్ట్

ఎమర్జెన్సీ

"1975లో విధించిన ఎమర్జెన్సీకి ఇవాళ వార్షికోత్సవం. కానీ, గత ఐదేళ్లుగా మన దేశం సూపర్ ఎమర్జెన్సీలోకి వెళ్లిపోయింది. చరిత్ర నుంచి మనం గుణపాఠాలు నేర్చుకుని దేశంలోని పలు వ్యవస్థల ప్రజాస్వామిక విలువలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉంది"

– మమతా బెనర్జీ
పశ్చిమ బెంగాల్ సీఎం

నిఘంటువు

"దేశవ్యాప్తంగా పెంచి పోషిస్తున్న అసహనం, విద్వేష సంస్కృతి కారణంగా ఒక్క జార్ఖండ్‌లోనే గడిచిన మూడేళ్లలో 18 మూకదాడులు జరిగాయి. దీనికి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బాధ్యత వహించాల్సిన అవసరం లేదా? నూతన భారతదేశంలో బాధ్యత అనే పదాన్ని ప్రభుత్వ నిఘంటువు నుంచి దాదాపుగా తొలగించేశారు"

– ఉమర్ ఖలీద్, సామాజిక కార్యకర్త

చెదిరిన మహా స్వప్నం

'చరిత్ర నిద్రా సముద్రం మీద తుఫాన్ లాగా, కాలం వాయులీనం మీద కమాను లాగా, విప్పుకుంటున్న మూడో కన్నులాగా, నేను వస్తున్నాను' అంటూ నిస్తేజంగా ఉన్న కవితా స్తంభాన్ని బద్దలుకొట్టి ఉగ్ర నరకేస రిలా తెలుగు కవిత్వం లోకి విరుచుకుపడిన ఓ మహా స్వప్నం కనుమూసింది. ప్రఖ్యాత దిగంబర కవి మహాస్వప్న అసలు పేరు కమ్మి శెట్టి వెంకటేశ్వరరావు. ఆయన వయసు 79 ఏళ్లు. 1965లో తెలుగు సాహిత్యంలో పెను తుఫాన్‌లా విరుచుకుపడిన దిగంబర కవులలో ముఖ్యుడు. మురిపిస్తూ ఆకాశాన్ని మెరిపించే ఇంద్ర ధనస్సులా కేవలం ఏడే కవితలు రాశారు. కానీ, అవి ఇంద్ర ధనస్సులాంటి ప్రకృతి సౌందర్యాన్ని చాటేవి కావు. సమాజంలో కుళ్లిపోతున్న విలువలను, కృశించిపోతున్న నిజాయితీనీ మహా ఆగ్రహంతో దిక్‌లు పిక్కటిల్లేలా ప్రశ్నించిన కవితలవి. 'మిమ్మల్ని కాపాడుతున్న / ఈ చీకటి రాత్రి కోట బద్దలు కొడతాను నేను / నాగరికతకు మానభంగం చేస్తాను నేను / ప్రతి పుట్టను పగలగట్టి / విష బుజంగాల్ని పట్టి కోరలు తీస్తాను నేను / ఈ ఘోరారణ్యంలో కారు చిచ్చు రగిలిస్తా. నాగ రికత రావణ లంకా దహనం చేస్తా' అంటూ అప్పటి సమాజపు తీరుతెన్నులపై మహాస్వప్న తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎటు చూసినా నిర్లిప్తత, నిరాశ, నిస్పృహ తాండవిస్తున్న రోజుల్లో ఖంగుమోగిన గొంతు మహాస్వప్నది. స్వాతంత్ర్యానంతరం ప్రజలకు దక్కాల్సిన ఫలాలు దక్కలేదు. కొంతకాలం ఎదురు చూసిన పౌరులంతా ఇంకెంత కాలం ఎదురు చూడాలో తెలీని అయోమయంలో చిక్కుకున్నారు. అప్పటికే ప్రముఖంగా ఉన్న అభ్యుదయ రచయితల సంఘం సంగతి చెప్పనక్కర్లేదు. మిగిలిన రచయితల్లో కొందరు సందిగ్ధంలో ఉంటే, మరికొందరు సంభావనలు నర్దుకుంటున్నారు. అలాంటి 'ఈ చౌరస్తాలోనే యాక్సిడెంట్ జరిగింది / అప్పుడే మతిభ్రమించింది / అప్పుడే కథ మొదలైంది' అంటూ నేపథ్యాన్ని నర్మగర్భంగా కాదు, నగ్నంగానే వెలిబుచ్చుతాడు. దిగంబర కవులు ఆరుగురిలో మహాస్వప్నది కాస్త విలక్షణమైన గొంతు. అందుకు ఆయన ఒక కవితకు పెట్టిన 'మురిగిన సూర్యుణ్ణి నంజుకుంటూ / మృత్యువుని కాస్తకాస్తగా కొరుక్కుతిన్నాను' అనే శీర్షికే నిదర్శనం. దిగంబర కవి కావడానికి ముందే 'అగ్నిశిఖలు–మంచు తెరలు' పేరిట కవితా సంపుటిని ప్రచురించారు. దిగంబర కవిత్వం అనంతరం ఆయన దాదాపు ఏమీ రాయలేదనే చెప్పాలి. అప్పుడప్పుడు అనువాదాలు చేశారు. అరుదైన కవి మహాస్వప్న వెళ్లిపోవడం తెలుగు సాహిత్య లోకానికి విషాద కరం.

నివాళి

– దేశరాజు

గోదావరి ఎత్తిపోతలే తెలంగాణకు శరణ్యం

సందర్భం

చాడ వెంకటరెడ్డి

ఉమ్మడి రాష్ట్రంలో 1,480 టీఎంసీల నీళ్లు వాడుకోవ డానికి అవకాశం వున్న దని 1980 సంవత్సరంలో బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చింది. ప్రధానంగా ప్రాణహిత నది తుమ్మిడిహెట్టి వద్ద గోదావరిలో కలిసిపోగా కాళేశ్వరం వద్ద శబరి కలుస్తున్నది. ప్రాణహిత కలిసిన దగ్గర నుండి గోదావరిలో నీరు పెరిగి, కాళేశ్వరంకు వచ్చేవరకు పెద్ద ప్రవాహంగా మారుతుంది.

సీపీఐ, రైతు సంఘం గత 50 ఏళ్ల నుండి గోదావరి జలాలను వినియోగించుకుంటే తప్ప, తెలంగాణకు వేరే శరణ్యం లేదని అనేక సందర్భాలలో ప్రభుత్వాల దృష్టికి తేవడానికి ప్రత్యేకంగా ఉద్యమాలు నిర్వహించాయి. 1990 నుండి రాష్ట్ర వ్యాపితంగా సాగునీటి సాధన ఉద్యమాలు ముమ్మరంగా సాగాయి. 2000 సంవత్సరంలో గోదావరి వాటర్ కమిషన్‌కు తక్షణమే సర్వేలు చేపట్టాలని రైతు సంఘం నాయకులు కొల్లి

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ బుధవారం
26-6-2019

నా లైఫ్‌లో ఆ బ్యాచ్ ఉంటే బాగుంటుంది
కాంబినేషన్ కుదిరేనా?
సినిమా పేజీలో...

కలచివేసే ఘటనలు జరుగుతున్నాయి. కఠినమైన చట్టాలూ ఉన్నాయి! అయినా ఆడపిల్లలపై అఘాయిత్యాలు పెరుగుతూనే ఉన్నాయి. నిన్న మొన్న.. వరంగల్‌లో పసికందుపై 'హత్యాచారం'.. ఒంగోలులో టీనేజ్‌పై గ్యాంగ్ రేప్..! వీటిని ఆపేదెలా?! 'గట్టి చట్టాలు ఉంటే సరిపోదు.. ఆ చట్టాలను.. గట్టిగా అమలు పరిచేవాళ్లుండాలి" అంటున్నారు ప్రముఖ సామాజిక కార్యకర్త కల్యాణి.

అమలు కాని చట్టమూ అఘాయిత్యమే

శ్రీహిత... తొమ్మిది నెలల పాపాయి. ఆమెకు పాలు తాగిస్తూ జో కొడుతోంది పాపాయి తల్లి. సగం పాలు తాగగానే నిద్రలోకి జారుకుంది శ్రీహిత. పాపాయిని ఒత్తిగిల తిప్పి పడుకోబెట్టింది. పాల సీసాను పక్కనే పెట్టి తనూ నిద్రలోకి జారిపోయింది. పాపాయి కదిలినప్పుడు మిగిలిన పాలు తాగిద్దామనుకుందా తల్లి. అమ్మపక్కన పడుకుని ఉన్నాననే భరోసాతో లోకాన్ని మరిచి నిద్రపోతోంది శ్రీహిత. అర్ధరాత్రి, దాదాపుగా ఒకటి ముప్పావు సమయంలో పాపాయికి ఆకలవుతుందేమోనని పాలు తాగిద్దామని తడిమి చూసుకుంది. పాపాయి లేదు. ఒంటిగంట సమయంలో టెర్రస్ మీద నిద్రపోతున్న పాపాయిని ఎత్తుకెళ్లిపోయాడు దుండగుడు! అమ్మానాన్న, బంధువులు, పోలీసులు అందరూ పాపాయి కోసం వెతకడం మొదలు పెట్టారు. దుండగుడు ఒక టవల్‌లో పాపాయిని చుట్టి పరుగులు తీస్తుండడాన్ని గమనించాడు శ్రీహిత మేనమామ. బంధువులు పరుగెత్తుకెళ్లి అతడిని పట్టుకున్నారు. దుండగుడిని పోలీసులకు పట్టించి పాపాయిని హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అయితే... ఆ చంటిబిడ్డ ప్రాణాలు ఎప్పుడో గాల్లో కలిసిపోయాయి. మానవమృగాల్లో దాగిన కర్కశత్వాన్ని భరించలేని ఆ పసిప్రాణం ఈ లోకంలో ఉండకూడదనుకుంది. వరంగల్, హన్మకొండలోని కుమ్మరపల్లిలో ఈ నెల 20వ తేదీ తెల్లవారుజామున జరిగిన సంఘటన ఇది.

న్యాయపోరాటం

పాలు తాగే చంటిబిడ్డ హత్యకు గురైంది. అంతకంటే ముందు మాటల్లో చెప్పలేని అఘాయిత్యానికి కూడా బలైంది. హంతకుడిని వెతికి పట్టుకునే శ్రమ కూడా పోలీసులకు లేకుండా బంధువులే పట్టిచ్చారు. పోలీసులు హంతకుడి మీద అపహరణ, హత్య, దొంగతనం (పాపాయి తల్లిదండ్రుల మొబైల్ ఫోన్‌లను దొంగిలించాడు), సెక్షన్‌లతోపాటు పోక్సో (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ యాక్ట్) కింద కేసు నమోదు చేసినట్లు చెబుతున్నారు. ఇంకా హంతకుడి పేరు ప్రవీణ్ అని, అతడు తమ చేతికి చిక్కేటప్పటికి మద్యం సేవించి ఉన్నాడని, శ్రీహిత ప్రైవేట్ పార్ట్స్‌లో గాయాలను తాము గుర్తించినట్లు, లైంగిక వేధింపుకు గురైనట్లు కూడా చెబుతున్నారు. అయితే పోలీసులు హంతకుడిని ఎక్కడో దాచేశారని, ఎక్కడ దాచారో కూడా తెలియడం లేదని శ్రీహిత తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ బిడ్డకు జరిగినటువంటి అన్యాయం మరే బిడ్డకూ జరగకూడదని కన్నీళ్ల పర్యంతమవుతున్నారు. శ్రీహిత సంఘటనకు వరంగల్ నగరం ఒక్కటే కాదు తెలుగు రాష్ట్రాలు రెండూ ఉడికి పోయాయి. పౌర సమాజం ఆగ్రహజ్వాలలు అగ్నికీలల్లా ఎగిసిపడ్డాయి. 'హంతకుడికి శిక్ష విధించండి, శిక్షను బహిరంగంగా అమలు చేయండి, ఉన్మాది మీద దయ చూపకండి, ఉన్మాదిని ఉరితీయండి' అని ఆందోళనలు చేశారు. అయితే... ఆందోళన చేస్తున్న పౌరుల మీద దాడులు జరుగుతున్నాయి తప్ప హంతకుడి మీద చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదని సామాజిక కార్యకర్తలు ఆరోపిస్తున్నారు.

చట్టాలను తిరగరాయండి

''మన పీనల్ కోడ్ రాసుకున్నప్పటి సామాజిక పరిస్థితులు వేరు, ఇప్పటి పరిస్థితులు వేరు. సమాజంలో ఇంతటి తీవ్రమైన నేరాలు లేని రోజుల్లో రాసుకున్న చట్టాలవి. ఓ సారి నిపుణులందరూ కూర్చుని చట్టాలను, ప్రస్తుత సామాజిక పరిస్థితులను సమీక్షించండి. అవసరమైన కొత్త చట్టాలను తీసుకురండి. మేల్‌సొసైటీ సున్నితత్వాన్ని కోల్పోతోంది. మహిళలు, బాలికల మీద క్రైమ్ రేట్ ఏడాదికేడాదికీ పెరిగిపోతూనే ఉంది. శ్రీహిత విషయంలో.. కేసును విచారించకనే 'మద్యం మత్తులో నేరానికి పాల్పడ్డాడ'నే తొలి పలుకులు వినిపిస్తున్నాయి. దీనర్థం నెపాన్ని మద్యం మీదకు తోసేసి హంతకుడిని శిక్ష నుంచి తప్పిస్తారా'' అని ప్రశ్నిస్తున్నారు శ్వాస ఫౌండేషన్ నిర్వహకురాలు గొర్రె కల్యాణి.

స్పందన కోసం ఎదురుచూపు

''టీవీలో వార్త చూడగానే మనసు కలచివేసింది. టీవీ, పేపర్‌లతోపాటు సోషల్ మీడియాను కూడా ఫాలో అవుతూనే ఉన్నాను. కలెక్టర్ వచ్చిన పది నిమిషాలకే కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి వెళ్లారని తెలిసింది. ఒక్క ప్రజాప్రతినిధి కూడా వచ్చిన దాఖలాలు కనిపించలేదు. ఎలక్షన్ ప్రచారంలో దోసెలు వేశారు, ఇస్త్రీ చేశారు, పిల్లలకు స్నానాలు కూడా చేయించారు. అలాంటిది ఒక చంటిబిడ్డకు జరగరాని ఘోరం జరిగితే ఒక్కరూ రాలేదేంటని నేనే రంగంలోకి దిగాను. 'ప్రధాన మంత్రి మోదీకి, కేటీఆర్‌కి 'స్పందించండి ప్లీజ్' అని ట్వీట్ చేశాను. నా ఫ్రెండ్స్ చేత కూడా చేయించాను. అలాగే నా ఫేస్‌బుక్ ఫ్రెండ్స్‌ని.. 'కంప్యూటర్ ముందు కూర్చుని సానుభూతి వచనాలు పోస్ట్ చేయడం కాదు, అందరూ కదిలి రోడ్డు మీదకు రావాలి. మౌనంగా అక్షరాల్లో అసహనాన్ని వ్యక్తం చేస్తే సరిపోదు, న్యాయపోరాటం కోసం గళం వినిపించాలి' అని కూడా కోరాను. హన్మకొండ ఏకశిలా పార్క్‌లో 22వ తేదీన ధర్నాలో పాల్గొన్నాం. వారం రోజుల్లో 15 రేప్‌లు జరిగాయి. నిర్భయ చట్టం ఏమవుతుందో తెలియడం లేదు. పోక్సో చట్టం ఎందుకు అమలు కావడం లేదో అర్థం కావడం లేదు. ఉత్తర ప్రదేశ్‌లో ఆరేళ్ల బాలికను రేప్ చేసి పారిపోయిన నిందితుడిని పోలీసులు వెతికి పట్టుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకునే క్రమంలో పారిపోతుంటే కాళ్ల మీద కాల్చారు ఎస్‌పి. ప్రకాశం జిల్లాలో బాలిక మీద సామూహిక అత్యాచారానికి పాల్పడిన వాళ్లను గంటల్లో వెతికి పట్టుకున్నారు. పోలీసులు చట్టాన్ని పరిరక్షించాలనుకుంటే పరిరక్షించగలరు. శ్రీహిత విషయంలో అలా అనుకోవడం లేదు ఎందుకనేదే మా ఆవేదన. చట్టం అమలవక పోవడమూ అఘాయిత్యమే.

● శ్రీహిత కుటుంబాన్ని ఓదారుస్తున్న కల్యాణి

తక్షణం శిక్ష ఉండాలి

చంటి బిడ్డల మీద అఘాయిత్యానికి పాల్పడిన వాళ్లను ఇరవై నాలుగ్గంటల లోపు అరెస్ట్ చేసి ఎఫ్ఐఆర్ ఫైల్ చేయాలి. నెల రోజుల్లో తీర్పు ఇచ్చి శిక్షను అమలు చేయాలి. ఆ శిక్షలు చాలా కఠినంగా ఉండాలి. ఎంత కఠినంగా ఉండాలంటే.. మరొకరు ఎవరైనా ఇలాంటి దురాగతానికి పాల్పడేటప్పుడు ఈ శిక్షలు గుర్తుకు వచ్చి వెనక్కు తగ్గేటట్లు భయం కలిగించాలి. అదే శ్రీహిత చట్టం. అంతటి కచ్చితమైన శ్రీహిత చట్టం.. మహిళా సమాజానికి హితకారిణి కావాలి. మద్యం తాగినందువల్లే ఇలా చేశాడని నమ్ముతుంటే... మద్యాన్ని కూడా నిషేధించాలి. నా మట్టుకు నాకు ఎదురైన సంఘటన.. ఒక సారి టాక్సీలో వెళ్తున్నప్పుడు డ్రైవర్ ఉద్దేశపూర్వకంగా రూట్ డైవర్ట్ చేశాడు. నేనది గమనించి అతడిని గట్టిగా హెచ్చరించడంతో దారి కొచ్చాడు. అప్పటి నుంచి హ్యాండ్ బ్యాగ్‌లో కత్తి పెట్టుకుని ప్రయాణిస్తున్నాను. ఆడపిల్లలు కత్తి దగ్గర పెట్టుకోగలరేమో కానీ ఎంతమంది ఆ కత్తిని ధైర్యంగా ఉపయోగించగలుగుతారు? చట్టాలే కత్తి వాదర అంత పదునుగా మారి ఆడపిల్లకు రక్షణగా ఉండాలి.

– జి. కల్యాణి, శ్వాస ఫౌండేషన్ నిర్వహకురాలు

జనాగ్రహం

మేము ధర్నా చేస్తున్నప్పుడు పోలీసులు చెదరగొట్టేశారు. మూడు వందల మందిని ఒక చోట ఉండనివ్వకుండా ఐదారు చోట్లకు తరిమేశారు. ఆ ఘర్షణలో అక్కడ ఉన్న జనం నుంచి 'మేము హంతకుడిని పోలీసులకు పట్టిచ్చి తప్పు చేశాం. ఒక్కొక్కరం ఒక్కొక్క దెబ్బ వేసినా చచ్చి ఊరుకునే వాడు. మరొకడు ఈ దుర్మార్గపు పనికి పూనుకోకుండా భయపడే వారు. వాడిని మాకివ్వండి నడిరోడ్డు మీద ఉరి తీస్తాం. న్యాయం అడుక్కోవడం ఏమిటి, మేమే అమలు చేస్తాం' అనే మాటలు వినిపించాయి. జనాగ్రహం ఇంత తీవ్రంగా ఉంటే 'తొమ్మిది నెలల పాపాయిని రేప్ చేయడం జరిగే పనేనా' అంటూ మరొక వాదన వినిపించింది. పాపాయి ప్రైవేట్ పార్ట్స్‌కు గాయాలయ్యాయని, ఎముకలు విరిగే బిడ్డ దేహం ఛిద్రమయ్యి కనిపిస్తుంటే ఆ మాటలు అనడానికి వాళ్లకు నోరెలా వచ్చిందో తెలియడం లేదు. ఇదంతా కేసును నిర్వీర్యం చేయడానికి చాప కింద నీరులా జరుగుతున్న కుట్ర ఏమో అనిపిస్తోంది'' అన్నారు కల్యాణి.

శ్రీహితకు జరిగిన అన్యాయానికి నిరసనగా లండన్‌లో ర్యాలీ జరిగింది. ఆ సంఘటన జరిగిన వరంగల్‌లో పౌరసమాజం నోరు నొక్కేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయినా ఆ బిడ్డ ఎందుకు ఇంతటి దారుణానికి బలి కావాలి? ఆడపిల్లగా పుట్టడమే శ్రీహిత చేసిన తప్పా?

– వాకా మంజులారెడ్డి

ఫొటోలు: **నోముల రాజేశ్ రెడ్డి**



అమ్మిపడేయండి

భలే మంచి చెత్త బేరము

ప్రస్తుతం అంతా ఆన్‌లైన్ షాపింగ్ హవా నడుస్తోంది. అంతవరకూ బాగానే ఉంది కానీ, దీనివల్ల ఇళ్లల్లో పెద్దపెద్ద కార్టన్లు, పేపర్ బ్యాగ్‌ల రూపంలో కొత్తరకం చెత్త తయారవుతోంది. దీనికి తోడు ఇంట్లో రోజువారి వ్యర్థాలు అదనంగా ఉండనే ఉంటాయి. అయితే 'కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బుబిళ్ల... కాదేదీ కవితకనర్హం' అన్నట్లు ఇంట్లోని చెత్తను కూడా సొమ్ము చేసుకునే మార్గాలు ఉన్నాయి! అంతే కాదు.. ఇంట్లోని పొడిచెత్తను కూడా ఆన్‌లైన్ ద్వారా వదిలించుకోవచ్చని అంటున్నాయి కొన్ని స్టార్టప్ కంపెనీలు. రీసైక్లింగ్ చేయదగిన చెత్తనంతటినీ కస్టమర్ల ఇంటికి వచ్చి మంచి ధరకు కొనుగోలు చేస్తామని చెబుతున్న కొన్ని ఆన్‌లైన్ గార్బేజ్ సంస్థల వివరాలు మీకోసం.

ద కబాడీవాలా

కబాడీవాలా ఒక స్థానిక చెత్తను సేకరించే ఆన్‌లైన్ డీలర్. దీనిని అనురాగ్ అస్తీ, కవీంద్ర రఘువంశీ అనే ఇద్దరు కలిసి ప్రారంభించారు. వీరు తమ యాప్ ద్వారా స్థానికంగా ఉన్న ఇళ్లనుంచి చెత్తను సేకరించి రీసైక్లింగ్ యూనిట్లకు పంపుతారు. ముఖ్యంగా కబాడీవాలా.. న్యూస్ పేపర్లు, ప్లాస్టిక్ వస్తువులు, లోహ వస్తువులు, పుస్తకాలు, ఇనుము వంటి వాటిని ఇంటి యజమానులకు కొంత మొత్తంలో డబ్బులచెల్లించి సేకరిస్తుంది. అయితే వీరు తీసుకున్న చెత్తను ఎక్కడకి తీసుకెళ్తున్నారు? దానిని ఏంచేస్తున్నారో ప్రతీది కస్టమర్లకు తెలుసుకునే విధంగా లైవ్ ట్రాక్ సిస్టం సదుపాయాన్ని కూడా కల్పిస్తున్నారు. కబాడీవాలా సేకరిస్తున్న చెత్త కార్యక్రమం వల్ల.. 10వేల చెట్లను రక్షించబడడమేగాక, 2.5 లక్షల లీటర్ల ఆయిల్, 13.8 మిలియన్ల లీటర్ల నీరు ఆదా అవుతుందని సంస్థ తెలిపింది. ప్రస్తుతం కబాడీవాలా భోపాల్, ఇండోర్, ఔరంగాబాద్, రాయ్‌పూర్‌లలో సేవలందిస్తోంది.

వెబ్‌సైట్: www.thekabadiwala.com

జంక్ కార్ట్

జంక్ కార్ట్‌ను ఢిల్లీకిచెందిన నీరజ్ గుప్తా, శైలేంద్ర సింగ్, ప్రశాంత్ కుమార్, శుభం షా అనే ముగ్గురు కలిసి 2015లో ప్రారంభించారు. వీరు కూడా అన్ని రీసైక్లింగ్ వస్తువులను సేకరిస్తారు. ప్లాస్టిక్, అల్యూమినియం, ఐరన్, పేపర్, పుస్తకాలు, గ్లాస్ వంటి వాటిని సేకరిస్తారు. చెత్త ఇచ్చిన వారికి పేటిఎం వాలెట్ ద్వారా డబ్బులు చెల్లిస్తారు. అయితే ఎవరైనా కస్టమర్లు తమ చెత్త అమ్మగా వచ్చిన డబ్బులను స్వచ్ఛంద సంస్థలు, జంక్ ఆర్ట్‌లకు దానం చేయాలనుకుంటే...జంక్ కార్ట్‌లోని ఒక ఆప్షన్ ద్వారా దానం చేసే సదుపాయాన్ని కూడా కల్పిస్తుంది. మనం ఆన్‌లైన్‌లో ఒక వస్తువును కొనడానికి ఎలా ఆర్డరు ఇస్తామో అలానే జంక్ కార్ట్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆర్డరు ఇస్తే వారే వచ్చి చెత్తను తీసుకెళ్తారు. ఈ మొత్తం వ్యవహారాన్ని చాలా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని నిర్వహకులు చెబుతున్నారు. ప్రస్తుతానికి ఢిల్లీ, ముంబై, బెంగళూరులో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. వారి వెబ్‌సైట్లో ఏ చెత్తను ఎంతరేటుకు తీసుకుంటారో వివరాలు పొందుపర్చారు, వీటి ద్వారావారు చెత్తను కొంటారు.

వెబ్‌సైట్: www.junkart.in

కర్మ రీసైక్లింగ్

మనకు ఏదైనా చెడుగాని, కష్టాలుగాని ఎదురైనప్పుడు మన కర్మ ఇంతేలే అనుకుంటాం. ఈ కర్మనే ఆధారం చేసుకుని చెత్తను పారేసి మీరు మెరుగుపడండి అంటూ ఓ స్టార్టప్ చెబుతోంది. అదే కర్మ రీసైక్లింగ్. మనింట్లో పేరుకు పోయిన చెత్తను పారవేసి మన కర్మను మరింత మెరుగు పరుచుకోవచ్చనే థీమ్‌తో అమీర్ జైరీవాల, అక్షత్ అనే ఇద్దరు ఈ పేరు మీదుగా చెత్తను సేకరిస్తున్నారు. అయితే వీరు మామూలు చెత్తను కాదు... ఎలక్ట్రానిక్ చెత్తను మాత్రమే సేకరిస్తారు. అదీ కూడా పాత మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, వాటికి సంబంధించిన పరికరాలు సేకరిస్తారు. వాటిలో ఏవైనా చిన్నపాటి లోపాలు ఉంటే వాటిని సరిచేసి మళ్లీ వాటిని చాలా తక్కువ రేట్లకు అమ్ముతుంటారు. అయితే వీరు మన దగ్గర ఉన్న ఫోన్లు కానీ ల్యాప్‌టాప్‌గాని కొనాలంటే అది ఏ బ్రాండ్‌కు చెందినది, ఇంకా ఆయా వస్తువు గురించి కొన్ని రకాల చిన్నపాటి ప్రశ్నలకు జవాబులు ఇస్తేనే వారు మనం అమ్మదల్చుకున్న ఫోనుకు ఎంత మేర ధర చెల్లిస్తారో చెబుతారు. కస్టమర్‌కు కర్మ వారు ఇచ్చిన ధర ఓకే అయితే వారు దానిని తీసుకుని సర్వీస్ సెంటరుకు పంపిస్తారు. ఇలా దాదాపు 3 వేల స్మార్ట్‌ఫోన్ మోడళ్లను వీరు రీసైక్లింగ్‌కు తీసుకుంటున్నారు. దేశవ్యాప్తంగా దాదాపు 25 నగరాల్లో కర్మసేవలు అందుబాటులో ఉన్నాయి.

వెబ్‌సైట్: www.karmarecycling.in

ఎక్స్‌ట్రా కార్బన్

ఈ-వేస్ట్‌ను సేకరించే సంస్థే ఎక్స్‌ట్రా కార్బన్. గురుగ్రాంకు చెందిన ఒక స్టార్టప్ సంస్థ. ఈ సంస్థను 2013లో ప్రారంభమైంది. సంవత్సరానికి 6 వేల టన్నుల ఈ-వేస్ట్‌ను ఎక్స్‌ట్రా కార్బన్ సేకరిస్తుంది. ఉత్తర భారతదేశంలోని 9 నగరాల్లో 41 వేలమంది ఎక్స్‌ట్రా కార్బన్ కస్టమర్లు ఉన్నారు. ఎక్స్‌ట్రా కార్బన్ సంస్థను ప్రారంభించిన మొదటే డాదిలోనే రూ.70లక్షలను సంపాదించడం విశేషం.

వెబ్‌సైట్: http://extracarbon.com

స్క్రాప్ ట్యాప్

ఇది హైదరాబాద్‌కు చెందిన సంస్థ. ''జీరో వేస్ట్ హీరో'' అనే నినాదంతో స్క్రాప్ ట్యాప్ ప్రారంభమైంది. దీనిలో ముఖ్యంగా ఐదుదశల్లో చెత్తను సేకరించి రీసైక్లింగ్ చేస్తారు. చెత్త అమ్మేవారు, కొనేవారికి మధ్య ఒక మంచి వారధిగా స్క్రాప్‌ట్యాప్ వ్యవహరిస్తుంది. చెత్తను సేకరించి దానిని డిజిటల్ వేయింగ్ మిషన్ ద్వారా కొలిచి, ధరను నిర్ణయిస్తారు. ఆ తరువాత ఆ ధర కస్టమర్‌కు నచ్చితే దానిని రీసైక్లింగ్ యూనిట్‌కు పంపిస్తారు. వీరు వెబ్‌సైట్ ద్వారానే గాక వాట్సప్ నంబరు ద్వారా కూడా సేవలు అందిస్తున్నారు. స్క్రాప్‌ట్యాప్ ఇళ్లనుంచే గాక చిన్న చిన్న పరిశ్రమల నుంచి కూడా చెత్తను సేకరిస్తుంది.

వెబ్‌సైట్: http://scraptap.in

– పోకల విజయ దిలీప్, సాక్షి, స్టూడెంట్ ఎడిషన్

చెట్టు నీడ

సత్యం... అసత్యం

ఒక బాటసారి ఊరికి వెళ్తూ ఉండగా రాత్రయింది. పడుకోవడానికి కొంచెం స్థలం దొరికితే చాలని అనుకున్నాడు. దగ్గర్లో ఉన్న ఒక ఇంటికి వెళ్లాడు. ఇంటి యజమాని తలుపు తెరిచి అతని లోపలికి పిలిచాడు. తీరా చూస్తే అతను పాత స్నేహితుడే. సంతోషంతో మాట్లాడాడు. 'భోజనం అయిందా?' అని అడిగాడు. ఆ సమయంలో భోజనం అయ్యింది అని అబద్ధం చెప్పాలో, లేక చేయలేదు అని నిజం చెప్పాలో తెలియలేదు. ఒకవేళ భోజనం కాలేదు అంటే ఇంటి యజమాని కట్టెలు తెచ్చి, పొయ్యి వెలిగించి, వంట చేసి వడ్డించాలి. అలా ఆలోచించి ఇంటి వారికి ఇబ్బంది కలగకూడదని 'భోజనం అయింది. పడుకోవడానికి కొంచెం అవకాశం ఇస్తే చాలు' అని అబద్ధం చెప్పాడు. ఇటువంటి అబద్ధం తప్పు అవదు. ఇలా ఆయా కాలానికి తగినట్లు సత్యాసత్యాలను నిర్ణయించుకోవాలి.

మరొక ప్రసిద్ధమైన కథ ఉంది. ఒక ఋషి తన ఆశ్రమంలో ధ్యానం చేస్తూ కూర్చున్నాడు. దగ్గర్లో ఉన్న ఊరిలో దొంగలు పడి, ప్రజలపై దాడి చేసి, ఆ ఊరిలో జనాల సంపదనంతా దోచుకుందామని వారి వెంట పరిగెడుతూ రాసాగారు. ఊరి ప్రజలందరూ తమ ప్రాణాలు మిగిలితే చాలని తప్పించుకొని పరిగెత్తసాగారు. మధ్యలో ఋషి ఆశ్రమం కనిపించింది ఆశ్రమం సమీపంలో ఉన్న పొదలలో వారంతా తలదాచుకున్నారు. వారిని వెంటాడుతూ వచ్చిన దొంగలు ఋషి దగ్గరకు వచ్చి, 'మా వద్ద నుండి తప్పించుకుని వచ్చిన జనాలు ఈ దారిలోనే వచ్చారు అని తెలిసింది. నీవేమన్నా చూసావా?' అని అడిగారు. ఋషి అబద్ధం చెప్తే నరకం సంప్రాప్తిస్తుందని, ప్రజలంతా ఆ పొదలమాటున దాక్కున్నారనే సత్యాన్ని చెప్పాడు. వెంటనే దొంగలు వారిపై దాడి చేసి వారి ఆభరణాలను దోచుకొని, ప్రాణాల్ని సైతం తీసివేశారు. ఋషి చనిపోయిన తర్వాత సత్యం చెప్పినందుకు నరకానికి వెళ్లాడు. ఒకవేళ తాను చూసినా కూడా చూడలేదు అని అబద్ధం చెప్పినట్లయితే స్వర్గానికి వెళ్లేవాడు. ఇతరులకు మేలు చేసేది అబద్ధమైనా ధర్మమే అవుతుంది.

భైరవ నాదం

దెబ్బ తగిలింది... మందేయరూ!

జంతువులు కూడా ఒక్కోసారి మనుషుల్లాగే ప్రవర్తిస్తాయి. బాధ కలిగినపుడు ఏం చేయాలో ఎక్కడికి వెళ్లాలో తమకు కూడా తెలుసునన్నట్లు వ్యవహరిస్తాయి. టర్కీలోని ఇస్తాంబుల్‌లో జరిగిన ఓ ఘటన ఇందుకు తార్కాణంగా నిలిచింది.

వారం రోజుల క్రితం ఓ వీధి కుక్క కాలికి తీవ్ర గాయమైంది. దీంతో వెంటనే అది దగ్గర్లోనే ఉన్న ఫార్మసీలోకి పరిగెత్తింది. చికిత్స చేయాలన్నట్లుగా దీనంగా చూస్తూ అక్కడున్న ఫార్మాసిస్టు బానూ సెంగిజ్‌ను వేడుకుంది. ఇంకేముంది. వెంటనే రంగంలోకి దిగిన బాను దానిని దగ్గరకు తీసుకుని చికిత్స చేసింది. ఇందుకు ప్రతిఫలంగా ప్రేమగా ఆమె చేతిని తాకి తనదైన భాషలో ఆ కుక్క బానుకు ధన్యవాదాలు తెలిపింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ విషయం గురించి బాను మాట్లాడుతూ..'కుక్క కాలికి దెబ్బ తగిలింది. ఫార్మసీలోకి పరుగెత్తుకొచ్చింది. వెంటనే దాని దగ్గరికి వెళ్లి బేబీ.. సమస్య ఏంటమ్మా అని అడిగాను. గోముగా తన గాయాన్ని చూపించింది. ఆయింట్‌మెంట్ రాయగానే నా చేతిని నిమిరి నా వైపు ప్రేమగా చూసింది. ఈరోజు చాలా సంతోషంగా ఉంది' అని చెప్పుకొచ్చారు. ' మీరు చేసిన పని మా మనస్సును గెలుచుకుంది. మూగ జీవాల పట్ల ప్రేమ చూపాల్సిన ఆవశ్యకతను మరోసారి తెలియజేశారు' అంటూ నెటిజన్లు బానుపై కాంప్లిమెంట్లు కురిపిస్తున్నారు.

● వైద్యం కోసం తనకు తానుగా వచ్చిన శునకానికి చికిత్స చేస్తున్న బాను

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ బుధవారం
26-6-2019

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్

ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్! నేను కాలేజ్‌లో మా జూనియర్ అమ్మాయిని లవ్ చేశాను. తననే పెళ్లి చేసుకుందామనుకున్నాను. తనతో మాట్లాడాలంటే నాకు కొంచెం భయంగా ఉంటోంది. అందుకే నా ఫ్రెండ్ ఆ అమ్మాయితో మాట్లాడి.. నేను తనని పెళ్లి చేసుకోవాలనుకున్న విషయం చెప్పాడట. తను 'ఇష్టం లేదు' అని అన్నదట. తను లేకపోతే నేను ఉండలేను సార్. తనంటే నాకు పిచ్చి ప్రేమ. మీరే సలహా ఇవ్వండి ప్లీజ్!
– వంశీ

ఇప్పటిదాకా లేకుండానే ఉన్నావు కదా బ్రో!

ఇప్పుడేం ప్రాబ్లమ్ వచ్చింది బ్రో..??

అమ్మాయికి నువ్వు డైరెక్ట్‌గా చెప్పనూ లేదు..

పోనీ.. ఒక మెసేజ్ ఇచ్చే ధైర్యం కూడా లేదు!

ఓల్డ్ స్టైల్‌లో లవ్ లెటర్ కూడా రాయ లేదు!

గుడికి పొయ్యి.. టెంకాయ కొట్టి దాంట్లో.. *'రోజా పువ్వు పెట్టి ఇవ్వాల్సిందా సార్? మీరు భలే చెబుతారు.. అక్కడ వంశీ మీరేదైనా పవర్‌ఫుల్ మెసేజ్ ఇచ్చి ఎంకరేజ్ చేస్తారని రిక్వెస్ట్ పెట్టుకుంటే.. మీరు వాడి ఆశలను కాలి కింద వేసి.. హ్యాపీగా గంతులు వేస్తారా సార్? పాపం బిడ్డ హార్ట్ ఏమైపోవాలి సార్?'*

డైరెక్ట్ పోయి చెప్పాలి నీలూ..! ఐ లవ్ యూ.. ఐ విల్ టేక్ కేర్ ఆఫ్ యూ.. ఐ విల్ ట్రీట్ యు లైక్ మై గాడెస్.. ఐ విల్...

'సార్..! అది చెప్పలేకే కదా సార్ ఫ్రెండ్‌ని పంపాడు..!?'

ఏమో ఫ్రెండ్ కరెక్ట్‌గా చెప్పాడో..? లేదో..?! అయినా తిరస్కారానికి భయపడి ప్రేమించడం పిరికితనం కదా నీలూ?

కరెక్ట్ సార్! ఏదైనా క్లియర్‌గా ఉండాలి.. మంచి మనసుతో ప్రేమ తెలియచేయాలి.. అప్పుడే అమ్మాయి నిన్ను రెస్పెక్ట్ చేస్తుంది వంశీ!'

lovedoctorram@sakshi.com

ఈ పాటకు ట్యూన్ తెలుసా?



నీ స్నేహం ఇక రాను అని
కరిగే కలగా అయినా
ఈ దూరం నువు రాకు అని
నను వెలివేస్తూ ఉన్నా
మనసంతా నువ్వే...
నా మనసంతా నువ్వే... (2)

గానం : ఆర్.పి.పట్నాయక్

ఎవ్వరినెప్పుడు తన వలలో
బంధిస్తుందో ఈ ప్రేమ
ఏ మదినెప్పుడు మబ్బులలో
ఎగరేస్తుందో ఈ ప్రేమ
అర్థంకాని పుస్తకమే అయినా గాని ఈ ప్రేమ
జీవిత పరమార్థం తానే
అనిపిస్తుంది ఈ ప్రేమ
ప్రేమ ప్రేమ ఇంతేగా ప్రేమ (2)
ఇంతకు ముందర ఎందరితో
ఆటాడిందో ఈ ప్రేమ
ప్రతి ఇద్దరితో మీ గాథే
మొదలంటుంది ఈ ప్రేమ
కలవని మంటలలో కనపడుతుంది ఈ ప్రేమ
కలిసిన వెంటనే ఏమౌనో చెప్పదు
పాపం ఈ ప్రేమ
ప్రేమ ప్రేమ ఇంతేగా ప్రేమ (2)

గానం : కె.కె.
చిత్రం: మనసంతా నువ్వే (2001)
రచన : సిరివెన్నెల
సంగీతం : ఆర్.పి.పట్నాయక్

కాసుకో సుడోకు

	5			6			8	
			1			9	2	5
		8	5	9		4		7
	7				4		9	3
5	3		7	3	5		4	
3		7		4	6	1		
1	8	2			7			
	6			8			7	

నిబంధనలు:
ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

1	3	6	8	2	5	7	4	9
9	5	4	7	3	1	8	2	6
7	2	8	9	4	6	5	3	1
2	1	3	4	6	7	9	8	5
8	6	9	5	1	3	2	7	4
5	4	7	2	9	8	1	6	3
4	7	5	3	8	9	6	1	2
3	8	1	6	5	2	4	9	7
6	9	2	1	7	4	3	5	8

కాంబినేషన్ కుదిరేనా?

తమన్నా

''హైదరాబాద్ బాయ్స్ ఇక్కడ ఉన్నారు...' అంటూ శ్రుతీహాసన్ నటుడు రానా, దర్శకుడు ప్రకాశ్ కోవెలమూడితో కలసి దిగిన ఓ ఫొటోను బయటపెట్టారు. అంతే.. ఈ ఫొటో ఆధారంగా కథలు మొదలయ్యాయి. ఇంతకీ ఇక్కడ అని శ్రుతీహాసన్ అన్నది ముంబై గురించే. ప్రస్తుతం ఆమె ముంబైలో ఉన్నారు. అక్కడే ఈ ముగ్గురూ మీట్ అయి, సెల్ఫీలు దిగి సందడి చేశారు. దాంతో రానా, శ్రుతి కాంబినేషన్‌లో ప్రకాశ్ ఓ సినిమా ప్లాన్ చేస్తున్నాడని వార్తలు మొదలయ్యాయి. ప్రకాశ్ కోవెలమూడి దర్శకత్వంలో వచ్చిన 'అనగనగా ఓ ధీరుడు' సినిమాతో శ్రుతీహాసన్ తెలుగు తెరకు పరిచయం అయ్యారు. అప్పటి నుంచే ఇద్దరి మధ్య మంచి స్నేహం కొనసాగుతోంది. అయితే రానా, శ్రుతీ కలసి యాక్ట్ చేయలేదు. మరి.. ఈ కాంబినేషన్ ప్రకాశ్ సినిమాతో కుదురుతుందా? అంటే వేచి చూడాలి. 'కాటమరాయుడు'(2017) సినిమా తర్వాత తెలుగులో మరో సినిమాకు సైన్ చేయలేదు శ్రుతీహాసన్. ప్రస్తుతం 'లాభం' అనే తమిళ సినిమా, విద్యుత్ జమాల్ హీరోగా తెరకెక్కుతున్న ఓ హిందీ సినిమా చేస్తున్నారు. అలాగే అమెరికన్ వెబ్ సిరీస్ ఒప్పుకున్నారు. ఎప్పటిలాగే మరోవైపు తన మ్యూజిక్ జర్నీని కూడా కొనసాగిస్తున్నారు.

ప్రకాశ్, శ్రుతి, రానా

శ్రుతీహాసన్

నేను బొమ్మ గీస్తే..!

''సినిమాలో పాత్ర పండటం కోసం ఏదేదో చేస్తాం. ఫైట్ చేస్తాం, వంట చేస్తాం, గయ్యాళిలా ప్రవర్తిస్తాం.. ఇలా పాత్రకు తగ్గట్టు చేస్తాం. అవన్నీ రియల్ లైఫ్‌లో చేయం. అసలు సినిమాల్లో కనిపించే మేం వేరు.. రియల్ లైఫ్‌లో మేం వేరు'' అంటున్నారు తమన్నా. ఎందుకు ఇలా అంటున్నారంటే.. ఆ మధ్య విడుదలైన 'అభినేత్రి 2'లో ఈ మిల్కీ బ్యూటీ పెయింటర్ పాత్ర చేశారు. మరి.. నిజజీవితంలో మీకు బొమ్మలు గీయడం వచ్చా? అని అడిగితే – ''నేనా? బొమ్మలు గీయడమా? రానే రాదు. చిన్నప్పుడు బొమ్మలతో ఆడుకున్నాను (నవ్వుతూ). నాకెవరైనా ఖాళీ కాగితం ఇచ్చి, బొమ్మలు గీయమంటే.. ఓ సర్కిల్ (వలయం) గీసి, దానికి రెండు కాళ్లు, రెండు చేతులు గీయగలను. అవేముంది? జస్ట్ గీతలే కదా. నా బొమ్మలో ఆ గీతలే కాళ్లూ చేతులు. ఆ బొమ్మ బొమ్మలా ఉండదు. అయితే నాకు కవితలు రాయడం బాగా వచ్చు. షూటింగ్ లేనప్పుడు కవితలు రాస్తుంటాను'' అని చెప్పారు. చిరంజీవి 'సైరా: నరసింహారెడ్డి' చిత్రంలో తమన్నా ఓ కీలక పాత్ర చేసిన విషయం తెలిసిందే. ఇది నెగటివ్ రోల్ అనే వార్త ప్రచారంలో ఉంది. అయితే అది నిజం కాదని సమాచారం.

నివేదా థామస్

నా లైఫ్‌లో ఆ బ్యాచ్ ఉంటే బాగుంటుంది

"స్క్రీన్ టైమ్ కాదు.. కథలో నా పాత్రకు ప్రాముఖ్యత ఉండాలని కోరుకుంటున్నాను. ఎగ్జైట్ చేసిన స్క్రిప్ట్స్‌నే ఒప్పుకుంటున్నాను" అన్నారు నివేదా థామస్. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో శ్రీవిష్ణు, నివేదా థామస్ జంటగా నటించిన చిత్రం 'బ్రోచేవారెవరురా'. మన్యం విజయ్ కుమార్ నిర్మించారు. సురేష్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను ఈ నెల 28న విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా నివేదా థామస్ చెప్పిన కబుర్లు

● ఇందులో నా పాత్ర పేరు మిత్రా. క్లాసికల్ డ్యాన్సర్ కావాలన్నది మిత్రా కోరిక. నా రియల్‌లైఫ్‌లో నా ఐదేళ్లప్పుడే క్లాసికల్ డ్యాన్స్ నేర్చుకున్నా. హ్యూమన్ రిలేషన్‌షిప్స్ ఆధారంగా ఈ సినిమా ఉంటుంది. ప్రస్తుతం సమాజంలో ఏం జరుగుతుందనే విషయాలను ఆసక్తికరంగా చూపించాం. మహిళలపై వేధింపుల అంశాన్ని చర్చించాం. స్క్రీన్‌ప్లే ఆసక్తికరంగా ఉంటుంది.

● 'ఆర్ 3' బ్యాచ్ (శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ) వల్ల మిత్రా లైఫ్‌లో కొన్ని ఊహించని సంఘటనలు జరుగుతాయి. ఆ సంఘటనల ప్రభావం ఆర్3 బ్యాచ్‌పై పడుతుంది. ఈ పరిస్థితుల్లో ఎవరు ఎవర్ని ఎలా కాపాడుకున్నారు అన్నదే కథాంశం. ఇది ఉమెన్ ఓరియంటెడ్ ఫిల్మ్ కాదు. సినిమాలోని అందరి పాత్రలకు ప్రాముఖ్యత ఉంటుంది. ఈ సినిమా చేసిన తర్వాత నా లైఫ్‌లో ఆర్ 3 బ్యాచ్‌లాంటి వారు ఉంటే బాగుండు అనిపించింది. వివేక్ ఆత్రేయ మంచి డైరెక్టర్. మంచి అవుట్‌పుట్ ఇచ్చారు.

● నేనేం చేసినా ఒక పద్ధతి ప్రకారం చేయాలనుకుంటాను. సీన్‌కు అవసరం అయితేనే హోమ్‌వర్క్ చేస్తాను. రొటీన్ సినిమాలు చేయడం నాకు అంతగా ఇష్టం ఉండదు. ఈ సినిమాకు నేనే డబ్బింగ్ చెప్పాను. 'జెంటిల్‌మన్' అప్పుడే నా పాత్రకు నేను డబ్బింగ్ చెప్పాలనుకున్నాను. కుదర్లేదు. '118' చిత్రం నుంచి నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పుకుంటున్నా.

● తమిళంలో సినిమాలు చేయకపోవడానికి పెద్దగా కారణం ఏమీ లేదు. 'జెంటిల్‌మన్' తర్వాత తెలుగులో నాకు చాలా మంచి స్క్రిప్ట్స్ వచ్చాయి. చేస్తున్నాను. హైదరాబాద్‌లో ఇల్లు కొనలేదు. కొనే ఆలోచనలో ఉన్నాను.

● 'మీటూ' అనేది మూమెంట్. మహిళలపై వేధింపులనేవి అన్ని రంగాల్లోనూ ఉన్నాయి. యాక్టర్స్ పబ్లిక్ ఫిగర్స్ కాబట్టి ఈజీగా కామెంట్ చేయొచ్చని కొందరు అనుకుంటారు. సోషల్ మీడియాలో నాపై ట్రోల్స్‌ను పట్టించుకోను.

● ప్రస్తుతం ఇంద్రగంటిగారి 'వి'లో నటిస్తున్నా. 'శ్వాస' సినిమా ప్రీ–ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. రజనీకాంత్ గారి 'దర్బార్' సినిమాలో నటిస్తున్నానా? లేదా? అనేది నేను చెప్పలేను. చిత్రబృందం అధికారికంగా చెబితే బాగుంటుందన్నది నా అభిమతం.

తాతకు తగ్గ మనవడు

స్టైలు స్టైలులే నీది సూపర్ స్టైలులే అని రజనీకాంత్ సూపర్ స్టైల్‌ని చాలామంది మెచ్చుకుంటారు. అద్దం ముందు నిలబడి చిన్నపిల్లలు రజనీ స్టైల్స్ చేసి చూసుకుంటారు. ఇక కుర్రకారు గురించి చెప్పక్కర్లేదు. రజనీలా వాకింగ్, రజనీలా టాకింగ్, సిగరెట్ అలవోకగా విసిరి, నోటితో క్యాచింగ్.. ఇలా చాలా చాలా చేస్తారు. బయటవాళ్లే ఇంత చేస్తే ఇక ఇంట్లో ఉన్న మనవడు ఊరుకుంటాడా? తాతను ఫాలో అయిపోతున్నాడు. రజనీకాంత్ రెండోకుమార్తె సౌందర్య కొడుకు వేద్ తాత స్టైల్‌ని గమనిస్తుంటాడట. 'పేటా'లో తాత నిలబడినట్లు.. రెండు చేతులను జేబులో పెట్టుకుని నిలబడినప్పుడు మురిసిపోయిన సౌందర్య ఫొటో తీశారు. ఇక్కడ మనం చూస్తున్న ఫొటో అదే. వేద్ స్టైల్ చూస్తుంటే తాతకు తగ్గ మనవడు అనాలనిపిస్తోంది కదూ.

రజనీకాంత్ వేద్

మనోధర్మం కోసమే సినిమాలు

హరినాథ్ పాలిచర్ల

"వృత్తిధర్మం కోసం డాక్టర్‌గా చేస్తున్నాను. మనోధర్మం కోసం సినిమాల్లో నటిస్తున్నాను. కేవలం డబ్బు వల్లే అన్ని విషయాలూ సాధించలేం" అని దర్శక-నిర్మాత హరినాథ్ పాలిచర్ల అన్నారు. ఆయన టైటిల్ రోల్‌లో రూపొందిన చిత్రం 'కెప్టెన్ రాణాప్రతాప్'. హరినాథ్ స్వీయదర్శకత్వంలో తెరకెక్కించిన ఈ సినిమా ఈ నెల 28న విడుదల కానుంది. ఈ సందర్భంగా హరినాథ్ చెప్పిన విశేషాలు.

● మిలిటరీ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా ఉంటుంది. రానా ప్రతాప్ పాత్రలో నేను నటించాను. ఓ కోవర్టు అపరేషన్ కోసం రానా ప్రతాప్ పాకిస్తాన్ వెళ్తాడు. అక్కడికి వెళ్లి రానా ప్రతాప్ ఆ ఆపరేషన్‌ను ఎలా సక్సెస్‌ఫుల్‌గా కంప్లీట్ చేశారన్నదే కథ. మా సినిమాకి, అభినందన్ వర్తమాన్ (భారతీయ సైనికుడు) సంఘటనకూ సంబంధం లేదు. రెండేళ్ల క్రితమే ఈ కథ రాసుకున్నా.

● చిన్నతనం నుంచే నాకు నటనపై ఆసక్తి ఉంది. స్టేజ్ ఆర్టిస్ట్‌ని కూడా. సినిమాలు చేస్తూనే ఉన్నాను. 'చంద్రహాస్' సినిమా టైమ్‌లో నేను పాత్రలోకి పరకాయ ప్రవేశం చేస్తానని... ఆ చిత్రదర్శకుడు శివదత్తా (ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి తండ్రి) గారు నాకు మంచి కాంప్లిమెంట్ కూడా ఇచ్చారు. 'కెప్టెన్ రాణాప్రతాప్' సినిమాకు హీరోగా నేనైతే న్యాయం చేయగలనని నాకు అనిపించింది. అందుకే నేనే నటించాను. నా విజన్‌ను స్క్రీన్‌పై చూపించడానికి సులువు అవుతుందని నేనే ఈ సినిమాకు దర్శకుడిగా మారాను. ఈ సినిమా రిలీజ్‌కు మైత్రీ మూవీ మేకర్స్ సహకరించింది.

● ఇందులో దాదాపు గంటకు పైగా యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయి. మార్షల్ ఆర్ట్స్‌లో నాకు ప్రవేశం ఉండటంతో యాక్షన్ సీక్వెన్స్ చేయడం నాకు ప్రాబ్లమ్ అనిపించలేదు. అలాగే ఈ సినిమాలో సైనికుల కుటుంబాల సమస్యలను కూడా ప్రస్తావించాం. మహిళా సాధికారిత అంశాన్ని కూడా టచ్ చేశాం. ఇందుకోసం కొందరి సైనికుల కుటుంబాలతో మాట్లాడటం జరిగింది. సుమన్‌గారు గ్రేట్ యాక్టర్ ఆయన ఈ సినిమాలో మేజర్‌గా నటించారు.

● ఈ సినిమా తర్వాత రజాకార్ల కాలంలో పోరాడిన ఓ కుటుంబం నేపథ్యంలో ఓ సినిమా చేయబోతున్నాను. ఇది పీరియాడికల్ మూవీ కాబట్టి నేను దర్శకత్వం వహించాలనుకోవడం లేదు.

గ్యాంగ్ వార్

సుదీప్, సందీప్, రాజు, సుస్మిత ముఖ్య తారలుగా ఆర్.ఎస్. సురేశ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఆగ్రహం'. ఎస్ఎస్ చెరుకూరి క్రియేషన్స్ పతాకంపై సందీప్ చెరుకూరి నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ముంబైలో ఆవిష్కరించారు. ఆర్.ఎస్. సురేశ్ మాట్లాడుతూ– ''రాజకీయ నేపథ్యంలో రెండు గ్యాంగ్‌ల మధ్య జరిగే గ్యాంగ్‌స్టర్ కథాంశమిది. ఇందులోని 5 ఫైట్స్ చాలా బాగుంటాయి. 'ఆఫీసర్, సర్కార్ 3' చిత్రాల సంగీత దర్శకుడు రవిశంకర్ అందించిన ఆర్ఆర్ మా సినిమాకి ప్రధాన ఆకర్షణ'' అన్నారు. ''పూర్తి యాక్షన్ అంశాలున్న చిత్రమిది. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఆడారి మూర్తి నేతృత్వంలో ఈ చిత్రాన్ని చాలా ఫాస్ట్‌గా నిర్మించాం. జూలైలో సినిమా విడుదల చేయనున్నాం'' అన్నారు సందీప్ చెరుకూరి. మూర్తి ఆడారి, సంగీత దర్శకుడు రవిశంకర్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ఎస్. రామకృష్ణ.

రామ్‌గోపాల్ వర్మతో మారుతి, సురేష్, రవిశంకర్...

సెక్షన్ 497 నేపథ్యంలో...

సూపర్‌స్టార్ కృష్ణతో 'శ్రీశ్రీ', కొత్తవారితో 'నాటకం' వంటి సినిమాలు నిర్మించిన సాయిదీప్ చాట్ల తాజాగా రూపొందిస్తున్న చిత్రం 'సెక్షన్ 497 ఇండియన్ పీనల్ కోడ్'. సందీప్ జక్కం ఈ చిత్రంతో దర్శకునిగా పరిచయం అవుతున్నారు. అంగనారాయ్ లీడ్ రోల్ చేస్తున్న ఈ సినిమా గుంటూరులో ప్రారంభమైంది. సాయిదీప్ చాట్ల మాట్లాడుతూ– ''లేడీ ఓరియెంటెడ్ కథాంశంతో తెలుగు, తమిళ, హిందీ భాషల్లో రూపొందుతోన్న చిత్రమిది. మన దేశంలో వివాహ వ్యవస్థ రానురాను బీటు వారిపోతోంది. పాశ్చాత్య ధోరణులు విపరీతంగా పెరిగిపోయి కుటుంబ వ్యవస్థను శాసిస్తున్నాయి. దాంతో యువతీ యువకులు సహజీవనం పేరుతో జీవనాన్ని సాగిస్తూ ఇష్టం లేనప్పుడు ఈజీగా విడిపోతున్నారు. మన సంప్రదాయాలు మరుగుపడిపోకుండా 'సెక్షన్ 497' అనే ఇండియన్ పీనల్ కోడ్ ఒకటి ఏర్పాటైంది. ఆ సెక్షన్ నేపథ్యంలోనే మా సినిమా ఉంటుంది. ఒక ఎస్పీ అల్లుడు డీఎస్పీని హౌస్ అరెస్ట్ చేసినప్పుడు జరిగే పరిస్థితుల్ని కథగా రూపొందించాం. జూలై మొదటి వారంలో షూటింగ్ ప్రారంభించి, సింగిల్ షెడ్యూల్‌లో పూర్తి చేసి, ఆగస్టులో సినిమాని విడుదల చేయనున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎస్‌కె. బాజి.

సాయిదీప్, సీతారామయ్య, అంగనా రాయ్

మరచిపోలేని సంవత్సరం ఇది

ప్రశాంత్ రెడ్డి

''సినిమా పరిశ్రమలో రాణించాలనే ఆశయంతో అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉద్యోగాన్ని వదిలేశాను. నాన్న నిర్మాతగా వ్యవహరించడంతో 'ప్రాణం ఖరీదు' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాను. ఆ సినిమా నాకు చాలా సంతృప్తిని, టాలీవుడ్‌లో మంచి గుర్తింపని ఇవ్వడం ఆనందంగా ఉంది'' అని ప్రశాంత్ రెడ్డి అన్నారు. నేడు ఆయన పుట్టినరోజు. ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ– ''ప్రాణం ఖరీదు' తర్వాత 'ఎంకి పాట–ఆర్పీ నోట' అనే వీడియో ఆల్బమ్‌లో నటించాను. నండూరి సుబ్బారావు రాసిన ఎంకి పాటలను దృశ్యరూపంలోకి తీసుకొచ్చే ప్రాజెక్ట్ ఇది. ఇందుకు సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, ఆయన సోదరుడు గౌతమ్ పట్నాయక్‌లకు రుణపడి ఉంటాను. త్వరలోనే నా రెండో సినిమా ప్రారంభం అవుతుంది. మా నాన్నగారే నిర్మిస్తారు. నేను హీరోగా నటిస్తూనే దర్శకత్వం చేస్తా. నా డైరెక్షన్‌లో సినిమా నవంబర్‌లో సెట్స్‌పైకి వెళ్తుంది. ఈ ఏడాది నాకు మెమరబుల్'' అన్నారు.

షాహిద్ కపూర్

మరో రీమేక్‌లో?

తెలుగులో హిట్ అయిన సినిమాలను బాలీవుడ్‌లో రీమేక్ చేయడం కామన్. టాలీవుడ్ హిట్ మూవీ 'అర్జున్ రెడ్డి' హిందీ రీమేక్ 'కబీర్ సింగ్'తో షాహిద్ కపూర్ ఇటీవల భారీ హిట్ అందుకున్నారు. షాహిద్ గత చిత్రాల అత్యధిక వసూళ్లను సైతం 'కబీర్‌సింగ్' తొలి వారంలోనే దాటనుందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పుడు తెలుగు చిత్రం 'జెర్సీ' హిందీ రీమేక్‌లో నటించనున్నారని బాలీవుడ్ టాక్. నాని, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమా మంచి విజయం సాధించడంతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకుంది. క్రికెట్ నేపథ్యంలో వచ్చిన 'జెర్సీ' సినిమా బాలీవుడ్ ప్రేక్షకులకూ అలరిస్తుందని ప్రముఖ దర్శక–నిర్మాత కరణ్ జోహార్ అనుకున్నారట. అందుకే ఈ చిత్రం రీమేక్ హక్కులను సొంతం చేసుకున్నారనే మాట వినిపిస్తోంది. తెలుగు ఒరిజినల్ వెర్షన్‌ను తెరకెక్కించిన గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలోనే హిందీ రీమేక్ చేయనున్నారట.

జగపతిబాబు, రవిశంకర్

జగపతిబాబు @ స్కార్ రవిశంకర్ @ ముఫార్

కార్టూన్ నెట్‌వర్క్‌లో కామిక్ సీరియల్‌గా మొదలైన 'లయన్ కింగ్'ని డిస్నీ వారు 2డి యానిమేటెడ్ సినిమాగా 1990లో విడుదల చేశారు. అప్పట్లో సూపర్ హిట్‌గా నిలిచిన ఈ సినిమాని ఇప్పుడు 3డి యానిమేటెడ్ టెక్నాలజీతో, కంప్యూటర్ గ్రాఫిక్స్ ఉపయోగించి ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి ఇచ్చేందుకు డిస్నీ వారు ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే 'లయన్ కింగ్' కొత్త హంగులతో 3డి యానిమేటెడ్ సినిమాగా జూలై 19న విడుదల కానుంది. జాన్ ఫేవ్‌రేవ్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలోని స్కార్ పాత్రకి నటుడు జగపతి బాబు డబ్బింగ్ చెప్పగా, ముఫార్ పాత్రకి డబ్బింగ్ స్టార్, నటుడు పి.రవిశంకర్ డబ్బింగ్ చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగుతో పాటు పలు భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.

కియారా అద్వానీ

గిల్టీ ఫీలింగ్‌తో...

ఏదో నేరం చేసినట్టు గిల్టీగా ఫీల్ అవుతున్నారు కియారా అద్వానీ. అంత తప్పేం చేసిందీ అనుకోవద్దు. కియారా ఏ తప్పూ చేయలేదు. మరి గిల్ట్ ఎందుకు అంటే 'గిల్టీ' పేరుతో నెట్‌ఫ్లిక్స్ కోసం ఆమె ఓ సినిమా చేయబోతున్నారు. ఆల్రెడీ 'లస్ట్ స్టోరీస్'తో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో బోలెడంత క్రేజ్ తెచ్చుకున్నారు కియారా. అందులో చాలా బోల్డ్‌గా నటించారు. మరి.. 'గిల్టీ'లో ఎలాంటి పాత్రలో కనిపిస్తారో చూడాలి. రుచి నరైన్ దర్శకత్వం వహిస్తారు. కరణ్ జోహార్, అపూర్వ మెహతా నిర్మించనున్నారు. ఈ సినిమాకి సంబంధించిన కియారా లుక్‌ను మంగళవారం విడుదల చేశారు. ఇది సరే కానీ కియారా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై మొగ్గు చూపుతున్నారు.. చేతిలో సినిమాలు లేవా? అంటే... అదేం కాదు. ప్రస్తుతం లక్ష్మీబాంబ్, షేర్షా అనే హిందీ చిత్రాల్లో నటిస్తున్నారు కియారా. ఇటు సౌత్‌లోనూ సినిమాలు చేయడానికి సంప్రదింపులు జరుపుతున్నారు.

సిరెంజి చూస్తేనే భయం

'మా' టీవీలో ప్రసారమవుతున్న 'కార్తీకదీపం' సీరియల్‌లో డాక్టర్ మోనికగా తెలుగు ప్రేక్షకులకు ఆమె పరిచయమే. అసలు పేరు శోభాశెట్టి. 'ముందు నెగిటివ్ రోల్ అని డిజప్పాయింట్ అయ్యాను, కానీ ఇదే ఇప్పుడు నాకు ఎంతోమంది అభిమానులను తెచ్చిపెట్టిం'ద'ంటూ మురిపెంగా చెప్పుకొచ్చింది శోభ.

సీరియల్

● సీరియల్ నటి ఎప్పుడు అనిపించుకున్నారు?

ఇండస్ట్రీలోకి వచ్చి దాదాపు ఎనిమిదేళ్లు అయ్యింది. తెలుగువారికి పరిచయమై మూడేళ్లు అవుతోంది. నేను కన్నడ నటిని. మాది బెంగుళూరు. చదువుకునేప్పటినుంచే నటన అంటే పిచ్చి ఇష్టముండేది. కాలేజీ రోజుల్లోనే ఫేస్‌బుక్ ద్వారా నా ప్రొఫైల్, ఫొటోస్ టీవీ వారికి చేరవయ్యాయి. అలా, నటినయ్యాను. తెలుగులో కార్తీకదీపం సీరియల్‌కు ముందు అష్టాచెమ్మాలో నటించాను.

● నెగిటివ్ రోల్ తెలిసే ఒప్పుకున్నారు..?

అవును, ముందు వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలనుకున్నా. అప్పటికే సీరియల్ థీమ్ గురించి తెలుసు. హీరోయిన్‌కి పోటాపోటీగా ఉంటుంది నా క్యారెక్టర్. పాజిటివ్ రోల్ చేస్తే మంచి పేరొస్తుంది. అయితే, ఇలాంటి నెగిటివ్ రోల్స్ వల్ల మన వర్త్ ఏంటో తెలుస్తుంది.

● ఫ్యామిలీ గురించి..?

అమ్మానాన్న, అన్నయ్య, అక్క, నేను. మా ఫ్యామిలీ ఒకానొకసమయంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంది. ఆస్తులన్నీ దూరమైన పరిస్థితి. ఐదారేళ్లపాటు ఆ స్థితి నుంచి ఇప్పుడు అన్ని విధాలా నిలదొక్కుకున్నాం. నా సక్సెస్‌లో మా అమ్మ సపోర్ట్ ఉండటంలో ఈ రోజు ఇంత బాగా నటనలో రాణించగలుగుతున్నాను. ముందు నాన్నకు నేను యాక్టింగ్‌లోకి రావడం అంతగా ఇష్టం లేదు. కానీ, ఇప్పుడు నాన్ననే అప్పుడప్పుడు సెట్స్‌కు వస్తుంటారు.

● డాక్టర్ మోనిక..?

నాకు ఇంజినీరింగ్ చేయాలని ఉండేది. డాక్టర్ ఆలోచన మాత్రం ఎప్పుడూ లేదు. ఎందుకంటే (నవ్వుతూ) నిజానికి నాకు చిన్నప్పటి నుంచి ఇంజక్షన్ అంటేనే భయం. నీడిల్‌ను కూడా చూడలేను. అలాంటిది డాక్టర్ పాత్ర. మా ప్రొడ్యూసర్ అయితే.. 'ఇన్ని ఎపిసోడ్స్ అయ్యాయి. కనీసం బి.పి కూడా చెక్ చేయడం రాదు, స్టెతస్కోప్ ఎలా పట్టుకోవాలో తెలియదు, నువ్వేం డాక్టరమ్మా!' అని నవ్వుతుంటారు. ఈ సీరియల్ పూర్తయ్యేసరికి బి.పి చెక్ చేయడం ఎలాగో తెలుసుకుంటాను. ఇక క్యారెక్టర్ గురించి అయితే డాక్టర్‌ని. కార్తీక్‌ని విపరీతంగా ఇష్టపడుతుంది. ఏం చేసయినా కార్తీక్‌ను తన సొంతం చేసుకోవాలనుకుంటుంది. దీప నుంచి విడదీయాలనుకుంటుంది.

● రియల్ లైఫ్‌లో పార్టనర్?

డాక్టరే కావాలని అనుకోవడం లేదు. నాలాగ యాక్టరైతే నేనున్న సిచ్యుయేషన్స్ బాగా అర్థమవుతాయి. మా అమ్మలా నాకు సపోర్ట్‌నిచ్చే వ్యక్తి, నన్ను ప్రేమించేవాడు కావాలని కోరుకుంటున్నాను. పెళ్లికి మాత్రం మరోమూడేళ్ల సమయం ఉంది.

● ఖాళీ దొరికితే..?

(నవ్వుతూ) పుస్తకాలు చదువుతా, మ్యూజిక్ వింటా... అంటూ అలాంటి హాబీస్ లేవు. హాయిగా నిద్రపోతాను. రైస్-రసం నా ఫేవరెట్ డిష్. మూడుపూటలా ఇదే పెట్టినా సుష్టుగా తింటాను. లావు అవుతున్నాను అనుకుంటే ఈ డిష్‌నే కొద్దిగా తగ్గించే వెసులుబాటు చేసుకుంటాను.

● కాస్ట్యూమ్స్ ఎంపిక?

నాకేం కావాలో, నేనెలా ఉంటే బాగుంటానో నూటికి నూరుపాళ్లు అమ్మే చూసుకుంటుంది. ఎప్పుడైనా షాపింగ్, సెలక్షన్‌లో నేనుంటాను. కానీ, అమ్మ మాటే ఫైనల్. ఎందుకంటే నేనెలా ఉంటే బాగుంటానో అమ్మకు బాగా తెలుసు. అందుకే అమ్మ చెబితే అంతే!

● తెలుగుప్రేక్షకులు..?

నా ప్రాణం. ఎంతలా అయిపోయారంటే.. సీరియల్ వస్తున్నప్పుడు టీవీ స్క్రీన్‌లో నేనున్న సీన్ ఫొటో తీసి ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లలో పోసట్ చేస్తారు. చాలా బాగా నటించారంటూ మెచ్చుకుంటారు. ఇంతకుమించి ఓ నటిగా ఇంకా ఎవరైనా ఏం కోరుకుంటారు. ఐ లవ్ తెలుగు ఆడియన్స్.

– నిర్మలారెడ్డి

గ్రేట్ ఇండియన్ సీరియల్స్-22

●భారత్ ఏక్ ఖోజ్

నెహ్రూ చూపిన భారత్

చరిత్ర తెలియనివాడు వర్తమానాన్ని గ్రహించలేడు, భవిష్యత్‌ను దర్శించలేడు. భారతదేశం వేల ఏళ్లుగా ఘన వారసత్వాన్ని, సంస్కృతిని, నాగరకతల సంగమాన్ని, భిన్న జీవన గతులను కలిగి ఉంది. వీటిని అర్థం చేసుకోకపోతే ఈ దేశం, ఈ దేశ ప్రజలు, మన పొరుగువారు, వారి ఆలోచనలు ఏవీ అర్థం కావు. నెహ్రూ తన డిస్కవరీ ఆఫ్ ఇండియా గ్రంథం ద్వారా దేశాన్ని ఎలా చూడాలో కళ్లకు కట్టారు. భారత్ ఏక్ ఖోజ్ సీరియల్ ఆ గ్రంథానికి ఉత్తమ దృశ్యరూపాన్ని ఇచ్చింది.

నిన్ను నువ్వు అర్థం చేసుకోవాలంటే నీ కుటుంబ చరిత్రను తెలుసుకోవాలి. అర్థం చేసుకోవాలి. నిన్ను నువ్వు సరికొత్తగా నిర్మించుకోవాలంటే దేశ చరిత్రను సమగ్రంగా ఔపోసన పట్టాలి. ఐదు వేల ఏళ్ల భారతదేశ చరిత్రను తెలుసుకోవాలంటే మాత్రం 'భారత్ ఏక్ ఖోజ్' సీరియల్‌ను చూడాలి. 1988లో దూరదర్శన్‌లో ఏడాదిపాటు ప్రసారమైన ఈ సీరియల్ తనను తాను సరికొత్తగా ఆవిష్కరించుకుంది. దేశ స్వాతంత్ర్యం నాటి పరిస్థితుల నుంచి వెనక్కి వెళ్లి ఐదు వేల ఏళ్ల క్రితం నాటి ముచ్చట్లన్నీ మొత్తం 53 ఎపిసోడ్లలో ప్రతి భారతీయుడి కళ్లకు కట్టింది ఈ సీరియల్.

మన దేశంలో వివిధ కాలాలలో చారిత్రక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలలో వచ్చిన మార్పులు సామాన్యమైనవి కావు. నాగరికతవైపు పరుగులు తీసే క్రమంలో వచ్చే పెను మార్పుల గురించి ఒక్కమాటలో చెప్పలేం. ప్రపంచంలో ఎక్కడా లేనన్ని భిన్నసంస్కృతులు, భిన్న మతాలు, బహుళజాతి సంఘాలు, నాగరికతలో వచ్చిన ఎన్నో మార్పులు మన దేశంలో ఉన్నాయి. వాటన్నింటినీ ఈ సీరియల్‌లో వీక్షించారు నాటి ప్రేక్షకులు. కొన్నిసార్లు సాంకేతికపరమైన డాక్యుమెంటరీ, మరి కొన్నిసార్లు పూర్తిడ్రామా.. ఈ ఎపిసోడ్స్‌లో ప్రేక్షకులను అబ్బురపరిచాయి. రామాయణ్, మహాభారత్‌ల తర్వాత మళ్లీ అంతటి ఖ్యాతిని తన ఖాతాలో వేసుకుంది భారత్ ఏక్‌ఖోజ్ సీరియల్‌తో దూరదర్శన్.



శ్యామ్‌బెనగల్

ఇండియన్ గ్రేట్ డైరెక్టర్, స్క్రీన్‌రైటర్ శ్యామ్ గురించి చెప్పాలంటే సినిమానే ఆయన, ఆయనే సినిమా. ఎన్నో అవార్డులు ఆయన సినిమాకు సాహో అన్నాయి. 'కులం-మతం ఈ రోజుల్లోనూ ఉన్నాయి. అయితే ఇవి భారతీయులుగా ఉండకుండా నిరోధించలేవు. ఈ సీరియల్ ద్వారా వాటివల్ల వచ్చే కారణాలను మాత్రమే విశ్లేషించాం' అని తెలిపారు. 1986లో ఈ సీరియల్ స్క్రిప్ట్ మొత్తం సిద్ధం చేసుకున్నాం. 1988లో నవంబర్ 14న నెహ్రూ పుట్టిన రోజున ఫస్ట్ ఎపిసోడ్ ప్రసారమవ్వాలన్నది ప్లాన్. ఎపిసోడ్ నిడివి ఒకటి 60 నిమిషాలు వస్తే మరికొన్ని 80, 90 నిమిషాలు కూడా వచ్చాయి. కానీ మాకున్న సమయం అరగంట మాత్రమే. అందుకే చాలా కుదించాల్సి వచ్చింది' అని తెలిపారు ఈ సీరియల్ గురించిన ఓ ప్రస్తావనలో శ్యామ్ బెనగల్.

నెహ్రూ చెప్పిన కథ

'భారత్ ఏక్ ఖోజ్ సీరియల్' పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పుస్తకం 'ది డిస్కవరీ ఆఫ ఇండియా' ఆధారంగా రూపొందించబడింది. ఈ ఎపిసోడ్స్‌ను నటుడు రోషన్ సేత్ జవహర్‌లాల్ నెహ్రూ పాత్ర పోషించారు. జవహర్‌లాల్ నెహ్రూ కథ చెబుతున్నట్టుగా ఎపిసోడ్స్ రన్ అవుతుంటాయి. ఈ సీరియల్ దర్శక, నిర్మాత శ్యామ్ బెనగల్ చేసిన అద్భుతమైన ఆలోచనకు ప్రతిరూపం భారత్ ఏక్‌ఖోజ్. ప్రతి ఆదివారం ఉదయం 11గంటలకు ఏడాది పాటు ప్రసారమైంది. 1947 నుంచి ఐదువేల ఏళ్ల వెనక్కి ప్రయాణించి మన మూలాల్ని మనకు పరిచయం చేస్తుంది ఈ సీరియల్. దర్శకనిర్మాత శ్యామ్‌బెనగల్ ఈ సీరియల్‌ని తీర్చిదిద్దితే, దీనిలో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచారు ఓమ్‌పురి.



రోషన్ సేత్

ఇండియన్ యాక్టర్. భారత్ ఏక్ ఖోజ్‌లో జవహర్‌లాల్ నెహ్రూ పాత్ర పోషించారు. తనే కథ చెబుతున్నట్టు చరిత్రలోకి సేత్‌తో కలిసి మనమూ ప్రయాణిస్తాం. ఈ పోని ఆసక్తికరంగా మన అటెన్షన్‌ను తన వైపు తిప్పుకునేలా చేయడంలో కృతకృత్యమయ్యాయి రోషన్‌సేత్ ఆహార్యం, మాటలు.

తరతరాలు కదిలి

ఈ సీరియల్ భారతీయ చరిత్రను అద్భుతంగా విశ్లేషించింది. భారతీయ సంస్కృతి, మూఢనమ్మకాలు, పురాణాలు, కావ్యాలు, నాటకాలు, సంగీతం, సినీ సాంకేతిక పరిజ్ఞానం.. ఇలా దశలవారీగా జరిగిన పురోగతిని పరిచయం చేసింది భారత్ ఏక్ ఖోజ్. మరో ఇరవై సంవత్సరాల తర్వాత కూడ సీరియల్ ప్రస్తావన వస్తే భారత్ ఏక్ ఖోజ్ సీరియల్ ద్వారా మొత్తం తరాలన్నీ కదిలివచ్చాయని, ఇది చారిత్రక దృక్పథాన్ని మెరుగుపరచడమే గాక, మన అద్భుతమైన గతం గురించి లోతైన అవగాహన కలిగి ఉండేలా ప్రేక్షకుడిని ప్రేరేపించిందని తెలుస్తుంది.

ఎలక్షన్ క్యాంపెయిన్

నెహ్రూ చదువు నిమిత్తం పాశ్చాత్యదేశాలకు వెళ్లడం, అక్కడి స్నేహపూరితమైన వాతావరణం ఈ సీరియల్‌లో చూస్తాం. అలాగే 1936-37లలో జరిగిన ఎలక్షన్ క్యాంపెయిన్‌కి ఈ సీరియల్‌లో చాలా ప్రాముఖ్యత ఉంటుంది. నెహ్రూ భారతదేశం అంతటా విస్తృతంగా పర్యటించారు. పట్టణాలు, నగరాలు, గ్రామాలలోనూ తన పర్యటన కొనసాగించారు. దీనిలో భాగంగా ఆయన ఒక గొప్ప ఆవిష్కరణకు పునాది వేసుకున్నారు. ఈ పర్యటన వల్ల ఆయనకు దేశంపై ప్రేమ పెరగడం ప్రారంభించింది. 1944లో అహ్మద్ నగర్ ఫోర్ట్ జైలులో ఉన్నప్పుడు ఏకాంతంగా కొన్ని నెలల పాటు కూర్చుని, భారతదేశపు సరికొత్త ఆవిష్కరణపై సొంత ప్రయాణాన్ని నమోదు చేసుకున్నారు నెహ్రూ. ఆ ఘట్టాన్ని ఇందులో చూడచ్చు.

ఈ సీరియల్‌లో..

భారతమాతాకి జై, ది బిగినింగ్స్, ది వేదిక్ పీపుల్ అండ్ ది రిగ్వేద, క్యాస్ట్ ఫార్మేషన్, మహాభారత్, రామాయణ, రిపబ్లిక్స్ అండ్ కింగ్‌డమ్స్, చాణక్య అండ్ చంద్రగుప్త, అశోక, కాళిదాస, అక్బర్, ఔరంగజేబు, టిప్పుసుల్తాన్, 1857 నాటి పరిస్థితులు, మహాత్మా పూలే, వివేకానంద, గాంధీ, దేశవిభజన, డూ ఆర్ డై... వంటి 53 ఎపిసోడ్లలో నాటి చారిత్రక ఘట్టాలను బుల్లితెరపై వీక్షించి పరవశులయ్యారు ప్రేక్షకులు.

– ఎన్.ఆర్

ఓమ్‌పురి

ఇండియన్ యాక్టర్‌గా దేశమంతటా ఓమ్ సుపరిచితమే. అమెరికా, బ్రిటన్, పాకిస్థాన్‌లో తన నటనా పటిమను ప్రదర్శించారు ఓమ్‌పురి. పద్మశ్రీ అవార్డు గ్రహీత. వెండితెర, బుల్లితెర మీద ఓ వెలుగు వెలిగిన నటుడు.

జనరల్ కౌన్సెలింగ్స్

ఫ్యామిలీ డాక్టర్



నీరసం, ఆకలి, అతిగా మూత్రవిసర్జన... ఎందుకు?

నా వయసు 37 ఏళ్లు. ఈమధ్య తరచూ ఎక్కువసార్లు మూత్రవిసర్జనకు వెళ్లాల్సి వస్తోంది. విపరీతంగా దాహం వేస్తోంది. ఆకలి చాలా ఎక్కువగా ఉంది. ఎంత తిన్నా నీరసంగానే ఉంటోంది. తరచూ ప్రైవేట్ పార్ట్స్ వద్ద ఇన్ఫెక్షన్స్ వస్తున్నాయి. నేను చేస్తున్న పనిలో తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది. ఈ లక్షణాలు చెబుతుంటే... నాకు షుగర్ వచ్చిందేమోనని నా ఫ్రెండ్స్ అంటున్నారు. నాకు ఇలా ఎందుకు జరుగుతోంది? దయచేసి వివరంగా చెప్పండి.

- ఎమ్. ఆనంద్, ఖమ్మం

ఉద్యోగరీత్యా మీరు ఒత్తిడికి గురవుతున్నట్లు చెప్పారు. ఇలా ఎక్కువ ఒత్తిడికి గురికావడం, శారీరక శ్రమ లేకపోవడం వంటివి డయాబెటిస్‌ను మరింత త్వరగా వచ్చేలా చేస్తాయి. మీరు చెబుతున్న లక్షణాలన్నీ డయాబెటిస్ లక్షణాలనే పోలి ఉన్నాయి. డయాబెటిస్ వల్ల రోగనిరోధక శక్తి తగ్గి, కొన్ని సందర్భాల్లో మీరు చెబుతున్నట్లుగానే ప్రైవేట్ పార్ట్స్‌లో ఇన్ఫెక్షన్స్ రావచ్చు. కాబట్టి ఒకసారి మీరు షుగర్‌కు సంబంధించిన పరీక్షలు చేయించుకోవడం మంచిది. ఫాస్టింగ్, పోస్ట్ లంచ్ షుగర్ పరీక్షలు, ఓరల్ గ్లూకోజ్ టాలరెన్స్ టెస్ట్, హెచ్‌బీ1ఏసీ వంటి పరీక్షలతో డయాబెటిస్‌ను నిర్ధారణ చేయవచ్చు.

వీలైనంత త్వరగా మీరు దగ్గర్లోని ఫిజీషియన్‌ను సంప్రదించి, వారి సూచనలను అనుసరించండి.

తరచూ నోరు పొక్కుతోంది.. ఎందుకిలా?

నా వయసు 45 ఏళ్లు. ఇటీవల తరచూ నాకు నోట్లో పొక్కులు వస్తున్నాయి. నోరు పూసినట్లుగా అవుతోంది. దాదాపు ప్రతి రెండు నెలలకోసారి ఇలా అవుతోంది. డాక్టర్‌ను కలిస్తే ప్రమాదం ఏమీ లేదని విటమిన్ మాత్రలు ఇచ్చారు. తరచు అవే మందులు వాడుతున్నాను. అయినా మాటిమాటికీ సమస్య తిరగబడుతూనే ఉంది. నోట్లో పొక్కులు తగ్గడానికి ఏం చేయాలో చెప్పండి.

- ఎమ్. రాజేశ్వర్‌రెడ్డి, నిజామాబాద్

మాటిమాటికీ నోటిలో పొక్కులు వస్తున్నాయంటే చాలా సందర్భాల్లో మానసిక ఒత్తిడి వల్ల కావచ్చు. అది నోట్లో మచ్చలుగానీ, ఫ్లాక్‌లా వస్తే అది ఓరల్ క్యాండిడియాసిస్ కావచ్చు. కొన్నిసార్లు విటమిన్లు, ఖనిజాల లోపం కూడా కావచ్చు. అయితే ఈ నోటిలోని పొక్కులు మళ్లీ మళ్లీ వస్తూనే ఉన్నాయి కాబట్టి మీరు ఒకసారి ఫిజీషియన్‌ను సంప్రదించండి. ఇదే సమయంలో మీకు ఉన్న ఇతర సమస్యలు అంటే... శారీరక వ్యవస్థలకు సంబంధించినవి – కీళ్లనొప్పులు, వ్యాధి నిరోధక శక్తికి సంబంధించిన సమస్యలు ఉన్నాయా అని నిర్ధారణ చేయడానికి తగిన పరీక్షలను సూచిస్తారు.



మందులతో ఎత్తు పెంచుకోవడం సాధ్యమేనా?

నా వయసు 17 ఏళ్లు. నా ఎత్తు ఐదు అడుగుల రెండు అంగుళాలు. నా తోటి పిల్లలతో పోలిస్తే... నేను అంత ఎత్తుగా లేను. నాకు కాస్తంత దిగులుగా ఉంది. మందులతో ఎత్తు పెరగవచ్చనే ప్రకటనలు చూసినప్పుడు... వాటిని తెప్పించుకోవాలని అనిపిస్తోంది. మందులతో నిజంగానే ఎత్తు పెరుగుతారా?

- డి. సోమేశ్, సిద్ధిపేట

మందులతో ఎత్తు పెరుగవచ్చనే విషయంలో ఏమాత్రం నిజం లేదు. అవి ఎలాంటి మందులైనా కావచ్చుగాక... వాటితో ఎత్తు పెంచడం సాధ్యం కాదు. ఏ వ్యక్తి ఎంత ఎత్తు పెరగాలన్న అంశం జన్యుపరంగా ముందుగానే నిర్ణయమైపోతుంది.

సాధారణంగా తల్లిదండ్రులు ఎత్తుగా ఉంటే పిల్లలూ ఎత్తుగా ఉంటారు. ఎత్తు పెంచడానికీ లేదా తగ్గించడానికి మందులేమీ ఉండవు. పిల్లల పెరుగుదలలో రెండు దశలుంటాయి. వాటిని లాగ్ ఫేజ్ అనీ, ల్యాగ్ ఫేజ్ అంటారు. ఇందులో లాగ్ ఫేజ్‌లో పిల్లలు చటాలున అకస్మాత్తుగా ఎత్తుగా అవుతారు. ఆ తర్వాత ల్యాగ్ ఫేజ్‌లో ఆ పెరుగుదల కాస్తంత మందకొడిగా సాగుతూ మహా అయితే ఒకటి లేదా రెండు అంగుళాలు పెరిగి ఆ తర్వాత ఆగిపోతారు. అందుకే యుక్తవయస్సులోకి అడుగుపెట్టిన పిల్లలను చాలాకాలం చూడని వారు అకస్మాత్తుగా చూస్తే వాళ్లు బాగా పొడవైనట్లుగా అనిపిస్తుంది. దానికి కారణం ఈ లాగ్ ఫేజ్ అనే దశ. ఇది 14 నుంచి 17 వరకు ఉంటుంది. ఇక మందకొడిగా సాగే ల్యాగ్ ఫేజ్‌లు సాధారణంగా 18-21 ఏళ్ల వరకు కొనసాగవచ్చు. అంటే... ఎవరిలోనైనా ఎత్తు పెరగడం అన్న ప్రక్రియ సాధారణంగా 21 ఏళ్లు వచ్చేసరికి పెరిగే ఎముక చివర ఫ్యూజ్ అయిపోయి పెరుగుదల ఆగిపోతుంది. కాబట్టి ఆ తర్వాత ఎలాంటి మందులు వాడినా అది ప్రయోజనం ఇవ్వదు. అయినప్పటికీ మీరు 17 ఏళ్ల వయసులో ఐదడుగుల రెండు అంగుళాలు ఉన్నారు కాబట్టి అన్ని రకాల పోషకాలు ఉన్న మంచి ఆహారం తీసుకుంటూ, వ్యాయామం చేయండి. ముఖ్యంగా స్ట్రెచ్చింగ్ వ్యాయామాలు చేయండి. మీ ల్యాగ్ ఫేజ్‌కు ఇంకా సమయం ఉంది కాబట్టి నిరాశ పడవద్దు. మందులతో ఎత్తు పెరగడం సాధ్యం కాదన్న విషయాన్ని గ్రహించి... పేపర్లలో, టీవీల్లో వచ్చే మోసపు ప్రకటనల నుంచి జాగ్రత్తగా ఉండాలి. ఇక మీరు గ్రహించాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే.. ఒక వ్యక్తి ఎత్తుకూ వ్యక్తిగత సామర్థ్యాలకూ ఎలాంటి సంబంధం లేదు. మీరు ఇప్పటికే ఐదడుగుల రెండంగుళాలు ఉన్నారు కాబట్టి ఎత్తు పెరగడం అన్న అంశాన్ని అంత సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదు.

డా.ఎమ్. గోవర్ధన్, సీనియర్ కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్, కేర్ హాస్పిటల్స్, నాంపల్లి, హైదరాబాద్

పరి పరిశోధన

టేబులే.. స్మార్ట్‌ఫోన్ ఛార్జర్!

పగలు ఆఫీసులో.. రాత్రి ఇంట్లో.. మన మొబైల్ ఫోన్లు విశ్రాంతి తీసుకునే స్థలమేది? ఇంకేముంది.. టేబుల్ లేదా ఛార్జర్!. మరి... ఈ రెండు ఒక్కటైపోతే ఎలాగుంటుంది? ఆశ్చర్యంగా అనిపిస్తుంది కదూ. వివరాలు చూద్దాం. స్పెయిన్‌కు చెందిన కంపెనీ ప్రొటాన్ న్యూ ఎనర్జీ ఓ కొత్త టేబుల్‌ను సిద్ధం చేసింది. దీనిపై ఉంచిన మొబైల్ ఫోన్‌కు విద్యుత్తును అందించడం ఈబోర్డ్‌గా పిలుస్తున్న ఈ టేబుల్ ప్రత్యేకత. ఇళ్లలో లేదా ఆఫీసుల్లో వాడే దీపాల వెలుగుతోనే విద్యుత్తును ఉత్పత్తి చేసేలా ఈబోర్డుపై ప్రత్యేకమైన సోలార్‌ప్యానెల్స్ ఉంటాయి. ఒకవేళ సూర్యరశ్మి అందుబాటులో ఉంటే దాంతోనూ విద్యుదుత్పత్తి చేస్తుంది. మొత్తం 50 వరకూ ఛార్జింగ్ కాయిల్స్ కూడా ఏర్పాటు చేసిన ఈ టేబుల్‌పై ఎక్కడ ఫోన్ ఉంచినా ఛార్జింగ్ అవుతుంది. ఏకకాలంలో నాలుగు స్మార్ట్‌ఫోన్స్‌ను ఛార్జ్ చేసుకోవచ్చు. కీ ఛార్జింగ్ ప్లాట్‌ఫార్మ్‌ను వాడుకుంటున్నందున ఈ టేబుల్ ద్వారా ఐఫోన్, శాంసంగ్ గెలాక్సీ, గూగుల్ పిక్సెల్ 3, 3ఎక్స్ ఎల్‌లతోపాటు సోని, నోకియా, ఎల్‌జీ వంటి ఫోన్లను స్మార్ట్‌వాచ్, ట్యాబ్లెట్లను ఛార్జ్ చేసుకోవచ్చు. మీ స్మార్ట్‌ఫోన్ కీ ఛార్జింగ్ ప్లాట్‌ఫార్మ్‌ను వాడకపోతే అడాప్టర్లను వాడాల్సి ఉంటుంది. ఈ వినూత్న టేబుల్‌పై తాము సముద్ర బ్యాక్టీరియా తాలూకూ ప్రొటీన్‌తో తయారైన త్వచాన్ని వాడామని.. ఫలితంగా తక్కువ కాంతిలోనూ విద్యుత్తును ఉత్పత్తి చేయడం వీలవుతుందని కంపెనీ చెబుతోంది.

దీపాలతో 250 ఎంబీపీఎస్ ఇంటర్నెట్!

లైట్లతోనే వైఫై! ఇది పాత విషయమే కావచ్చు గానీ.. ఏకంగా 250 ఎంబీపీఎస్ వేగంతో ఇంటర్నెట్ అందుబాటులోకి వస్తుందంటే మాత్రం విశేషమే. ఫిలిప్స్ లైటింగ్ కంపెనీ (ఇప్పుడు సిగ్నిఫై అని పిలుస్తున్నారు) మార్కెట్‌లోకి ప్రవేశపెట్టిన ట్రూలైఫై లైట్లతో ఇది సాధ్యమే. సాధారణంగా ఇంటర్నెట్ సమాచారం మొత్తం రేడియో తరంగాల రూపంలో మనకు అందుతూంటే.. ట్రూలైఫైలో మాత్రం కాంతి తరంగాలు ఉపయోగపడతాయి. కొన్నేళ్లుగా ఈ టెక్నాలజీ అందుబాటులో ఉన్నప్పటికీ అంతగా ప్రాచుర్యం పొందలేదు. ఈ నేపథ్యంలో సిగ్నిఫై ట్రూలైఫైను అందుబాటులోకి తెచ్చింది. రేడియో తరంగాల వాడకం నిషిద్ధమైన ఆసుపత్రులు, పారిశ్రామిక ప్రాంతాల్లోనూ దీన్ని వాడుకోవచ్చు. వైఫై నెట్‌వర్క్‌పై ఉన్న భారాన్ని తగ్గించడంతోపాటు నెట్ వేగాన్ని గణనీయంగా పెంచేందుకు ట్రూలైఫైలో ప్రత్యేకమైన ఆప్టికల్ ట్రాన్స్‌సీవర్‌ను ఏర్పాటు చేశారు. అప్‌లోడింగ్ డౌన్‌లోడింగ్ రెండింటికీ 150 ఎంబీపీఎస్ వేగానిన ఇవ్వడం దీనికున్న ఇంకో ప్రత్యేకత. ఒక పాయింట్ నుంచి ఇంకో పాయింట్‌కు మాత్రమే సమాచార ప్రసారం జరగాలనుకున్నప్పుడు వేగం 250 ఎంబీపీఎస్ వరకూ ఉంటుంది. ఏఈఎస్ 128 బిట్ ఎన్‌క్రిప్షన్ వాడటం వల్ల సమాచారం భద్రంగా ఉంటుందని కంపెనీ చెబుతోంది. లైట్ వెలుగును తగ్గించినా, లేదా ఆఫ్ చేసినా లైఫై మాత్రం పనిచేస్తూనే ఉంటుందని కంపెనీ చెబుతోంది. లైఫైతో పనిచేసే ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు అందుబాటులోకి వచ్చేంతవరకూ ఒక యూఎస్‌బీని వాడటం ద్వారా లైఫైను వాడుకోవచ్చునని సిగ్నిఫై తెలిపింది.

సాక్షి భవిత

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

స్పర్ధయా వర్ధతే విద్య

బుధవారం
26-6-2019

ఐటీ రంగం... యువతకు కొలువుల స్వప్న సౌధం! ఒక్కసారి ఇందులో కొలువుదీరితే.. భవిష్యత్తు బంగారమే అనే భావన! అందుకే సాఫ్ట్‌వేర్ జాబ్ కోసం ఎందాకైనా అంటుంది యువత.. ఎక్కడ అవకాశమొచ్చినా వెంటనే చేరిపోతున్న సంగతి తెలిసిందే! కానీ, ఇలా చేరుతున్న ప్రతి ముగ్గురిలో ఒకరు ఆరునెలలు తిరక్కుండానే పక్క చూపులు చూస్తుండటం కంపెనీలను కలవరపాటుకు గురిస్తోంది. కెరీర్ ఉన్నతి కోసం, అధిక వేతనంతో ఆకర్షణీయ ఆఫర్లు, వ్యక్తిగత కారణాలతో.. నిత్యం కంపెనీలు మారుతున్న వారే ఎక్కువ!! మరోవైపు నైపుణ్యవంతులను ఆపడం సవాలుగా మారుతోందని సాఫ్ట్‌వేర్ కంపెనీలు వాపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఐటీ రంగంలో ఉద్యోగాలు, వలసలు.. సంస్థలు చేపడుతున్న నివారణోపాయాలు..

ఐటీలో వలసలు..!

ఒకవైపు ఐటీ రంగంలో కొలువు సాధించడం కష్టంగా మారిందనే వార్తలు. ప్రస్తుత పరిస్థితుల్లో ఐటీ కొలువు దక్కించుకోవాలంటే.. ఎంతో నైపుణ్యం ఉండాలనే అభిప్రాయాలు! మరోవైపు.. వలసల సమస్య ఐటీ రంగ సంస్థలను వేధిస్తోంది. ముఖ్యంగా యువ ఉద్యోగులు, మిలీనియల్స్.. తరచూ కంపెనీ మారుతున్నారు. ఆకర్షణీయ ఆఫర్లు వస్తే మరో సంస్థలో చేరిపోతున్నారు. ఐటీ రంగంలో దాదాపు 26 శాతం వరకూ వలసలు(ఎంప్లాయి అట్రిషన్ రేట్) నమోదవుతున్నట్లు అంచనా. దాంతో నిపుణులైన యువ ఉద్యోగులు వలసల బాట పట్టకుండా నివారించేందుకు సంస్థలు చర్యలు చేపడుతున్నాయి.

వలసలకు కారణాలనేకం!

వాస్తవానికి ఐటీ రంగంలో కొలువు అంటే యువత రెక్కలు కట్టుకుంటుంది. అలాంటి యువతలో వలసల దృక్పథం ఎందుకు పెరుగుతోంది? స్థిరంగా ఒకచోట ఎక్కువకాలం ఎందుకు పనిచేయలేకపోతున్నారు? అని ప్రశ్నిస్తే.. అందుకు పలు కారణాలు కనిపిస్తున్నాయి. వీటిలో ముఖ్యంగా కెరీర్ ఉన్నతి, అధిక వేతన ఆఫర్లు,వ్యక్తిగత కారణాలతో యువ ఉద్యోగులు కంపెనీలు మారుతున్నారన్నది నిపుణుల విశ్లేషణ.పోటీ ప్రపంచంలో ప్రతిభావంతులను ఆకర్షించేందుకు పోటీ కంపెనీలు రక రకాల ప్రయత్నాలు చేస్తున్నాయి. భారీ జీతాలు, పదోన్నతులను ఆఫర్ చేస్తూ నైపుణ్యవంతులను ఎగరేసుకుపోతున్న పరిస్థితి నెలకొంది. ఇవేకాకుండా లోతుగా పరిశీలిస్తే.. సంస్థ అంతర్గత పని వాతావరణం మొదలు, పనిలో సంతృప్తి లేకపోవడం, పనికి సరైన గుర్తింపులేక పోవడం వంటి ఇతర ఎన్నో అంశాలు ఇమిడి ఉన్నాయనేది ఇండస్ట్రీ వర్గాల అభిప్రాయం. ఇటీవల కాలంలో పలు సర్వేలు సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

నో 'లెర్నింగ్'.. నో ఇన్నోవేషన్

- యువ ఉద్యోగులు సంస్థను వీడటానికి సదరు సంస్థలో కొత్త నైపుణ్యాలు నేర్చుకునే అవకాశం లేకపోవడం కూడా కారణమే అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నేర్చుకునేందుకు కంపెనీలో అవకాశం లేకపోవడం వల్ల తాము లేటెస్ట్ టెక్నాలజీతోపాటు,ఇండస్ట్రీ డిమాండ్‌కు అనుగుణంగా సరికొత్త నైపుణ్యాలు సొంతం చేసుకోలేకపోతున్నామనేది యువ ఉద్యోగులు చెబుతున్న మాట.
- సాఫ్ట్‌వేర్ రంగంలో వలసలకు మరో కారణం.. 'ఇన్నోవేషన్'కు అవకాశం లేకపోవడమేనని పలువురు ఉద్యోగులు పేర్కొంటున్నారు. సంస్థలో తమ సృజనాత్మకతకు పదును పెట్టేలా ఇన్నోవేటివ్ ప్రాజెక్ట్స్‌లో పనిచేసే వీలు కల్పించాలని యువ ఉద్యోగులు కోరుతున్నారు. ఫలితంగా తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం లభిస్తుందనే అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తున్నారు. వీటితోపాటు ఉన్నత ఉద్యోగుల వైఖరి కూడా యువ ఉద్యోగులు సంస్థను వీడటానికి మరో కారణంగా నిలుస్తోంది.

'ఆఫ్‌సైట్' వర్క్ కల్చర్

ప్రస్తుతం మిలీనియల్స్ ఆఫీసులో కూర్చుని పని చేయడానికంటే.. ఎక్కడి నుంచైనా విధులు నిర్వహించే విధానమైన 'ఆఫ్‌సైట్' వర్కింగ్‌పై ఎక్కువ మక్కువ చూపుతున్నారు. వాస్తవానికి ఐటీ సంస్థల్లో ఈ విధానం ఎప్పటి నుంచో అమలవుతోంది. కానీ, ఇటీవల కాలంలో కొత్త టెక్నాలజీల ఆధారంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న తరుణంలో నిత్యం ప్రాజెక్ట్ హెడ్, మేనేజర్ల పర్యవేక్షణలో ఆఫీసులోనే ఉండి పనిచేయాల్సి వస్తోంది. దీనిపై యువ ఉద్యోగుల్లో విముఖత వ్యక్తమవుతోంది. పనివేళల విషయంలోనూ ఉద్యోగుల్లో ప్రతికూలత కనిపిస్తోంది. నిర్దిష్ట పని వేళల కంటే ఫ్లెక్సిబుల్ వర్కింగ్ అవర్స్‌కు అవకాశం కల్పిస్తే బాగుంటుందంటున్నారు.

స్వేచ్ఛ లేకపోవడం

సంస్థలు అనుసరిస్తున్న నియమ, నిబంధనలు కూడా ఐటీ రంగంలో వలసలకు కారణంగా నిలుస్తున్నాయి. నిర్దిష్టంగా ఒక ప్రాజెక్ట్ లేదా టాస్క్ విషయంలో స్వీయ నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ ఉద్యోగులకు ఉండటంలేదు. అంతేకాకుండా ఉద్యోగుల పనిలో ఉన్నతాధికారుల జోక్యం ఎక్కువగా ఉండటం కూడా వలసలకు మరో కారణమని ఇండస్ట్రీ నిపుణులు పేర్కొంటున్నారు.

'రిక్రియేషన్' సదుపాయాలు

ఐటీ సంస్థల్లో పనిచేస్తున్న నేటి తరం ఉద్యోగులు డ్రెస్‌కోడ్ నుంచి ఆఫీస్‌లో ఇంటర్నెట్ వినియోగం వరకూ.. సాఫ్ట్‌వేర్ సంస్థలు తమకు అనుకూలంగా వ్యవహరించాలని కోరుకుంటున్నారు. దాంతోపాటు అప్పుడే కోర్సులు పూర్తిచేసుకొని, క్యాంపస్ నుంచి కార్పొరేట్ కంపెనీల్లో కొలువుదీరిన యువ ఉద్యోగులు.. రిక్రియేషన్ సదుపాయాలను కూడా ఆశిస్తున్నారు. ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తే పనిభారం నుంచి ఉపశమనం పొందుతూ.. మరింత ఉత్సాహంతో పనిచేయగలమని అభిప్రాయపడుతున్నారు.

తాజా సర్వేలో వెల్లడి

ఐటీ రంగంలోని ప్రముఖ స్టాఫింగ్/కన్సల్టింగ్ సంస్థ టెక్‌గిగ్ నిర్వహించిన 'బెస్ట్ కంపెనీస్ టు వర్క్ ఫర్' సర్వేలో ఐటీ రంగంలో యువ ఉద్యోగుల వలసలకు పలు కారణాలను వెల్లడించింది.

- ఇన్నోవేషన్ అవకాశాలు కల్పించమని కోరుతున్న వారు-44 శాతం.
- నూతన సాంకేతిక నైపుణ్యాలపై పనిచేసే అవకాశం ఉండాలంటున్న ఉద్యోగులు -35 శాతం.
- యాజమాన్యం/బాస్/ప్రాజెక్టు మేనేజర్ వైఖరిపై విముఖత-25 శాతం.
- ఫ్యూచర్ కెరీర్ అవకాశాల కారణంగా కంపెనీలు మారుతున్న ఉద్యోగులు-23 శాతం.
- ఫ్లెక్సిబుల్ వర్కింగ్ అవర్స్ కోరుతున్నవారు -80 శాతం.
- ఆఫ్‌సైట్ వర్క్ అవకాశం కల్పించాలంటున్న ఉద్యోగులు-56 శాతం.
- రిక్రియేషన్ సదుపాయాలు అడుగుతున్న వారు-36 శాతం.
- డ్రెస్‌కోడ్‌లో స్వేచ్ఛ కావాలంటున్న ఉద్యోగులు-97 శాతం.
- ఇంటర్నెట్ సౌలభ్యం కోరుతున్న వారు-88 శాతం.

ఐటీ సంస్థల నివారణ చర్యలు

యువ ఉద్యోగుల ఆలోచనలను పరిగణనలోకి తీసుకుంటున్న ఐటీ దిగ్గజ సంస్థలు ప్రతిభావంతులు చేజారకుండా పలు చర్యలు తీసుకుంటున్నాయి. ఐబీఎం, టీసీఎస్, విప్రో, కాగ్నిజెంట్ వంటి టాప్ కంపెనీలు పలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. రిక్రియేషన్ పరంగా మారథాన్ పోటీలు, సీఎస్ఆర్ యాక్టివిటీస్ నిర్వహిస్తూ.. ఉద్యోగులకు పనిభారం నుంచి ఉపశమనం కల్పిస్తున్నాయి. మంచి పనితీరు కనబరిచే ఉద్యోగులకు బోనస్/ఇన్సెంటివ్ లేదా ఏడాది కోసారి కుటుంబంతో కలిసి విహార యాత్రలకు వెళ్లే సదుపాయాలు కల్పిస్తున్నాయి. ఆర్థిక ప్రోత్సాహకాలు సైతం అందిస్తున్నాయి.

ఆ అయిదు రంగాల్లో తగ్గిన వలసలు

టీమ్‌లీజ్ తాజా సర్వే ప్రకారం మొత్తం 19 రంగాలకు గాను అక్టోబర్-మార్చి (2018-19) మధ్యకాలంలో 5 రంగాల్లో అట్రిషన్ రేటు తగ్గింది. ముఖ్యంగా నిర్మాణం అండ్ రియల్ ఎస్టేట్, ఐటీ, కేపీవో, టెలికమ్యూనికేషన్స్, ట్రావెల్ అండ్ హాస్పిటాలిటీ రంగాల్లో వలసలు తగ్గాయి. అదే సమయంలో... ఆగ్రోకెమికల్స్, ఎడ్యుకేషనల్ సర్వీసెస్, ఎఫ్ఎంసీజీ అండ్ డీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, రిటైల్‌లో వలసలు పెరిగినట్లు టీమ్‌లీజ్ సర్వే వెల్లడించింది.

సానుకూలంగా ఉంటేనే..

ఉద్యోగులు కోరుకుంటున్న పలు సౌకర్యాలు ప్రముఖ ఐటీ సంస్థల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. యువ ఉద్యోగులు కూడా కంపెనీల అవసరాలకు తగ్గట్టు మారాల్సిన అవసరముంది. కొత్త టెక్నాలజీల ఆధారంగా పనిచేసేటప్పుడు సీనియర్ల పర్యవేక్షణలో విధులు నిర్వహిస్తే సదరు ప్రాజెక్ట్ సమర్థంగా పూర్తి చేసే వీలుంటుంది. అనుభవం, నైపుణ్యం గడించిన కొద్దీ సంస్థలే ఉద్యోగులకు అన్ని రకాలుగా అవకాశాలు కల్పిస్తాయి.

– వి.రామస్వామి,
గ్లోబల్ హెడ్, టీసీఎస్ ఐయాన్.

జాబ్ పాయింట్

బీహెచ్ఈఎల్

ఖాళీలు 33

బెంగళూరు (కర్ణాటక)లోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 33 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **ఇంజనీర్స్: 27**
- **విభాగాలు:** ఎలక్ట్రికల్-9, మెకానికల్-8, సివిల్-10.
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత. నిర్దిష్ట పని అనుభవం ఉండాలి.

2. సూపర్ వైజర్స్ (సివిల్): 6
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి కనీసం 60 శాతం మార్కులతో సివిల్ విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణత. నిర్దిష్ట పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 2019, జూన్ 1 నాటికి 35 ఏళ్లకు మించకూడదు. ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; పీహెచ్‌సీలకు పదేళ్లు గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** అకడమిక్ మెరిట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ (పోస్టు ద్వారా)లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జూలై 12, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.bhelisg.com

ఈసీఐఎల్

ఖాళీలు 50

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్).. 50 ట్రేడ్స్‌మెన్-సీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **ట్రేడుల వారీ ఖాళీలు:** ఎలక్ట్రానిక్ మెకానిక్/రేడియో అండ్ టీవీ-25, ఫిట్టర్-9, ఎలక్ట్రీషియన్-5, వెల్డర్-4, మెషినిస్ట్-3, మిల్‌రైట్ మెకానిక్-2, ఎలక్ట్రోప్లాటర్-1, టర్నర్-1.
- **అర్హత:** పోస్టులను బట్టి మెట్రిక్యులేషన్/ఎస్ఎస్సీ లేదా ఐటీఐ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 2019, మే 31 నాటికి 35 ఏళ్లకు మించకూడదు. ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; పీడబ్ల్యూడీలకు పదేళ్లు గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.500.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జూన్ 29, 2019.
- **ఎంపిక:** రాత పరీక్ష, ట్రేడ్ టెస్ట్ మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** http://careers.ecil.co.in

టొబాకో బోర్డ్

ఖాళీలు 41

గుంటూరు (ఏపీ)లోని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన టొబాకో బోర్డ్ తాత్కాలిక ప్రాతిపదికన 41 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **ఫీల్డ్ ఆఫీసర్/టెక్నికల్ అసిస్టెంట్: 25**
» **అకౌంటెంట్/సూపరింటెండెంట్: 16**
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి బీఎస్సీ (అగ్రికల్చర్), ఏదైనా డిగ్రీ/డిప్లొమా ఉత్తీర్ణత లేదా టాలీ అకౌంట్స్ సాఫ్ట్‌వేర్‌లో సర్టిఫికెట్ కోర్సు చేసుండాలి.
- **వయసు:** 2019, జూలై 15 నాటికి 18-30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** రాత పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500+జీఎస్టీ (ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీలకు ఫీజు లేదు).
- **దరఖాస్తుకు చివరితేదీ:** జూలై 15, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://tobaccoboard.com

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్

ఎయిర్‌మెన్

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి ఎయిర్‌మెన్ (గ్రూప్-ఎక్స్, గ్రూప్-వై) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** ఇంటర్మీడియట్/10+2/సంబంధిత విభాగాల్లో డిప్లొమా ఇన్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణత. నిర్దేశించిన శారీరక ప్రమాణాలుండాలి.
- **వయసు:** 1999, జూలై 19 నుంచి 2003, జూలై 1 మధ్య జన్మించి ఉండాలి.
- **ఎంపిక:** రాత పరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్ (పీఎఫ్‌టీ), మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు ప్రారంభం:** జూలై 1, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జూలై 15, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://airmenselection.cdac.in

ఏఎఫ్ఎంఎస్

ఖాళీలు 150

ఆర్మ్డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసుల్లో.. షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్సీ) ఆఫీసర్ ఉద్యోగాలకు ప్రకటన విడుదలైంది. అర్హులైన పురుష, మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **ఖాళీలు:** 150 (పురుషులు-135, మహిళలు-15).
- **అర్హత:** ఎంబీబీఎస్ ఉత్తీర్ణత. మెడికల్ పీజీ/డిప్లొమా అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకోదలచిన వారు స్టేట్ మెడికల్ కౌన్సిల్/ఎంసీఐలో రిజిస్టర్ అయి ఉండాలి. నిర్దేశించిన శారీరక, వైద్య ప్రమాణాలు తప్పనిసరి.
- **వయసు:** 2019, డిసెంబర్ 31 నాటికి 45 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ, ఫిజికల్ అండ్ మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేసుకోవచ్చు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.200.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జూలై 21, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** http://amcsscentry.gov.in

బీఈసీఐఎల్

ఖాళీలు 40

నోయిడాలోని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన మినీరత్న సంస్థ అయిన బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్) తాత్కాలిక ప్రాతిపదికన 40 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పేషంట్ కేర్ మేనేజర్ (పీసీఎం): 20**
» **పేషంట్ కేర్ కో-ఆర్డినేటర్ (పీసీసీ): 20**
- **అర్హత:** పోస్టులను బట్టి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఫుల్‌టైం బ్యాచిలర్ డిగ్రీ ఇన్ లైఫ్ సైన్సెస్ లేదా ఫుల్‌టైం పోస్ట్ గ్రాడ్యుయేట్ క్వాలిఫికేషన్ ఇన్ హాస్పిటల్/హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ ఉత్తీర్ణత. పీసీసీ పోస్టులకు ఏదైనా విభాగంలో డిగ్రీ పూర్తిచేసిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. నిర్దిష్ట పని అనుభవం కూడా ఉండాలి.
- **వయసు:** పీసీఎం పోస్టులకు 40 ఏళ్లు, పీసీసీ పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీలకు రూ.250; మిగిలిన వారికి రూ.500.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జూలై 12, 2019.
- **వెబ్‌సైట్:** www.becil.com

ఏపీలో గ్రామ వలంటీర్ ఎంపిక ప్రకటన

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి విభాగం గ్రామ వలంటీర్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదల చేసింది.

- **అర్హత:** గిరిజన (ఏజెన్సీ/ట్రైబల్) ప్రాంతాలకు చెందిన వారికి పదో తరగతి, గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు ఇంటర్మీడియట్, పట్టణ ప్రాంత అభ్యర్థులకు డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు దరఖాస్తుదారులు స్థానికులై ఉండాలి.
- **వయసు:** 30.06.2019 నాటికి 18-35 ఏళ్ల మధ్య ఉండాలి.
- **దరఖాస్తు ప్రక్రియ:** 2019, జూన్ 24 నుంచి జూలై 5 వరకు.
- **ఇంటర్వ్యూ తేదీలు:** 2019, జూలై 11 నుంచి 25 వరకు.
- **శిక్షణ కార్యక్రమం:** 2019, ఆగస్టు 5 నుంచి 10 వరకు.
- **నియామక తేదీ:** 2019, ఆగస్టు 15.
- **వెబ్‌సైట్:** http://gramavolunteer1.ap.gov.in/GRAMAVAPP/VV/index.html

సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్లో..
❖ జనరల్ స్టడీస్ మోడల్ పేపర్లు
❖ కెరీర్ కౌన్సెలింగ్
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS
యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

7

ప్రపంచకప్‌లో ఒకే జట్టుపై రెండు సెంచరీలు చేసిన ఏడో బ్యాట్స్‌మన్‌గా ఆరోన్ ఫించ్ గుర్తింపు పొందాడు. డివిలియర్స్ అత్యధికంగా వెస్టిండీస్‌పై మూడు సెంచరీలు నమోదు చేశాడు. సచిన్ టెండూల్కర్ (కెన్యాపై), బ్రియాన్ లారా (దక్షిణాఫ్రికాపై), గంగూలీ (కెన్యాపై), స్కాట్ స్టయిరిస్ (శ్రీలంకపై), రికీ పాంటింగ్ (భారత్‌పై) రెండేసి సెంచరీలు సాధించారు.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, నె.ర.రే-నెట్ రన్‌రేట్, పా-పాయింట్లు

జట్టు	ఆ	గె	ఓ	ర	నె.ర.రే.	పా
ఆస్ట్రేలియా	7	6	1	0	0.906	12
న్యూజిలాండ్	6	5	0	1	1.306	11
భారత్	5	4	0	1	0.809	9
ఇంగ్లండ్	7	4	3	0	1.051	8
బంగ్లాదేశ్	7	3	3	1	-0.133	7

జట్టు	ఆ	గె	ఓ	ర	నె.ర.రే.	పా
శ్రీలంక	6	2	2	2	-1.119	6
పాకిస్తాన్	6	2	3	1	-1.265	5
వెస్టిండీస్	6	1	4	1	0.190	3
దక్షిణాఫ్రికా	7	1	5	1	-0.324	3
అఫ్గానిస్తాన్	7	0	7	0	-1.634	0

ఫించ్ సెంచరీ అభివాదం

ఆసీస్ విలాసం ఇంగ్లండ్ విలాపం

వరల్డ్ నంబర్‌వన్ జట్టు హోదాలో, సొంతగడ్డపై ప్రపంచకప్ ఫేవరెట్‌గా భారీ అంచనాలతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ బ్యాటింగ్ కోటకు బీటలు పడుతున్నాయి. గత మ్యాచ్‌లో అనూహ్యంగా శ్రీలంక చేతిలో ఓడిన మోర్గాన్ సేన ఇప్పుడు చిరకాల ప్రత్యర్థి ఆసీస్ చేతిలోనూ చావుదెబ్బ తింది. సాధారణ లక్ష్యాన్ని ఛేదించలేక, కనీసం పూర్తి ఓవర్లు ఆడలేక ఆ జట్టు చతికిల పడింది. ఒకరితో పోటీ పడి మరో బ్యాట్స్‌మన్ విఫలం కావడంతో టోర్నీలో మూడో ఓటమిని తమ ఖాతాలో వేసుకుంది. ఫలితంగా సెమీస్ అవకాశాలు మరింత సంక్లిష్టం చేసుకుంది. అటు ఆస్ట్రేలియా మాత్రం అదరగొట్టే ఆటతో జైత్రయాత్రను కొనసాగిస్తోంది. మ్యాచ్ మ్యాచ్‌కూ రాటుదేలుతున్న కంగారూ సేన వరుసగా నాలుగో విజయాన్ని అందుకొని ప్రపంచ కప్‌లో సెమీఫైనల్లోకి అడుగు పెట్టిన తొలి జట్టుగా నిలిచింది. బ్యాటింగ్‌లో ఫించ్, వార్నర్ జట్టును ముందుండి నడిపిస్తే బౌలింగ్‌లో బెహ్రన్‌డార్ఫ్ ఐదు వికెట్లకు తోడు స్టార్క్ అద్భుత బంతులు ఆసీస్‌ను గెలిపించాయి. 1992 తర్వాత ఇంగ్లండ్ చేతిలో ఓడని తమ రికార్డును ఈసారి కూడా ఆస్ట్రేలియా నిలబెట్టుకోవడం విశేషం.

ఆరో విజయంతో సెమీస్ చేరిన ఆస్ట్రేలియా

సెంచరీతో చెలరేగిన ఫించ్ • మెరిసిన స్టార్క్, బెహ్రన్‌డార్ఫ్
ఇంగ్లండ్‌కు వరుసగా రెండో ఓటమి • నాకౌట్ అవకాశాలు సంక్లిష్టం

లండన్: ప్రపంచకప్‌లో తొలి సెమీస్ స్థానం ఖాయమైంది. డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా టోర్నీలో ఆరో విజయంతో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం లార్డ్స్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో ఆసీస్ 64 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 285 పరుగులు చేసింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' కెప్టెన్ ఫించ్ (116 బంతుల్లో 100; 11 ఫోర్లు, 2 సిక్సర్లు) సెంచరీతో చెలరేగాడు. వార్నర్ (61 బంతుల్లో 53; 6 ఫోర్లు) మరోసారి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఇంగ్లండ్ 44.4 ఓవర్లలో 221 పరుగులకే ఆలౌటైంది. స్టోక్స్ (115 బంతుల్లో 89; 8 ఫోర్లు, 2 సిక్సర్లు) మినహా అంతా విఫలమయ్యారు. బెహ్రన్‌డార్ఫ్ (5/44), మిషెల్ స్టార్క్ (4/43) ప్రత్యర్థిని కుప్పకూల్చారు.

రాణించిన వార్నర్...

ఆస్ట్రేలియాకు ఫించ్, వార్నర్ మరోసారి అదిరే ఆరంభం అందించారు. పిచ్ బౌలింగ్‌కు కొంత అనుకూలంగా కనిపించినా... ఇంగ్లండ్ పేసర్లు ఆ అవకాశాన్ని ఉపయోగించు కోలేకపోవడంతో కంగారూల ఇన్నింగ్స్ సాఫీగా సాగిపోయింది. 15 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఫించ్ ఇచ్చిన కష్టసాధ్యమైన క్యాచ్‌ను విన్స్ వదిలేయడం, 18 వద్ద ఇంగ్లండ్ ఎల్బీ అప్పీల్‌ను అంపైర్ తిరస్కరించడం ఆసీస్‌కు కలిసొచ్చింది. అంపైర్ నిర్ణయాన్ని ఇంగ్లండ్ రివ్యూ చేసినా లాభం లేకపోయింది. తొలి పవర్‌ప్లేలో ఆసీస్ 44 పరుగులు చేయగా... ఓపెనర్లు ఇద్దరూ ఒకరితో మరొకరు పోటీ పడి చకచకా పరుగులు సాధించారు. ఈ క్రమంలో ఫించ్ 61 బంతుల్లో, వార్నర్ 52 బంతుల్లో అర్ధ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. 17.5 ఓవర్లలో భాగస్వామ్యం వంద పరుగులకు చేరింది. చివరకు వార్నర్‌ను ఔట్ చేసి స్పిన్నర్ అలీ ఈ జోడీని విడదీశాడు. మరోవైపు ఫించ్ దూకుడు తగ్గించలేదు. 9 పరుగుల వద్ద బట్లర్ స్టంపింగ్ వదిలేయడంతో బతికిపోయిన ఖాజా (23) కెప్టెన్‌కు అండగా నిలిచాడు. వీరిద్దరు 50 పరుగులు జత చేసిన తర్వాత ఖాజా వెనుదిరిగాడు. ఆ తర్వాత ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ ఆశించినంత వేగంగా సాగకపోవడంతో స్కోరు 300 పరుగులకు కూడా చేరలేదు. 115 బంతుల్లో ఈ ప్రపంచకప్‌లో రెండో సెంచరీ పూర్తి చేసుకున్న వెంటనే ఫించ్ వెనుదిరగ్గా... స్టీవ్ స్మిత్ (34 బంతుల్లో 38; 5 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. చివర్లో క్యారీ (27 బంతుల్లో 38 నాటౌట్; 5 ఫోర్లు) వేగంగా ఆడటంతో ఆసీస్ చెప్పుకోదగ్గ స్కోరు నమోదు చేయగలిగింది.

స్టార్క్ యార్కర్‌కు స్టోక్స్ క్లీన్ బౌల్డ్

స్టోక్స్ మినహా...

26 పరుగులకు 3 వికెట్లు... లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్‌కు లభించిన ఆరంభం ఇది! ఇన్నింగ్స్ రెండో బంతికే విన్స్ (0)ను బెహ్రన్‌డార్ఫ్ క్లీన్‌బౌల్డ్ చేయగా, స్టార్క్ అద్భుత బంతికి రూట్ (8) వికెట్ల ముందు దొరికిపోయాడు. పుల్ షాట్ ఆడబోయి మోర్గాన్ (4) వెనుదిరిగాడు. ఈ దశలో బెయిర్‌స్టో (27) జట్టును ఆదుకునే ప్రయత్నం చేసినా చెత్త షాట్‌తో నిష్క్రమించాడు. స్టోక్స్, బట్లర్ (25) ఐదో వికెట్‌కు 71 పరుగులు జోడించారు. రెండు సార్లు ఔటయ్యే ప్రమాదం తప్పించున్న బట్లర్ ఇన్నింగ్స్... డీప్ స్క్వేర్ లెగ్‌లో ఖాజా అద్భుత క్యాచ్‌తో ముగిసింది. స్టోక్స్ మాత్రం కండరాల నొప్పితో బాధపడుతూనే చికిత్స తీసుకుంటూ తన పోరాటం కొనసాగించాడు. ఈ క్రమంలో కొన్ని చక్కటి షాట్లు ఆడిన అతను 75 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. క్రిస్ వోక్స్ (26) నుంచి అతనికి కొంత సహకారం లభించింది. మ్యాక్స్‌వెల్ ఓవర్లో రెండు భారీ సిక్సర్లు, కమిన్స్ ఓవర్లో రెండు ఫోర్లు కొట్టి జోరు పెంచే ప్రయత్నం చేసిన స్టోక్స్‌ను బౌల్డ్ చేసి స్టార్క్ ఆసీస్ అడ్డుగోడను తప్పించాడు. అతను వేసిన ఈ యార్కర్ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. ఆ తర్వాత ఇంగ్లండ్ పతనం కావడానికి ఎంతో సేపు పట్టలేదు.

బెహ్రన్‌డార్ఫ్

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: ఫించ్ (సి) వోక్స్ (బి) ఆర్చర్ 100; వార్నర్ (సి) రూట్ (బి) అలీ 53; ఖాజా (బి) స్టోక్స్ 23; స్మిత్ (సి) ఆర్చర్ (బి) వోక్స్ 38; మ్యాక్స్‌వెల్ (సి) బట్లర్ (బి) వుడ్ 12; స్టాయినిస్ (రనౌట్) 8; క్యారీ (నాటౌట్) 38; కమిన్స్ (సి) బట్లర్ (బి) వోక్స్ 1; స్టార్క్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 285.**

వికెట్ల పతనం: 1-123, 2-173, 3-185, 4-213, 5-228, 6-250, 7-259.

బౌలింగ్: వోక్స్ 10-0-46-2, ఆర్చర్ 9-0-56-1, వుడ్ 9-0-59-1, స్టోక్స్ 6-0-29-1, అలీ 6-0-42-1, రషీద్ 10-0-49-0.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: బెయిర్‌స్టో (సి) కమిన్స్ (బి) బెహ్రన్‌డార్ఫ్ 27; విన్స్ (బి) బెహ్రన్‌డార్ఫ్ 0; రూట్ (ఎల్బీ) (బి) స్టార్క్ 8; మోర్గాన్ (సి) కమిన్స్ (బి) స్టార్క్ 4; స్టోక్స్ (బి) స్టార్క్ 89; బట్లర్ (సి) ఖాజా (బి) స్టాయినిస్ 25; వోక్స్ (సి) ఫించ్ (బి) బెహ్రన్‌డార్ఫ్ 26; అలీ (సి) క్యారీ (బి) బెహ్రన్‌డార్ఫ్ 6; రషీద్ (సి) స్టాయినిస్ (బి) స్టార్క్ 25; ఆర్చర్ (సి) వార్నర్ (బి) బెహ్రన్‌డార్ఫ్ 1; వుడ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (44.4 ఓవర్లలో ఆలౌట్) 221.**

వికెట్ల పతనం: 1-0, 2-15, 3-26, 4-53, 5-124, 6-177, 7-189, 8-202, 9-211, 10-221.

బౌలింగ్: బెహ్రన్‌డార్ఫ్ 10-0-44-5, స్టార్క్ 8.4-1-43-4, కమిన్స్ 8-1-41-0, లయన్ 9-0-43-0, స్టాయినిస్ 7-0-29-1, మ్యాక్స్‌వెల్ 2-0-15-0.

కివీస్‌ను పాక్ ఆపేనా?

- నేడు రెండు జట్ల మధ్య మ్యాచ్
- మధ్యాహ్నం 3 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

సర్ఫరాజ్

విలియమ్సన్

బర్మింగ్‌హామ్: ప్రపంచ కప్‌లో అజేయంగా దూసుకెళ్తూ సెమీఫైనల్స్ మెట్టెక్కేందుకు ఒక్క గెలుపు దూరంలో ఉంది న్యూజిలాండ్. మరోవైపు నాకౌట్ చేరాలంటే ఆడబోయే మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గాల్సిన పరిస్థితి పాకిస్తాన్‌ది. ఈ నేపథ్యంలో రెండు జట్లూ బుధవారం తలపడనున్నాయి. టోర్నీలో క్లిష్టమైన సందర్భాల్లో పట్టు వదలకుండా పోరాడుతున్న కివీస్ ఆటతీరు అందరినీ ఆకట్టుకుంటోంది. పాక్ మాత్రం ఆపసోపాలు పడుతోంది. అయితే, ఎడంచేతి వాటం బ్యాట్స్‌మన్ హారిస్ సొహైల్ అద్భుత ఇన్నింగ్స్‌తో గత మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై సాధించిన విజయం జట్టులో ఆత్మవిశ్వాసం నింపింది. తాడోపేడో తేల్చుకోవాల్సిన ఈ సమయంలో పాక్ తెగించి ఆడేందుకు ప్రయత్నించనుంది. ప్రధాన పేసర్ ఆమిర్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. రెండో పేసర్ వహాబ్ రియాజ్ మెరిస్తే ప్రత్యర్థికి కష్టాలు తప్పవు. ఓపెనర్లు ఇమాముల్, ఫఖర్ జమాన్, వన్‌డౌన్ బ్యాట్స్‌మన్ బాబర్ ఆజమ్‌కు తోడుగా కెప్టెన్ సర్ఫరాజ్ పరుగులు చేస్తే బ్యాటింగ్ మరింత బలోపేతం అవుతుంది. న్యూజిలాండ్‌కు అంతా బాగున్నా, ఓపెనర్లు గప్టిల్, మున్రో ఫామ్ కలవరపరుస్తోంది. కెప్టెన్ విలియమ్సన్ చెలరేగి ఆడుతుండటం, మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ టేలర్ నిలకడ కారణంగా లాథమ్ సహా మిగతావారి వైఫల్యం ప్రభావం చూపడం లేదు. ఆల్ రౌండర్లు నీషమ్, గ్రాండ్‌హోమ్ జట్టుకు కావాల్సిన విధంగా రాణిస్తున్నారు. పేసర్లు బౌల్ట్, ఫెర్గూసన్ పదునైన బంతులను పాక్ బ్యాట్స్‌మెన్ ఎలా కాచుకుంటారో చూడాలి.

ముఖాముఖి రికార్డు

ఇరు జట్ల మధ్య ఇప్పటి వరకు 106 మ్యాచ్‌లు జరగ్గా 54 మ్యాచ్‌ల్లో పాకిస్తాన్ నెగ్గింది. కివీస్ 48 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. ఒకటి టై కాగా, మూడింట్లో ఫలితం తేలలేదు. ప్రపంచ కప్‌లోనూ న్యూజిలాండ్‌పై పాకిస్తాన్‌దే పైచేయిగా ఉంది. మెగా ఈవెంట్‌లలో మొత్తం 8 మ్యాచ్‌లాడగా... ఆరింట్లో పాక్, రెండింట్లో కివీస్ గెలుపొందాయి.

అంకిత రైనా శుభారంభం

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ క్వాలిఫయింగ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత మహిళల నంబర్‌వన్ అంకిత రైనా శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో అంకిత 6-4, 6-3తో కాగ్లా బుయుకాకె (టర్కీ)పై నెగ్గింది. గంటన్నరపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అంకిత తొలి సెట్‌లో ఒక బ్రేక్ పాయింట్ సాధించి సెట్ దక్కించుకుంది. రెండో సెట్‌లో తన సర్వీస్‌ను ఆమె రెండుసార్లు కోల్పోయినా ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసి విజయాన్ని ఖాయం చేసుకుంది.

ఆస్పత్రిలో లారా

స్వల్ప అస్వస్థతే... ఆందోళన లేదన్న సన్నిహితులు

ముంబై: వెస్టిండీస్ క్రికెట్ దిగ్గజం బ్రియాన్ లారా ఛాతీనొప్పితో ఆస్పత్రిలో చేరాడు. ప్రస్తుతం జరుగుతున్న ప్రపంచకప్‌లో వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న అతడు మంగళవారం అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే సన్నిహితులు ఇక్కడి గ్లోబల్ హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న 50 ఏళ్ల లారా ఆరోగ్యం నిలకడగానే ఉందని, ఆందోళన చెందాల్సిన పనిలేదని ఆయన సన్నిహితుడొకరు చెప్పారు. రెండేళ్ల క్రితం ఈ బ్యాటింగ్ లెజెండ్‌కు యాంజియోప్లాస్టీ జరిగింది. తాజాగా ఛాతీనొప్పి రావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు.

నేను బాగున్నా...

లారా ఆడియో మెసెజ్ ద్వారా స్పందించాడు. 'నేను బాగానే ఉన్నా. బుధవారం నా హోటల్ రూమ్‌కి వెళతాను. అందరూ నాకేమైందనే ఆందోళన పడుతున్నారు. నేను మంగళవారం ఉదయం జిమ్‌లో ఎక్కువసేపు చెమటోడ్చాను. దీంతో ఛాతీలో నొప్పి వచ్చింది. ఎందుకైనా మంచిదని డాక్టర్‌ను సంప్రదించాలనుకున్నా... దీంతో నన్ను ఆస్పత్రిలో చేర్పించారు. డాక్టర్లు లెక్కలేనన్ని పరీక్షలు చేశారు. నేనేమో బెడ్‌పై పడుకొని హాయిగా ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మ్యాచ్ తిలకిస్తున్నా' అని అన్నాడు.

ఐఓఏ ఏకపక్ష నిర్ణయం తీసుకోదు

కేంద్రాన్ని సంప్రదించాలి • కామన్వెల్త్ గేమ్స్ నుంచి వైదొలగడంపై కేంద్ర క్రీడల మంత్రి వెల్లడి

న్యూఢిల్లీ: బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్ (2022) నుంచి భారత్ వైదొలగే నిర్ణయాన్ని భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ఏకపక్షంగా తీసుకోజాలదని కేంద్ర క్రీడాశాఖ మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. ముందుగా కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించాకే ఏ నిర్ణయమైనా తీసుకోవాల్సి ఉంటుందని ఆయన వెల్లడించారు. భారత్‌కు పతకాలు తెచ్చే షూటింగ్ క్రీడను ఈ గేమ్స్ నుంచి తప్పించాలని ఆతిథ్య దేశం నిర్ణయించింది. దీంతో ఐఓఏ తీవ్రంగా స్పందించింది. అదేగనక ఇంగ్లండ్ తుది నిర్ణయమైతే ఆ టోర్నీలో పాల్గొనకుండా బాయ్‌కాట్ చేసే ఆలోచన ఉందని ఐఓఏ ఇటీవల ప్రకటించింది. దీనిపై క్రీడల మంత్రి రిజిజు స్పందిస్తూ 'ప్రస్తుత పరిణామాలపై నాకేమీ తెలియదు. షూటింగ్ సమాఖ్య (ఎన్ఆర్ఏఐ)తో పాటు, ఐఓఏతో చర్చిస్తాను. బాయ్‌కాట్ చేయాలనుకుంటే ముందుగా ప్రభుత్వ నిర్ణయమేంటో తెలుసుకోవాలి. దేశ ప్రతిష్ఠకు, ఆటగాళ్ల భవిష్యత్తుకు సంబంధించిన ఇలాంటి కీలకమైన నిర్ణయాల్ని ఏ ఒక్కరు ఏకపక్షంగా తీసుకోవడానికి వీల్లేదు' అని అన్నారు. 2032 ఒలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం ఐఓఏ గతేడాది ప్రాథమిక ఆసక్తి వ్యక్తీకరణ బిడ్‌ను సమర్పించింది. దీనిపై ఆయన మాట్లాడుతూ ఒలింపిక్స్ లాంటి మెగా ఈవెంట్లకు ఆతిథ్యమివ్వాలని ప్రతి దేశానికి ఉంటుందని... అయితే అందుకు అత్యున్నత సదుపాయాలు, సన్నద్ధత, సామర్థ్యంపై బేరీజు వేసుకోవాల్సి ఉంటుందని మంత్రి చెప్పారు.

మహిళల హాకీ జట్టుకు అభినందనలు...

ఎఫ్ఐహెచ్ మహిళల సిరీస్ ఫైనల్స్ టోర్నమెంట్‌లో టైటిల్ గెలిచిన భారత జట్టును అభినందించిన క్రీడల మంత్రి కిరణ్ రిజిజు ఒలింపిక్ క్వాలిఫయింగ్ కోసం అన్ని విధాల అండదండలు అందజేస్తామని చెప్పారు. జట్లకు, క్రీడాకారులకు తమ మద్దతు ఉంటుందన్నారు. ఈ ఏడాది మహిళల జట్టు ఒలింపిక్ క్వాలిఫయింగ్‌లో తలపడనుంది. ఒకటికి మించి సమాఖ్యలు పుట్టుకొచ్చిన క్రీడా సమాఖ్యలు భారత క్రీడాకారుల భవిష్యత్తును కాలరాస్తే ఉపేక్షించేది లేదని అన్నారు. భారత ఆర్చరీ సంఘం (ఏఏఐ), జిమ్నాస్టిక్స్ సమాఖ్య (జీఎఫ్ఐ)ల తీరుపై ప్రేక్షక పాత్ర వహించబోమని చెప్పారు.

భారత్‌ను ఓడించగలం

బంగ్లా ఆల్‌రౌండర్ షకీబ్

సౌతాంప్టన్: శక్తి మేర ఆడితే తాము భారత్‌ను ఓడించగలమని అంటున్నాడు బంగ్లాదేశ్ స్టార్ ఆల్‌రౌండర్ షకీబుల్ హసన్. ప్రస్తుతం సూపర్ ఫామ్‌లో ఉన్న షకీబ్... ప్రపంచ కప్‌లో 1000 పరుగులు చేసిన తొలి బంగ్లా బ్యాట్స్‌మన్‌గా రికార్డులకెక్కాడు. అఫ్గాన్‌పై గెలుపు అనంతరం ఏడు మ్యాచ్‌ల్లో ఏడు పాయింట్లతో ఉందీ జట్టు. సెమీఫైనల్స్ చేరాలంటే భారత్ (జూలై 2), పాకిస్తాన్‌పై (జూలై 5) విజయం సాధించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో షకీబ్ మాట్లాడుతూ... 'భారత్ అగ్ర జట్టు. టైటిల్‌కు గట్టి పోటీదారుగా ఉన్న అలాంటి జట్టును ఓడించడం కష్టమే. కానీ, అత్యుత్తమ స్థాయి ఆటతో మా శక్తి మేర ప్రయత్నిస్తాం' అని పేర్కొన్నాడు. ఫలితాన్ని మార్చగల ప్రపంచ స్థాయి ఆటగాళ్లున్న టీమిండియాతో మ్యాచ్‌లో అనుభవం ప్రధాన పాత్ర పోషిస్తుందని షకీబ్ అన్నాడు. కప్‌లో తన ఫామ్ (476 పరుగులు, 10 వికెట్లు)పై అతడు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశాడు. వ్యక్తిగత రాణింపుతో అవసరమైన సమయంలో జట్టుకు ఉపయోగపడుతుండటం పట్ల సంతోషం వ్యక్తం చేశాడు.

పోరాడి ఓడిన ప్రజ్నేశ్

న్యూఢిల్లీ: అంటాల్యా ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్ ప్రజ్నేశ్ గుణేశ్వరన్ పోరాటం ముగిసింది. టర్కీలో మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 94వ ర్యాంకర్ ప్రజ్నేశ్ 7-6 (7/3), 0-6, 5-7తో ప్రపంచ 75వ ర్యాంకర్ లొరెంజో సొనెగో (ఇటలీ) చేతిలో పరాజయం పాలయ్యాడు. రెండు గంటల రెండు నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రజ్నేశ్ ఆరు ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. క్వార్టర్స్‌లో ఓడిన ప్రజ్నేశ్‌కు 7,490 యూరోల (రూ. 5 లక్షల 90 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 20 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

సాక్షి బిజినెస్

బుధవారం
26-6-2019

WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
312 ▲	97 ▲
39,435	11,796

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

నాస్‌డాక్	7,925	▼ 80
డోజోన్స్	26,625	▼ 102
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,422	▲ 6
డాక్స్	12,228	▼ 46
షాంఘై	2,982	▼ 26
నికాయ్	21,194	▼ 92

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	68.53	70.17
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	86.79	89.96
€	యూరో	ఎస్‌బీఐ	77.61	80.52
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	63.56	66.01
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	47.22	49.36
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	50.35	52.13
SAR	సౌదీ రియాల్	ఫామస్‌కుక్	17.76	19.48
UAE D	యూఏఈ దిర్హామ్	ఫామస్‌కుక్	18.19	19.70
¥	చైనా యువాన్	ఫామస్‌కుక్	9.46	10.81

పాత కారు.. యమా జోరు!!

- ఏడాదిలో చేతులు మారినవి 40 లక్షలు
- కొత్త వాటిని మించిన ప్రీ ఓన్డ్ విక్రయాలు
- తక్కువ ధరకే అప్‌గ్రేడ్ అయ్యే అవకాశం
- దేశంలో మారుతున్న కస్టమర్ల ధోరణి
- ఏటా 6-7 శాతం వృద్ధితో పురోగతి
- మరింత ఫోకస్ పెడుతున్న తయారీ కంపెనీలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో

భారత ఆటోమొబైల్ మార్కెట్లో కొత్త కార్ల కంటే పాత వాటికే డిమాండ్ పెరుగుతోంది. దేశవ్యాప్తంగా 2018-19లో 33.7 లక్షల కొత్త కార్లు రోడ్డెక్కగా... అదే సమయంలో ఏకంగా 40 లక్షల పాత కార్లు చేతులు మారాయి. అంతకు ముందటేడాదితో పోలిస్తే 2018-19లో కొత్త కార్ల అమ్మకాల వృద్ధి రేటు 2.7 శాతం మాత్రమే. నాలుగేళ్లలో ఇదే తక్కువ వృద్ధి రేటు కూడా!!. అదే పాత కార్ల విషయానికొస్తే... ఈ వృద్ధి 6-7 శాతం మధ్య ఉండటం గమనార్హం.

వాల్యూ ఫర్ మనీ..

పాత కారుకు కస్టమర్లు ఆకర్షితులు కావటానికి ప్రధాన కారణం వారు తాము చెల్లించే డబ్బుకు తగ్గ విలువ ఉండాలని ఆశిస్తున్నారని మహీంద్రా ఫస్ట్ చాయిస్ వీల్స్ చెబుతోంది. ''కొత్త కారు కొనాలనుకుంటే... ఆ ధరకే లేదా అంత కంటే తక్కువ ఖరీదుకే ఇంకా పెద్ద కారు వస్తోంది. అభివృద్ధి చెందిన దేశాల్లో నలుగురు వ్యక్తుల్లో ఒకరు మాత్రమే కొత్త కారు కొంటున్నారు. మిగిలిన ముగ్గురు ప్రీ ఓన్డ్ కారుకు సై అంటున్నారు'' అని ట్రూబిల్ కో-ఫౌండర్ శుభ్ బన్సాల్ చెప్పారు. ఇప్పుడు భారత్‌లో ప్రీ ఓన్డ్ విభాగంలోనే అధిక విక్రయాల ట్రెండ్ కొనసాగుతోందని చెప్పారు. పాత కార్ల విషయంలో వాల్యూ చూసేవారు 15 శాతం మంది ఉంటున్నారు. తక్కువ కాలానికి వాడి తిరిగి విక్రయించాలని భావించేవారు 23 శాతం కాగా, తక్కువ ధరకు వస్తుంది కాబట్టి కొనుగోలుకు మొగ్గు చూపేవారు 62 శాతం మంది ఉంటున్నారట.

తరచూ మారుస్తున్నారు..

దశాబ్దం క్రితం ఒక్కో కస్టమర్ తమ కారును పదేళ్లపాటు అట్టిపెట్టుకునేవారు. ఇప్పుడు ట్రెండ్ మారింది. యువ కస్టమర్ల సంఖ్య ఎక్కువ కావటంతో 3- 5 ఏళ్లకే కారును మారుస్తున్నారు. మరీ పాత వాహనమైతే సేల్ వాల్యూ రాదు. చాలా సందర్భాల్లో మూడేళ్ల పాతది కొత్త కారు మాదిరిగా ఉంటోందట. దీంతో చాలా మంది కస్టమర్లు పాత కారుకు ఓకే చెబుతున్నారు. మూడేళ్లలోపు తిరిగిన కారును కోరేవారు 27 శాతం, 4-5 ఏళ్లు వాడిన కారును కోరుకునేవారు 45 శాతం మంది ఉన్నారన్నది విక్రయదారుల మాట. 46 శాతం మంది యజమానులు మాత్రం తమ కారును 6-8 ఏళ్లు వాడిన తర్వాతే అమ్ముతున్నారు. 3- 5 ఏళ్లకే కారును విక్రయిస్తున్న వినియోగదార్లు పెద్ద కారు లేదా ఉత్తమ మోడల్‌కు అప్‌డేట్ అవుతున్నారు.

వ్యవస్థీకృత రంగంవైపు..

ప్రీ ఓన్డ్ కార్ల మార్కెట్లో వ్యవస్థీకృత రంగ విభాగ వాటా తక్కువే ఉన్నప్పటికీ క్రమంగా పెరుగుతోంది. 2016-17లో వ్యవస్థీకృత రంగం వాటా 15 శాతం ఉంటే 2018- 19 నాటికి 18 శాతానికి చేరింది. వ్యవస్థీకృత రంగ కంపెనీలు ప్రీ ఓన్డ్ కార్ల సేల్స్ కోసం షోరూంలు తెరుస్తున్నాయి. దాదాపు అన్ని సంస్థలూ సొంతంగా ప్రీ ఓన్డ్ కేంద్రాలను ఆపరేట్ చేస్తుండడం విశేషం.

సొంత బ్రాండ్ కార్లనేగాక ఏ కంపెనీ కార్లనైనా ఇవి కొనటం, అమ్మటం చేస్తున్నాయి. వ్యవస్థీకృత రంగంలోని ప్రీ ఓన్డ్ కేంద్రాల్లో కార్లకు నాణ్యత పరీక్షలు జరిపి, రిపేర్ చేసి మంచి కండీషన్‌కు తీసుకొచ్చాకే విక్రయిస్తారు. సర్టిఫై చేసి వారంటీతో అమ్ముతారు. కారు కొనేందుకు రుణం సులభంగా వస్తుంది. ఇక కస్టమర్ నుంచి కస్టమర్‌కు జరుగుతున్న వ్యాపారం 32 శాతంగా ఉంది. అవ్యవస్థీకృత రంగం 17 నుంచి 16 శాతానికి తగ్గింది. సెమి- ఆర్గనైజ్డ్ సెగ్మెంట్ 36 నుంచి 34 శాతంగా ఉంది.

ఫైనాన్స్ 17 శాతమే..

పాత కార్ల విక్రయాలు పెరుగుతున్నప్పటికీ కొత్త కార్లతో పోలిస్తే ఫైనాన్స్ లభ్యత తక్కువగా ఉంటోంది. 75 శాతం కొత్త కార్లకు రుణ సదుపాయం లభిస్తే, పాత కార్ల విషయంలో ఇది 17 శాతమే. ఫైనాన్స్ కాస్ట్ ఎక్కువగా ఉండడంతోపాటు వినియోగదారుకు క్రెడిట్ కార్డు లేదా లోన్ హిస్టరీ లేకపోవడం ఇందుకు ప్రధాన కారణం. కొత్త కారుపై ఉండే వడ్డీ రేటు కంటే పాత కారుపై వడ్డీ రేటు కస్టమర్, వాహన విలువను బట్టి 2- 5 శాతం ఎక్కువ ఉంటోంది. ఆర్గనైజ్డ్ సెక్టార్లో విక్రయ కంపెనీలు బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలతో చేతులు కలిపి కస్టమర్లకు చేరువ అవుతున్నాయి. సులువుగా రుణం వచ్చేలా చేస్తున్నాయి. మరో విషయమేమంటే అవ్యవస్థీకృత రంగంలో పాత కారుకు విలువ కట్టడం అంత ఈజీ కాదు. ప్రామాణికత లేకపోవడంతో చాలా సందర్భాల్లో బ్రోకర్లదే తుది నిర్ణయంగా ఉంటోంది. కారు మోడల్, తిరిగిన కిలోమీటర్లు, వయసు, రంగు, నగరం కూడా ధరను నిర్ణయిస్తాయి.

కారు జోరు ఇలా..

సంవత్సరం	కొత్త కార్ల విక్రయాలు	వృద్ధి(%)	పాత కార్ల విక్రయాలు	వృద్ధి(%)
2018-19	33.7 లక్షలు	2.7	40 లక్షలు	6.1
2017-18	32.8 లక్షలు	9.3	37.7 లక్షలు	5
2016-17	30 లక్షలు	-	36 లక్షలు	-

ఇదీ.. పాత కార్ల మార్కెట్

ఎన్నేళ్ల పాతవి...	మార్కెట్ వాటా(%)
మూడేళ్లలోపు	19
4-5 ఏళ్లు వాడినవి	35
6-8 ఏళ్లు వాడినవి	46

(సోర్స్-మహీంద్రా ఫస్ట్ చాయిస్ వీల్స్)

ఎందుకు విక్రయిస్తారంటే...

40%	అప్‌డేట్ కావటం కోసం
11%	తరచూ కారు మార్చేవారు
16%	రిపేర్లతో ఇబ్బందిపడి
11%	అమ్మినా పాతది కొనేవారు

జీవిత బీమా తప్పనిసరి!!

బజాజ్ అలియాంజ్ సర్వేలో వెల్లడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీవిత బీమా కలిగి ఉండటమనేది అత్యంత ప్రాధాన్యత అంశంగా తమ అధ్యయనంలో తేలిందని బజాజ్ అలియాంజ్ లైఫ్ వెల్లడించింది. భారత్‌లో తొలిసారిగా లైఫ్ గోల్స్ పేరుతో పలు నగరాల్లో ఈ సంస్థ సర్వే నిర్వహించింది. 1,681 మంది సర్వేలో పాలుపంచుకున్నారు. వీరిలో 60 శాతం మంది జీవిత బీమాను అత్యంత ప్రాధాన్య అంశంగా పేర్కొన్నారని బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఎండీ తరుణ్ చుగ్ మంగళవారమిక్కడ మీడియాకు వెల్లడించారు. ''సర్వే ప్రకారం.. పిల్లల విద్య, ప్రశాంత జీవనం, సొంత ఇల్లు కీలకంగా ఉన్నాయి. 10 శాతం మంది సొంతంగా వ్యాపారాన్ని ప్రారంభించాలని భావిస్తున్నారు. పది మందిలో ఒకరు ప్రస్తుతం చేస్తున్న వ్యాపారం లేదా ఉద్యోగంతోపాటు అదనపు సంపాదన కోసం చూస్తున్నారు. రిటైర్‌మెంట్ తర్వాత జీవితం గురించి అయిదుగురిలో ఇద్దరు లక్ష్యాలను నిర్దేశించుకున్నారు'' అని తరుణ్ చుగ్ వివరించారు.

సోషల్ మీడియా ప్రభావం..

పలు విదేశీ పర్యాటక కేంద్రాలను చుట్టి రావాలని 28 శాతం మంది లక్ష్యంగా చేసుకున్నట్లు చుగ్ చెప్పారు.

బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఎండీ తరుణ్ చుగ్

''దక్షిణాది వారిలో ఇది 35 శాతంగా ఉంది. ముగ్గురు మహిళల్లో ఒకరికి ట్రావెల్ గోల్స్ ఉన్నాయి. 40 శాతం మంది హెల్త్, ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యత ఇచ్చారు. సగం మంది బ్యాలెన్స్ లైఫ్ ఉండాలని కోరుకున్నారు. సామాజికంగా తాము ప్రభావం చూపాలని 10 శాతం మంది ఉత్సాహం కనబరుస్తున్నారు. జీవిత లక్ష్యాలు నిర్దేశించుకోవడంలో సోషల్ మీడియా ప్రభావం ఉందని అయిదుగురిలో ఒకరు తెలిపారు. ఫైనాన్షియల్ ప్లానింగ్ సరిపడ చేయలేక పోయామని 53 శాతం మంది అభిప్రాయపడ్డారు. 62 శాతం మంది తమ లక్ష్యాలను చేరుకుంటామన్న ధీమాను వ్యక్తం చేశారు'' అని వివరించారు.

ఆగని పసిడి పరుగులు..!

- అంతర్జాతీయ మార్కెట్‌లో 1,442 డాలర్ల స్థాయికి
- ఆరు సంవత్సరాల గరిష్టస్థాయి
- అంతర్జాతీయ అనిశ్చితే కారణం

న్యూయార్క్/న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్ న్యూయార్క్ మర్కంటైల్ ఎక్స్ఛేంజ్- నైమెక్స్‌లో బంగారం ధర పరుగులు పెడుతోంది. మంగళవారం ఒక దశలో ఔన్స్ (31.1గ్రా) ధర 1,442.15 డాలర్లను తాకింది. ఇది ఆరు సంవత్సరాల గరిష్టస్థాయి. ఈ వార్త రాసే సమయం- రాత్రి 10.30కి 1,428 డాలర్ల స్థాయిలో ట్రేడవుతోంది. వారం క్రితం పసిడి 1,350 డాలర్ల వద్ద ట్రేడయ్యింది. అంటే గరిష్టాన్ని చూస్తే, వారం రోజుల్లో దాదాపు 92 డాలర్లు పెరిగిందన్నమాట.

కారణాలు చూస్తే...

కొనసాగుతున్న వాణిజ్య యుద్ధ ఆందోళనలు, ఈ నేపథ్యంలో అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి, అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధమేఘాలు సహా కొన్ని దేశాల మధ్య నెలకొన్న భౌగోళిక ఉద్రిక్తతలు దీనికి ప్రధాన కారణం. ప్రపంచ వృద్ధిపై ప్రత్యేకించి అమెరికా వృద్ధి స్పీడ్ తగ్గే అవకాశాలు ఉన్నాయన్న విశ్లేషణలు, దీనితో అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఫెడ్ ఫండ్ రేటు (ప్రస్తుతం 2.25-2.50 శ్రేణి) సమీపకాలంలోనే పావుశాతం తగ్గే అవకాశాలు ఉన్నాయన్న అంచనాలు, దీనితో డాలర్ ఇండెక్స్ బలహీనత (95.50) కూడా పసిడి ధరలను ఎగదోస్తున్నాయి.

భారత్‌లోనూ దూకుడే...

అంతర్జాతీయ సానుకూల సంకేతాల నేపథ్యంలో భారత్‌లోనూ పసిడి పరుగులు పెడుతోంది. ఢిల్లీ స్పాట్‌మార్కెట్‌లో 10 గ్రాముల ధర(24 క్యారెట్లు) రూ.470 పెరిగి, రూ.35,330కి చేరింది. దేశ ఫ్యూచర్స్ మార్కెట్- మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో ధర రాత్రి 10.30 గంటల సమయంలో 10 గ్రాముల ధర రూ.134 పెరిగి రూ.34,575 వద్ద ట్రేడవుతోంది.

ఏడాదిలో ఈ-కామర్స్ పాలసీ

- అందరి ప్రయోజనాలు పరిరక్షిస్తాం
- వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ: జాతీయ ఈ-కామర్స్ విధానాన్ని ఏడాది లోపే అందుబాటులోకి తెస్తామని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఈ-కామర్స్ రంగం అభివృద్ధే లక్ష్యంగా ఈ విధానాన్ని రూపొందిస్తామని పేర్కొన్నారు. తుది విధానం రూపకల్పనపై కసరత్తు జరుగుతోందని చెప్పారు. తుది విధానంలో చోటు చేసుకునే మార్పులకు అనుగుణంగా మారడానికి సంబంధిత సంస్థలకు తగిన సమయం ఇస్తామని చెప్పారు. పురోగామి మార్పులే ఉంటాయి. కానీ, తిరోగామి మార్పులు ఉండవని ఆయన స్పష్టం చేశారు. ఈ కామర్స్ కంపెనీలు సంబంధిత వ్యక్తులు, సంస్థలతో జరిగిన తాజా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రభుత్వం జాతీయ ఈ-కామర్స్ ముసాయిదా విధానాన్ని వెల్లడించిన విషయం తెలిసిందే. వినియోగదారుల డేటా విషయమై న్యాయ, సాంకేతిక సంబంధిత ఆంక్షలతో కూడిన ప్రతిపాదనలు ఈ ముసాయిదా ఉన్నాయి. డేటాను సేకరించి స్థానికంగా ప్రాసెస్ చేసి విదేశాల్లో స్టోర్ చేసే విషయమై కొన్ని షరతులు కూడా ఈ ముసాయిదాలో చోటు చేసుకున్నాయి. ఈ ముసాయిదాలోని కొన్ని అంశాలపై పలు విదేశీ ఈ-కామర్స్ సంస్థలు తమ ఆందోళనలను వెలిబుచ్చాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐ)లకు సంబంధించి ప్రస్తుత చట్టాలే కొనసాగుతాయని, ఈ కామర్స్ రంగలో ఎఫ్‌డీఐలకు సంబంధించి కొత్తగా ఎలాంటి మార్పులు, చేర్పులు చేయలేదని పీయూష్ గోయల్ తాజా సమావేశంలో వివరించారు. డేటా, ఈ కామర్స్ విషయాల్లో ప్రపంచంతో కలిసి నడుస్తామని, అయితే పరస్పర సహకారం తప్పనిసరని పేర్కొన్నారు. రిటైల్, ఈ-కామర్స్ సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి మరోసారి సమావేశం జరుపుతామని వివరించారు. కాగా ఈ కామర్స్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు సంబంధించిన సమస్యలపై దృష్టి సారించడానికి తక్షణం ఒక కమిటీని ఏర్పాటు చేయాలని డీపీఐఐటీ(డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్)ని కేంద్ర వాణిజ్య మంత్రి పీయుష్ గోయల్ ఆదేశించారు.

నేను చేసిన పెద్ద తప్పు అదే!

- ఆండ్రాయిడ్‌కు ధీటైన ఓఎస్ తేలేకపోయా
- మైక్రోసాఫ్ట్ బిల్‌గేట్స్ వ్యాఖ్యలు

వాషింగ్టన్: ఆండ్రాయిడ్‌ను అభివృద్ధి చేసే అవకాశం గూగుల్‌కు దక్కేలా చేయడం, ఆండ్రాయిడ్‌కు ధీటైన మొబైల్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను తయారు చేసుకోలేక పోవడం తాను చేసిన అతి పెద్ద తప్పు అని మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుల్లో ఒకరైన బిల్‌గేట్స్ పేర్కొన్నారు. ఫలితంగా తమ కంపెనీకి 40,000 కోట్ల డాలర్ల నష్టం వచ్చిందని వివరించారు. ఆండ్రాయిడ్‌ను 5 కోట్ల డాలర్లకే ఎగరేసుకుపోయిన గూగుల్ నిజమైన విజేతగా నిలిచిందని పేర్కొన్నారు. వెంచర్ క్యాపిటల్ సంస్థ, విలేజ్ గ్లోబల్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు.

అన్నీ ఆండ్రాయిడ్ ఫోన్లే...

యాపిల్ ఫోన్లు కాకుండా మిగిలిన ఇతర ఫోన్లకు ప్రామాణిక ప్లాట్‌ఫాంగా ఆండ్రాయిడ్ అవతరించిందని, మైక్రోసాఫ్ట్ ఆ స్థానంలో ఉండాల్సిందని ఆయన వివరించారు. గూగుల్ కంపెనీ ఆండ్రాయిడ్‌ను 2005లోనే కొనుగోలు చేసింది. ఐఫోన్ 2007లో మార్కెట్లోకి రాగా, ఆండ్రాయిడ్ ఫోన్2008లో మార్కెట్లోకి వచ్చింది. ప్రస్తుతం తయారవుతున్న స్మార్ట్‌ఫోన్లలో 85 శాతానికి పైగా ఆండ్రాయిడ్ ఓఎస్‌తో ఉన్నవే. ఇక విండోస్ ఓఎస్‌తో తయారైన ఫోన్‌లు ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదు.

ఆ 3 లక్షల కోట్లూ కేంద్రం ఖర్చులకే!!

- నిధుల బదిలీ మూడేళ్లపాటు జరగొచ్చు
- కేంద్రానికి ఆర్‌బీఐ నిధులపై నొమురా అంచనా
- బ్యాంకులకిస్తేనే బాగుంటుందన్న బీఓఏ-ఎంఎల్

ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నుంచి కేంద్రానికి బదలాయింపులు జరుగుతాయని భావిస్తున్న రూ.3 లక్షల కోట్ల వినియోగంపై అంచనాలు ప్రారంభమయ్యాయి. ఈ పరిమాణంలో అధిక భాగం కేంద్రం సాధారణ వ్యయాలకు వినియోగించుకుంటుందని జపాన్ బ్రోకరేజ్ సంస్థ- నొమురా అంచనా వేసింది. నొమురా దీనిపై ఒక నివేదిక విడుదల చేస్తూ, ఆర్‌బీఐ నుంచి నిధుల బదలాయింపు ఒకేసారి జరక్కపోవచ్చని, వరుసగా మూడేళ్లపాటు ఈ ప్రక్రియ కొనసాగే అవకాశం ఉందని పేర్కొంది. అందివచ్చే నిధుల్లో 45 శాతం కేంద్రం సాధారణ వ్యయాలకు వినియోగించుకుంటుందని, 20 శాతాన్ని బ్యాంకుల మూలధన పెట్టుబడులకు వినియోగించుకునే వీలుందని నొమురా పేర్కొంది. ప్రభుత్వ రుణభారం 25 శాతానికి తగ్గించుకునే అవకాశం ఉందని విశ్లేషించింది. వచ్చిన మొత్తంపై ఆధారపడి మిగిలిన 10 శాతం వ్యయాలు ఉంటాయని పేర్కొంది.

బ్యాంకులకిస్తే బెటర్: బ్యాంక్ ఆఫ్ అమెరికా

ఆర్‌బీఐ వద్ద ఉన్న అదనపు నిధులను 'మూలధనం కొరతతో ఇబ్బందులు పడుతున్న' ప్రభుత్వ రంగ బ్యాంకులకు అందించేలా చర్యలు తీసుకుంటే ఫలితం ఉంటుందని అంతర్జాతీయ ఆర్థిక విశ్లేషణా దిగ్గజ సంస్థ బ్యాంక్ ఆఫ్ అమెరికా-మెరిలించ్ ఇప్పటికే అభిప్రాయపడింది. ఆర్‌బీఐ వద్ద ఉన్న అదనపు నిధులను ప్రభుత్వానికి బదలాయించే అంశంపై సిఫారసులకు గత ఏడాది డిసెంబర్‌లో ఆర్‌బీఐ మాజీ గవర్నర్ బిమల్ జలాన్ నేతృత్వంలో ఆరుగురు సభ్యుల కమిటీ ఏర్పాటయిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ తన నివేదికను జూన్‌లో ప్రభుత్వానికి సమర్పించాలి. అయితే కమిటీ సభ్యుల్లో వ్యక్తమవుతున్న విభేదాల కారణంగా నివేదిక ఆలస్యం అవుతోందని వార్తలు వస్తున్నాయి. జూలైలో నివేదిక సమర్పించవచ్చని సమాచారం. ఆర్‌బీఐ వద్ద ఉన్న నిధుల్లో మూడు లక్షల కోట్లను కేంద్రానికి బదలాయించవచ్చని ఈ కమిటీ సిఫారసు చేయవచ్చని బ్యాంక్ ఆఫ్ అమెరికా-మెరిలించ్ తాజా నివేదిక అంచనా వేసింది.

ఆర్‌బీఐ నిధులపై ఆధారపడక తప్పదా?

కేంద్రం ద్రవ్యలోటును ఎలా పూడ్చుకుంటుందనే అంశంపై ఇపుడు సర్వత్రా చర్చ నడుస్తోంది. ద్రవ్యలోటు సమస్యను అధిగమించేందుకు ఆర్‌బీఐ వద్ద ఉన్న నిధుల్లో మెజారిటీ వాటాను పొందాలని కేంద్రం భావిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఆర్‌బీఐ వద్ద జూన్ నాటికి రూ.9.43 లక్షల కోట్ల అదనపు నిల్వలున్నాయి. నగదు, బంగారం రీవాల్యుయేషన్ (రూ.6.91 లక్షల కోట్లు), కంటెంజెన్సీ ఫండ్ (రూ.2.32 లక్షల కోట్లు) ద్వారా ఈ నిధులు సమకూరాయి. ఇందులో అధిక మొత్తాన్ని కేంద్రం కోరుతోందన్న వార్తల నేపథ్యంలో- డిసెంబర్ 10న వ్యక్తిగత కారణాలతో ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ రాజీనామా ప్రకటించారు. శక్తికాంత్ దాస్ గవర్నర్ అయ్యాక డిసెంబర్‌లో జలాన్ నేతృత్వంలో 'నిధుల బదలాయింపుపై' కమిటీ కూడా ఏర్పాటయ్యింది.

ఇప్పటికే మూడు కమిటీలు...

గతంలోనూ ఆర్‌బీఐ నిల్వలపై 3 కమిటీలు ఏర్పాటయ్యాయి. వి.సుబ్రమణ్యం (1997), ఉషా థోరట్ (2004), వైహెచ్ మాలేగామ్ (2013) వీటికి నేతృత్వం వహించారు. మొత్తం రుణాల్లో 12% వరకూ ఆర్‌బీఐ నిల్వల రూపంలో ఉండాలని సుబ్రమణ్యం కమిటీ సిఫారసు చేస్తే, థోరట్ కమిటీ 18%గా పేర్కొంది. ఆర్‌బీఐ థోరట్ కమిటీ సిఫారసును తోసిపుచ్చింది. సుబ్రమణ్యం కమిటీ సిఫారులకు ఓకే చెప్పింది. లాభాల్లో తగిన మొత్తాన్ని ఏటా కంటింజెన్సీ నిల్వలకు బదలాయించాలని మాలేగామ్ కమిటీ సిఫారసు చేసింది. ప్రస్తుతం స్థూల రుణాల్లో 28% నిష్పత్తిలో ఆర్‌బీఐ వద్ద మిగులు నిల్వలు ఉన్నాయి. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం 14% నిధులు సరిపోతాయని ఆర్థిక శాఖ భావిస్తోంది.

భవిష్యత్తు అల్యూమినియం ప్యాకేజింగ్‌దే: ఏబీసీఏఐ

(మీడియా సమావేశంలో అమిత్, ప్రకాశ్ (కుడి)

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పానీయాల ప్యాకేజింగ్‌కు అల్యూమినియం క్యాన్లను వాడటం పెరుగుతోందని అల్యూమినియం బెవరేజెస్ క్యాన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏబీసీఏఐ) స్పష్టంచేసింది. కల్తీకి ఆస్కారం లేకపోవడం, పానీయాల జీవిత కాలం ఎక్కువ ఉండడం, ప్లాస్టిక్ పట్ల విముఖత ఇందుకు కారణమని వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఏటా అల్యూమినియంతో తయారైన 200 కోట్ల పానీయాల క్యాన్లు విక్రయం అవుతున్నాయని బాల్ బెవరేజ్ ప్యాకేజింగ్ ఇండియా ఎండీ అమిత్ లహోటి తెలిపారు. ఆదిత్య బిర్లా గ్రూప్ కన్స్యూమర్ ఇన్‌సైట్స్, బ్రాండ్ డెవలప్‌మెంట్ గ్రూప్ హెడ్ ప్రకాశ్ నెడుంగడితో కలిసి మంగళవారమిక్కడ మీడియాతో మాట్లాడారు. 'ఏటా అల్యూమినియం క్యాన్ల వినియోగం వృద్ధి రేటు 9-10% ఉంటోంది. ఈ క్యాన్లలో 50-60% బీర్ల ప్యాకేజింగ్‌కు, మిగిలినవి ఇతర పానీయాల కోసం వాడుతున్నారు. గ్లాస్ ప్యాకేజింగ్ నుంచి పరిశ్రమ ఎక్కువగా అల్యూమినియం వైపు మళ్లుతోంది' అని వివరించారు. బాల్ బెవరేజ్‌కు మహారాష్ట్రలోని తలోజ, ఏపీలోని శ్రీసిటీలో తయారీ కేంద్రాలున్నాయి. భవిష్యత్‌లో డిమాండ్ పెరిగితే హైదరాబాద్‌లో క్యాన్ల తయారీ ప్లాంటు ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తామని అమిత్ వెల్లడించారు. 1880లో ప్రారంభమైన బాల్ కార్పొరేషన్ ఏటా 10,000 కోట్ల క్యాన్లను ప్రపంచవ్యాప్తంగా విక్రయిస్తోంది.

లాభాల వర్షం

- సంతృప్తికరంగా నైరుతి వర్షాలు
- ఐఎమ్‌డీ వెల్లడితో బలపడిన సెంటిమెంట్
- రెండు రోజుల నష్టాలకు బ్రేక్
- 312 పాయింట్లు పెరిగి 39,435కు సెన్సెక్స్
- 97 పాయింట్లు ఎగసి 11,796కు నిఫ్టీ

భారత దేశమంతటా నైరుతి రుతు పవనాల విస్తరణ సంతృప్తికరంగా ఉండటంతో మంగళవారం స్టాక్ 'మార్కెట్ లాభాల్లో ముగిసింది. దీంతో రెండు రోజుల నష్టాలకు బ్రేక్ పడింది. వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో పశ్చిమాసియా, అమెరికా-చైనాల వాణిజ్య ఉద్రిక్తతల సమస్యలు పక్కకు పోయాయి. అంతర్జాతీయ సంకేతాలు అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ, డాలర్‌తో రూపాయి మారకం విలువ ఫ్లాట్‌గా ట్రేడవుతున్నా మన మార్కెట్ ముందుకే దూసుకుపోయింది. బీఎస్ఈ సెన్సెక్స్ 312 పాయింట్లు పెరిగి 39,435 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 97 పాయింట్లు ఎగసి 11,796 పాయింట్ల వద్ద ముగిశాయి. ఇంధన, లోహ, వాహన, బ్యాంకింగ్, విద్యుత్తు, ఎన్‌బీఎఫ్‌సీ షేర్లు పెరిగాయి. అన్ని రంగాల నిఫ్టీ సూచీలు లాభాల్లోనే ముగిశాయి.

ఒడిదుడుకులు కొనసాగుతాయ్..

వచ్చే వారంలోనే బడ్జెట్ రానుండటం, అమెరికా-చైనా అధినేతల మధ్య వాణిజ్య ఉద్రిక్తతల నివారణ నిమిత్తం చర్చలు జరగనుండటంతో ఇన్వెస్టర్లు అప్రమత్తతను పాటిస్తున్నారు. దీంతో స్టాక్ మార్కెట్లో ఒడిదుడుకులు చోటు చేసుకున్నాయి. జూన్ సిరీస్ డెరివేటివ్స్ కాంట్రాక్టులు ఈ వారంలోనే ముగియనుండటతో ఒడిదుడుకులు తప్పవని నిపుణులంటున్నారు.

545 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్...

సెన్సెక్స్ లాభాలతో మొదలైనా, ఆ వెంటనే నష్టాల్లోకి జారిపోయింది. గంట తర్వాత లాభాల్లోకి వచ్చినా, ఒడుదుకులమయంగా ట్రేడైంది. దేశంలో సగానికి పైగా నైరుతి రుతుపవనాలు విస్తరించాయని భారత వాతావరణ విభాగం (ఐఎమ్‌డీ) వెల్లడించడంతో ఆరంభ నష్టాలు రివకరీ అయ్యాయి. నైరుతీ రుతుపవనాలు మరింత విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని ఐఎమ్‌డీ పేర్కొనడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడింది. సెన్సెక్స్ ఒక దశలో 177 పాయింట్లు నష్టపోగా, మరో దశలో 368 పాయింట్లు లాభపడింది. మొత్తం మీద రోజంతా 545 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. ఆసియా మార్కెట్లు నష్టాల్లో ముగియగా, యూరప్ మార్కెట్లు నష్టాల్లో ఆరంభమై, నష్టాల్లోనే ముగిశాయి.

టైర్ల షేర్ల పరుగులు....

చైనా నుంచి దిగుమతయ్యే ట్రక్కు, బస్సు రేడియల్ టైర్లపై కౌంటర్ వెయిలింగ్ సుంకాన్ని కేంద్రం విధించడంతో టైర్ల షేర్లు పరుగులు పెట్టాయి. ఈ సుంకం ఐదేళ్ల పాటు కొనసాగుతుంది రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ 2.6 శాతం లాభంతో రూ.1,296 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా లాభపడిన షేర్ ఇదే. ప్రమోటర్లు మరింత వాటాను విక్రయించబోరన్న స్పష్టత రావడంతో ఇమామి షేర్ 8.7% లాభపడింది.

పార్లమెంటు @ బిజినెస్

భారీ బ్యాంకింగ్ మోసాలు తగ్గుతున్నాయ్!

బ్యాంకుల్లో లక్ష రూపాయలు ఆపైబడిన మొత్తాల్లో మోసాలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయని రాజ్యసభలో నిర్మలా సీతారామన్ మంగళవారం ఒక లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు. ఆమె తెలిపిన సమాచారం ప్రకారం-

- 2016-17లో బ్యాంకులు ఇతర ఫైనాన్షియల్ సంస్థల్లో రూ. లక్ష, ఆపైబడిన మోసాల పరిమాణం రూ.25,884 కోట్లు.
- 2017-18లో ఈ విలువ రూ. 9,866 కోట్లు.
- 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఈ మొత్తం రూ.6,735 కోట్లు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బ్యాంకుల్లో మోసాల నివారణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉద్దేశపూర్వక ఎగవేతదారుల విషయంలో బ్యాంకులే తమకుతాముగా క్రిమినల్ చర్యలు తీసుకునే వీలు కల్పించినట్లు పేర్కొన్నారు.

రూపాయి కదలికలపై కన్ను

రోజూవారీ ప్రాతిపదికన డాలర్ మారకంలో రూపాయి విలువను కేంద్రం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలు జాగ్రత్తగా పరిశీలిస్తున్నట్లు ఆర్థికమంత్రి రాజ్యసభలో ఒక లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ మంగళవారం 69.36 వద్ద ముగిసింది. 2013-14 నుంచి 2018-19 ఏప్రిల్- డిసెంబర్ మధ్య కాలాన్ని చూస్తే, రూపాయి సగటున రూ.60.50 నుంచి రూ.69.74 కనిష్టానికి పడినట్లు ఆర్థికమంత్రి తెలిపారు. 2017-18లో భారత్‌కు ప్రవాసభారతీయుల నుంచి వచ్చిన మొత్తం 69.12 బిలియన్ డాలర్లు ఉంటే, 2018-19 ఏప్రిల్-డిసెంబర్ మధ్య కాలంలో ఈ మొత్తం 58.31 బిలియన్ డాలర్లుగా ఉందని మంత్రి సీతారామన్ వెల్లడించారు.

నగదు చెలామణీ పెరిగింది...



వ్యవస్థలో కరెన్సీ చెలామణీని తగ్గించడం పెద్ద నోట్ల రద్దు ప్రధాన లక్ష్యం. అయితే ఈ లక్ష్యం పెద్దగా నెరవేరినట్లు కనిపించడంలేదు. రాజ్యసభలో నిర్మలాసీతారామన్ తెలిపిన సమాచారం ప్రకారం... పెద్ద నోట్ల రద్దుకు ముందు అంటే 2016 నవంబర్ 4వ తేదీ నాటికి చెలామణీలో ఉన్న నగదు విలువ రూ.17,74,187 కోట్లు. అయితే 2019 మే 31 వ తేదీ నాటికి ఈ విలువ రూ.21,71,835 కోట్లకు చేరింది. అంటే పెద్దనోట్ల రద్దు ముందు పరిస్థితితో పోల్చితే, కరెన్సీ చెలామణీ 22 శాతం పెరిగిందన్నమాట. 2016 నవంబర్ 8న కేంద్రం రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేసిన సంగతి తెలిసింది. ఇక సర్కులేషన్‌లో ఉన్న నోట్స్ 2014 అక్టోబర్ 2014 నుంచీ చూస్తే, 14.51 శాతం ఎగసింది. ఇక 2016 నవంబర్‌లో డిజిటల్ లావాదేవీల విలువ రూ.112.27 లక్షల కోట్లయితే, అది 2018 సెప్టెంబర్‌లో రూ.188.07 లక్షల కోట్లకు చేరినట్లు మంత్రి తెలిపారు.

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారెట్లు)	35,330	▲ 470
బంగారం (22 క్యారెట్లు)	33,650	▲ 450
వెండి (కిలో)	41,400	▲ 100

చెన్నై

బంగారం (24 క్యారెట్లు)	34,730	▲ 450
బంగారం (22 క్యారెట్లు)	33,080	▲ 570
వెండి (కిలో)	41,400	▲ 100

హైదరాబాద్

బంగారం (24 క్యారెట్లు)	34,730	▲ 450
బంగారం (22 క్యారెట్లు)	33,080	▲ 570
వెండి (కిలో)	41,400	▲ 100

ప్రొద్దుటూరు

బంగారం (24 క్యారెట్లు)	34,100	▲ 100
బంగారం (22 క్యారెట్లు)	31,580	▲ 100
వెండి (కిలో)	39,000	0

విశాఖపట్నం

బంగారం (24 క్యారెట్లు)	35,460	▲ 360
బంగారం (22 క్యారెట్లు)	32,980	▲ 330
వెండి (కిలో)	39,500	0

ఏపీ బులియన్ అసోసియేషన్

బంగారం (24 క్యారెట్లు)	35,710	▲ 410
బంగారం (22 క్యారెట్లు)	33,030	▲ 380
వెండి (కిలో)	41,300	0

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	58.19 రాత్రి 11.30కు	$57.90 సోమవారం ముగింపు
బ్రెంట్	64.54 రాత్రి 11.30కు	$64.18 సోమవారం ముగింపు

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 26-6-2019

విశాఖ	430-00
చిత్తూరు	463-00
వరంగల్	418-00
చెన్నై	470-00
ముంబై	472-00
విజయవాడ	420-00
నమక్కల్	455-00
గోదావరి	420-00
25-6-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	415-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.75
బెంగళూరు	445-00
కోల్‌కత్త	444-00
ఢిల్లీ	380-00

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	1,852
ఎన్ఎస్ఈ	29,818
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	11,57,999
ఎఫ్ఐఐ	1,158
డీఐఐ	377

నిఫ్టీ 50

టాప్ 10 గెయినర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
JSWSTEEL	266	3.18
BPCL	392.4	3.03
RELIANCE	1,295.40	2.61
AXISBANK	780.1	2.26
TATASTEEL	496.1	2.03
HINDALCO	202.1	1.97
NTPC	138.25	1.95
IOC	154.5	1.61
GRASIM	900.5	1.56
TITAN	1,317.00	1.3

టాప్ 10 లూజర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
YESBANK	109.65	-2.05
INFRATEL	269.3	-1.28
ASIANPAINT	1,362.00	-1.03
INDUSINDBK	1,451.75	-0.67
LT	1,531.95	-0.59
UPL	931.1	-0.58
HINDUNILVR	1,754.80	-0.55
TCS	2,263.00	-0.55
TECHM	724.5	-0.51
ADANIPORTS	405	-0.25

ఏడాదిలో 400 మంది ఉద్యోగులు

లాగిన్ రేడియస్ కో-ఫౌండర్ దీపక్ గుప్తా

loginradius

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సైబర్ సెక్యూరిటీ, డేటా ప్రొటెక్షన్ సేవల కంపెనీ లాగిన్ రేడియస్ ఏడాదిలో ఉద్యోగుల సంఖ్యను 400కు చేర్చనుంది. భారత్‌లో హైదరాబాద్, జైపూర్‌తోపాటు యూఎస్, కెనడాలో మొత్తం అయిదు కార్యాలయాలను నిర్వహిస్తున్న ఈ సంస్థలో ప్రస్తుతం 175 మంది సిబ్బంది ఉన్నారు. కంప్యూటర్ సైన్స్, సైబర్ సెక్యూరిటీ అభ్యర్థులను కొత్తగా నియమించుకోనుంది. 2013లో ప్రారంభించిన తమ కంపెనీకి ప్రపంచవ్యాప్తంగా 2,000 పైచిలుకు క్లయింట్లు ఉన్నారని లాగిన్ రేడియస్ కో-ఫౌండర్ దీపక్ గుప్తా మంగళవార మిక్కడ మీడియాకు తెలిపారు. '110 కోట్ల కస్టమర్ ప్రొఫైల్స్ మా వద్ద ఉన్నాయి. లొకేషన్, ల్యాప్‌ట్యాప్, మొబైల్, ఐపీ అడ్రస్ ఆధారంగా వ్యక్తులను ట్రాక్ చేస్తాం. వారి ప్రవర్తనను నిశితంగా గమనిస్తాం. తేడా వస్తే వారిని బ్లాక్ చేస్తాం. ఈ ప్రక్రియ అంతా క్షణాల్లో పూర్తి అవుతుంది. మొత్తంగా వెబ్‌సైట్లలోకి లాగిన్ అవుతున్న వ్యక్తుల నుంచి మా క్లయింట్ల సమాచారం భద్రంగా ఉండేలా చూస్తాం' అని వివరించారు.

'సొనాటా' వెడ్డింగ్ కలెక్షన్

హైదరాబాద్: వివాహ సీజన్ సందర్భంగా నూతన వధూవరుల కోసం ప్రత్యేక వెడ్డింగ్ కలెక్షన్‌ను ప్రారంభించినట్లు టైటాన్ కంపెనీకి చెందిన ప్రముఖ వాచీల బ్రాండ్ 'సొనాటా' వెల్లడించింది. హ్యాండ్ క్రాఫ్టెడ్ డిజైన్లను ఈ కలెక్షన్‌లో భాగంగా అందిస్తోంది. వివాహ సమయంలో వధువులకు సరిగ్గా సరిపడే విధంగా బంగారం, రోజ్ గోల్డ్ ప్లేటింగ్‌తో నూతన వేరియంట్స్ అందుబాటులో ఉండగా... పురుషులు కోసం నాణ్యత, డిజైన్ పరంగా ప్రీమియంగా కనిపించే లెదర్ స్ట్రాప్స్, రోజ్ గోల్డ్ బై వంటి 10 వేరియంట్లు అందుబాటులో ఉన్నాయని వివరించింది. వీటి ధరల శ్రేణి రూ.1,399 నుంచి రూ.2,299 వరకు ఉన్నట్లు తెలిపింది.

టీవీ టుడేలో పెరిగిన హెచ్‌డీఎఫ్‌సీ ఎమ్ఎఫ్ వాటా

న్యూఢిల్లీ: మీడియా కంపెనీ టీవీటుడేలో హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ సంస్థ తన వాటాను మరింత పెంచుకుంది. టీవీ టుడే నెట్‌వర్క్‌లో 2.14 శాతం వాటాకు సమానమైన 12.78 లక్షల షేర్లను ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా హెచ్‌డీఎఫ్‌సీ ఏఎమ్‌సీ కొనుగోలు చేసింది. ఒక్కో షేర్ సగటు కొనుగోలు ధర రూ.254.66 లెక్కన ఈ డీల్ విలువ రూ.32.55 కోట్లుగా ఉంది. గతంలో టీవీ టుడేలో 5 శాతంగా ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ వాటా తాజా షేర్ల కొనుగోళ్లతో 7.14 శాతానికి పెరిగింది.

ఎన్ఎస్ఈలో వాటా విక్రయం: ఐఎఫ్‌సీఐ

- 2.44% వాటా విక్రయానికి బోర్డ్ ఓకే
- రూ.1,206 కోట్లు వస్తాయని అంచనా

న్యూఢిల్లీ: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్(ఎన్ఎస్ఈ)లో తనకున్న 2.44 శాతం వాటాను (1.20 కోట్ల షేర్లు) ఐఎఫ్‌సీఐ విక్రయించనున్నది. సోమవారం జరిగిన బోర్డ్ మీటింగ్‌లో ఈ వాటా విక్రయానికి ఆమోదం లభించిదని ఐఎఫ్‌సీఐ తెలిపింది. ఒక్కో షేర్‌ను రూ.1,000 చొప్పున మొత్తం వాటా విక్రయించాలని, తద్వారా రూ.1,206 కోట్లు సమకూరుతాయని కంపెనీ అంచనా వేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ఈ వాటా విక్రయం పూర్తవ్వగలదని కంపెనీ ఆశిస్తోంది. కీలకం కాని వ్యాపారాల నుంచి వైదొలిగే వ్యూహంలో భాగంగా ఎన్ఎస్ఈలో వాటాను విక్రయిస్తున్నామని దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల ప్రాజెక్ట్‌లకు రుణాలిచ్చే ఈ కంపెనీ పేర్కొంది. ఆరంభంలో ఎన్ఎస్ఈలో ఈ కంపెనీకి 15 శాతం వాటా ఉండేది. 2007 నుంచి దశలవారీగా ఈ వాటాను ఈ కంపెనీ విక్రయిస్తూ వస్తోంది. ఎన్ఎస్ఈలో వాటా విక్రయం వార్తల నేపథ్యంలో బీఎస్ఈలో ఐఎఫ్‌సీఐ షేర్ 18 శాతం లాభంతో రూ.9.39 వద్ద ముగిసింది.

రిలయన్స్ రూ.12,900 కోట్ల రుణాలు

- విదేశీ సంస్థలతో దీర్ఘకాలిక ఒప్పందాలు
- సీఎస్ఆర్ నిధులు మళ్లించలేదని స్పష్టీకరణ

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ కంపెనీ విదేశీ సంస్థల నుంచి రూ.12,900 కోట్ల (185 కోట్ల డాలర్లు) రుణాలు తీసుకుంది. భవిష్యత్తు పెట్టుబడుల ప్రణాళికల నిమిత్తం వివిధ విదేశీ సంస్థల నుంచి ఈ రుణాలు తీసుకున్నామని రిలయన్స్ ఇండస్ట్రీస్ తెలిపింది. సాధారణ వ్యాపార అవసరాల కోసం ఆయా సంస్థల నుంచి దీర్ఘకాలిక రుణ ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. అయితే రుణాల కాలపరిమితి, వడ్డీరేట్లు తదితర వివరాలను ఈ కంపెనీ వెల్లడించలేదు. రిలయన్స్ తాలూకు టెలికం విభాగం జియో భవిష్యత్తు అవసరాల కోసం రూ.20,000 కోట్లు పెట్టుబడి పెట్టాలని యోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రిలయన్స్ ఈ రుణాలు తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

కంపెనీ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధి నుంచి రూ.1,700 కోట్ల నిధులను దారి మళ్లించారన్న అభియోగాలపై కంపెనీ వివరణ ఇచ్చింది. సీఎస్ఆర్ కార్యకలాపాలకు సంబంధించి కంపెనీ వ్యవహారాల మంత్రిత్వ (ఎమ్‌సీఏ) శాఖ ఎప్పటికప్పుడు తమ నుంచి సమాచారాన్ని కోరుతోందని, ఎమ్‌సీఏ అడిగిన అన్ని వివరాలను అందిస్తున్నామని ఆర్ఐఎల్ తెలియజేసింది. ఎమ్‌సీఏ ఇటీవలే తమ సీఎస్ఆర్‌ప్రాజెక్ట్‌లకు సంబంధించిన అదనపు సమాచారాన్ని కోరిందని, ఈ సమాచారాన్ని అందజేసే ప్రక్రియ జరుగుతోందని వివరించింది. కంపెనీ సామాజిక బాధ్యత నిధులను రిలయన్స్ దారి మళ్లించిందని, దీనికి సంబంధించి రిలయన్స్‌పై కంపెనీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ దృష్టి పెట్టిందని వార్తలు వచ్చాయి. ఈ వార్తలపై రిలయన్స్‌ను స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు వివరణ కోరాయి.

వచ్చే మూడేళ్లలో ట్రిలియన్ డాలర్లకు ఎగుమతులు

భారత ఎగుమతి సంస్థల సమాఖ్య అంచనా

న్యూఢిల్లీ: భారత్ నుంచి ఎగుమతులు గణనీయంగా పెరగనున్నట్లు అంచనాలు వెలువడుతున్నాయి. ప్రస్తుతం 535 బిలియన్ డాలర్లుగా ఉన్న దేశీ ఎగుమతులు.. వచ్చే మూడేళ్లలో ఒక ట్రిలియన్ డాలర్లకు చేరనున్నాయని భారత ఎగుమతి సంస్థల సమాఖ్య(ఎఫ్ఐఈఓ) అంచనా వేసింది. లాజిస్టిక్స్ రంగంలో అభివృద్ధి, మౌళిక సదుపాయాల నిర్మాణం ఎగుమతులకు ఊతం ఇవ్వనున్నట్లు వెల్లడించింది. 'లాజిస్టిక్స్ (సరుకు రవాణా) రంగం వ్యయ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించడం, వ్యాపార సులభతరంలో మరింత మెరుగుదల, ఎగుమతి దారులకు ప్రభుత్వ విధానాలు సక్రమంగా అమలుకావడం, పన్నులు సకాలంలో తిరిగిరావడం వంటి సానుకూల అంశాలతో భారత ఎగుమతులు పేర్కొన్న మేరకు చేరుకునే అవకాశం ఉంది' అని ఎఫ్ఐఈఓ అధ్యక్షుడు గణేష్ కుమార్ గుప్తా అన్నారు. లాజిస్టిక్స్ వ్యయాన్ని 10 శాతం తగ్గించడం వల్ల దేశీ ఎగుమతులను 5-8 శాతం పెంచవచ్చని విశ్లేషించారు. కొత్త టెక్నాలజీ, ఆటోమేషన్‌నూ ప్రస్తావించారు.

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	405.65	406
ASIAN PAINT	1363.1	1376.15
AXIS BANK L	781.65	762.85
BAJAJ AUTO	2843.7	2816.9
BAJAJ FINSE	8346.15	8354.65
BAJAJ FINAN	3579.85	3545.35
BHARTI AIRTEL	348.6	345.1
BPCL	393.1	380.85
BRITANNIA I	2807.7	2780.5
CIPLA LTD	550.05	549.9
COAL INDIA	258.35	256.75
EICHER MOTO	19116.85	19098.2
GAIL (INDIA)	309.7	306.7
GRASIM INDU	902.15	886.65
HCL TECHNOL	1079	1077.9
HDFC LTD	2172.8	2148.9
HDFC BANK L	2428.7	2417.95
HERO MOTOCO	2584.65	2586.25
HINDALCO I	202.5	198.2
HUL	1756.45	1764.45
INDIABULLS	621.55	619.1
ICICI BANK	433.65	429.45
INDUSIND BA	1449.65	1461.55
BHARTI INFR	269.8	272.8
INFOSYS LIM	748.1	745.5
INDIAN OIL	154.6	152.05
ITC LTD	278.5	276.25
JSW STEEL L	267.05	257.8
KOTAK MAHIN	1483.9	1470.6
LARSEN & T	1535	1541
MAHINDRA &M	641.65	634.85
MARUTI SUZU	6522.5	6459.9
NTPC LTD	138.45	135.6
ONGC	166.2	165.2
POWER GRID	201.6	199.05
RIL	1295.85	1262.4
SBI	356.55	353.2
SUN PHARMA	385.75	383.45
TATA MOTORS	160.45	159.3
TATA STEEL	498	486.25
TCS	2267.8	2275.5
TECH MAHIND	724.35	728.25
TITAN COMPA	1318.15	1300.05
ULTRATECH C	4596.05	4574.8
UPL LIMITED	934.95	936.55
VEDANTA LIM	170.35	168.45
WIPRO LTD	285.3	283.9
YES BANK	110.05	111.95
ZEE ENTERTA	343.2	341.35

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

ABB INDIA L	1559.05	1566.95
ABB INDIA L	1559.05	1560.9
ACC LIMITED	1554.55	1537.6
AMBUJA CEME	215.15	215
ASHOK LEYLA	85.7	85.8
BAJAJ HOLDI	3636.95	3603.95
BANDHAN BAN	527.7	533.9
BANK OF BAR	120	118.25
BHEL	73.9	73.7
BIOCON LIMI	246.3	249.5
BOSCH LIMIT	16469.3	16401.4
CADILA HEAL	230.4	229.05
COLGATE PAL	1137.75	1135.45
CONTAINER C	554.25	553.35
DABUR INDIA	394.3	392.35
DLF LIMITED	176.25	175.55
AVENUE SUPE	1330.65	1329.2
GENERAL INS	206.9	205.8
GODREJ CONS	675.65	674.2
HAVELLS IND	783.95	785.4
HDFC AMC LI	1952.55	1933.85
HDFC LIFE I	437.5	440.1
HINDUSTAN P	295.5	288.6
HINDUSTAN Zinc	230.6	227.95
ICICI LOMBA	1102	1175.65
ICICI PRU L	372.1	375.55
VODAFONE ID	12.1	12.1
INTERGLOBE	1603.45	1555.05
L&T FINANCE	113.15	113.75
LUPIN LIMIT	754.45	732.8
MARICO LIMI	371.35	369.4
UNITED SPIR	560.7	560.05
MOTHERSON S	119.45	121.15
MRF LTD	55552.9	54660.7
NHPC LTD	24.7	25.05
THE NEW IND	148.45	149.05
NMDC LTD.	110.95	109.85
ORACLE FIN	3209.05	3113.8
PAGE INDUST	20713.5	20630.35
PIRAMAL ENT	1901.15	1943.1
PETRONET LN	242.1	242
P&G HYGIENE	10754.5	10717.95
PIDILITE IN	1233.55	1226.3
STEEL AUTHO	50.35	49.15
SBI LIFE IN	674.35	710.6
SHREE CEMEN	21589.25	21081.3
SIEMENS LTD	1251.35	1247.85
SHRIRAM TRA	1118.95	1114.2
UNITED BREW	1339.6	1359.95

A B C D

3M INDIA LI	23183.9	23779.1
5PAISA CAPI	201.7	203.4
63 MOONS TE	112.55	115.7
8K MILES SO	84.65	80.65
AARTI DRUGS	529.95	530
AARTI INDUS	1796.7	1803.2
AAVAS FINAN	1491.75	1473.25
ABBOTT INDI	8557.75	8541.85
ACCELYA SOL	871.6	876.2
ACTION CONS	94.55	93.95
ADANI ENTER	150.85	147.75
ADANI GAS L	162.2	158.7
ADANI POWER	50.55	50.15
ADANI TRANS	222	224.85
ADF FOODS L	272.25	274.8
ADHUNIK IND	78.2	77.5
ADITYA BIRL	92.05	92.15
ADITYA BIRL	212.65	207.7
ADOR WELDIN	338.1	338.1
ADVANCED EN	166.95	167.65
ADVANI HOT.	58.55	58.5
AEGIS LOGIS	202.6	201.55
AGARWAL IND	123.75	121.5
AGC NETWORK	110	109.55
AGRO TECH F	494.05	499.9
AHLUWALIA C	330.5	330
AIA ENGINEE	1747.1	1748.55
AJANTA PHAR	974.35	956.6
AJMERA REAL	160.7	158.15
AKASH INFRA	58.8	56
AKSHARCHEM	268.15	264.8
AKZO NOBEL	1749.3	1727.75
ALBERT DAVI	397.45	397
ALEMBIC PHA	501.2	505
ALICON CAST	555.1	561.05
ALKEM LABOR	1697.4	1715.75
ALKYL AMINE	805.45	803.65
ALLCARGO LO	101.7	102.1
ALLSEC TECH	316.1	316.3
ALPHAGEO (I	426.25	431.6
AMBER ENTER	829.5	818.95
AMBIKA COTT	1040.4	1039.25
AMRUTAJAN H	306.7	296.8
ANJANI PORT	165.65	164.85
APAR INDUST	601.4	584.9
APCOTEX IND	573	566.8
APEX FROZEN	250.75	249.35
APL APOLLO	1539.65	1513.65
APOLLO HOSP	1324.85	1344.65
APOLLO MICR	117.75	115.1
APOLLO SIND	871.65	843.4
APOLLO TYRE	200.4	199.45
APTECH LIMI	141.85	136.25
ARIHANT SUP	54.35	55.65
ARMAN FIN S	404.6	405.25
ARTEM GLOBA	54.8	57
ARVIND FASH	690.25	700.25
ARVIND LIMI	64.65	62.5
ARVIND SMAR	103.75	98.5
ASAHI INDIA	220	218.65
ASAHI SONGW	136.75	136.9
ASHIANA HOU	123	126.15
ASHOKA BUIL	133.7	133.65
ASIAN GRANI	257.75	255.45
ASIAN HOTEL	121.75	122.4
ASIAN HOTEL	185.05	189.95
ASIAN HOTEL	346.05	336.5
ASPINWALL &	149.45	150.95
ASTEC LIFES	466.05	459.2
ASTER DM HE	135.75	133.65
ASTRA MICRO	87.1	86.4
ASTRAL POLY	1335	1321.8
ASTRAZENECA	1942.9	1945.4
ASTRON PAPE	119.3	118.75
ATUL AUTO L	269.75	269.6
ATUL LTD	3968.85	3993.1
AU SMALL FI	698.75	692.7
AURIONPRO S	116.6	118.8
AUTOMOTIVE	1003.75	1009.45
AVADH SUG &	645.95	663.85
AVANTI FEED	351.15	355.45
AXISCADES E	61.4	63.05
BAJAJ CONSU	332.85	328.1
BAJAJ ELECT	512.55	505.2
BAL PHARMA	54.55	55.5
BALAJI TELE	58.2	60.8
BALKRISHNA	762.65	741.3
BALMER LAWR	180.85	180.6
BALRAMPUR C	133.45	137
BANCO PRODU	119.15	119.65
BANK OF IND	86.55	86.35
BANNARI AM	150.55	154.95
BANNARI AMM	1405	1415.8
BANSWARA SY	65.55	66.25
BASF INDIA	1317.65	1332.35
BATA INDIA	1413.5	1405.35
BAYER CROPS	3370.1	3360.4
BEML LIMITE	856.35	823.7
BERGER PAIN	317.85	313.9
BF INVESTME	251.2	250.1
BF UTILITIE	178.65	178.2
BHAGERIA IN	248.15	249.4
BHANSALI EN	63.75	62.65
BHARAT BIJL	1049.8	1064.35
BHARAT DYNA	307.85	305.15
BHARAT ELEC	113.9	114.75
BHARAT FIN	920.4	925.35
BHARAT FORG	435.85	436.4
BHARAT GEAR

రాష్ట్రంలో పలుచోట్ల అధిక వర్షపాతం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రుతు పవనాలు చురుగ్గా కొనసాగుతున్నాయి. పలు చోట్ల అధిక వర్షపాతం నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మంగళవారం రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, కామారెడ్డి, యాదాద్రి భువనగిరి, నిజామాబాద్ జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది.

వివిధ ప్రాంతాల్లో నమోదైన వర్షపాతం:
రంగారెడ్డి జిల్లా తొర్రూరులో 9 సెం.మీ., తొమ్మిడిరేకుల 7 సెం.మీ., మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కీసరలో 7 సెం.మీ., అల్వాల్‌లో 5 సెం.మీ., మల్కారం 4 సెం.మీ., కామారెడ్డి జిల్లా మద్నూర్‌లో 5 సెం.మీ., యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపూర్‌లో 5 సెం.మీ., నిజామాబాద్ జిల్లా గన్నారంలో 4 సెం.మీ., మోర్తాడ్ 3 సెం.మీ.ల చొప్పున వర్షపాతం నమోదైంది.

తుపాకులగూడెం, ఛనాకా-కొరాటాల అనుమతులకు ఈఏసీ సిఫార్సు

సాక్షి, హైదరాబాద్: గోదావరి జలాలను వినియోగించుకుంటూ కంతన్‌పల్లి, పెన్‌గంగలపై చేపట్టిన తుపాకులగూడెం ప్రాజెక్టు, ఛనాకా-కొరాటా బ్యారేజీకి పర్యావరణ అనుమతులు ఇవ్వాలని కోరుతూ పర్యావరణ సలహా సంఘం (ఈఏసీ) కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖకు సిఫార్సు చేసింది. ఈ మేరకు గత నెల 27న జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని మంగళవారం మినిట్స్ రూపంలో విడుదల చేసింది. గోదావరిలో 100 టీఎంసీల నీటిని వినియోగంలోకి తెచ్చి దేవాదుల, ఎస్సారెస్పీ స్టేజ్-1, 2 కింది 5 లక్షల హెక్టార్లకు పైగా ఆయకట్టు స్థిరీకరణ చేసేలా తుపాకులగూడెం ప్రాజెక్టు చేపట్టనున్నారు. ఇందుకు 67.18 హెక్టార్ల భూసేకరణ చేయాల్సి ఉంది. దీనిపై ప్రాజెక్టు సీఈ నాగేంద్రరావుతోపాటు ఇతర ఇంజనీర్లు గత నెల 27న ఈఏసీ ముందు హాజరై ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందిన కమిటీ పర్యావరణ అనుమతుల మంజూరీకి కేంద్రానికి సిఫార్సు చేయాలని నిర్ణయించింది. ఇక 0.82 టీఎంసీల సామర్థ్యంతో చేపట్టిన ఛనాకా-కొరాటా బ్యారేజీ నిర్మాణానికి కేవలం 31 ఎకరాల భూసేకరణ అవసరమవుతుండగా, దీనికి కూడా ఈఏసీ సరేనంది. ఈఏసీ సిఫార్సులను కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి పరిశీలించి ఆమోదం తెలిపితే తుది ఉత్తర్వులు వెలువడనున్నాయి.

శాఖల సర్దుబాటుపై సర్కారు కసరత్తు

సాక్షి, హైదరాబాద్: సచివాలయం కూల్చివేత నేపథ్యంలో ప్రస్తుతం ఆ ప్రాంగణంలో కొలువుదీరిన కార్యాలయాలను నగరంలోని ఇతర ప్రభుత్వ భవనాల్లో సర్దుబాటు చేయడంపైరాష్ట్ర సర్కారు కసరత్తు ప్రారంభించింది. ఈ నెల 27న నూతన సచివాలయానికి ముఖ్యమంత్రి కేసీఆర్ భూమి పూజ చేయనున్న తరుణంలో సాధ్యమైనంత త్వరగా సచివాలయంలోని దాదాపుగా అన్ని కార్యాలయాలను తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాజధానిలో అందుబాటులో ఉన్న వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, కార్పొరేషన్లు, శాఖాధిపతుల (హెచ్‌ఓడీ) ఆఫీసుల్లో విస్తీర్ణ లభ్యతపై వివరాలు సేకరిస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న కార్యాలయాల విస్తీర్ణమెంత? అందులో ఎన్ని చదరపు గజాల జాగా ఖాళీగా ఉందనే వివరాలను తక్షణమే సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి వివిధ శాఖల ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులకు లేఖ రాశారు. ఇటీవలే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అప్పగించిన భవనాల వివరాలను నిర్దేశిత ఫార్మాట్‌లో నివేదించాలని జోషి ఆదేశించారు.

ఇన్‌స్పైర్ పురస్కారాలకు దరఖాస్తుల స్వీకరణ

ఎస్‌సీఈఆర్‌టీ సంచాలకురాలు శేషుకుమారి

సాక్షి, హైదరాబాద్: సృజనాత్మకతను కనబరిచే విద్యార్థులకు న్యూఢిల్లీలోని భారత ప్రభుత్వ విజ్ఞాన సాంకేతిక విభాగం ప్రతియేటా అందించే ఇన్‌స్పైర్ పురస్కారాలకు విద్యార్థులు జూలై 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) సంచాలకురాలు శేషుకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు 10 నుంచి 15 సంవత్సరాల వయస్సు ఉండి 6 నుంచి 10వ తరగతి చదువుతున్న ప్రభుత్వ/ఎయిడెడ్/ప్రైవేట్ రికగ్నైజ్డ్/కేంద్ర ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరూ ఇందులో పాల్గొనడానికి అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు తాము నిత్యజీవితంలో ఎదుర్కొనే సమస్యలను అధిగమించడానికి లేదా సమాజానికి ఉపయోగపడే ఒక నూతన పరికరాన్ని రూపొందించడానికి తమ ఆలోచనలను ప్రాజెక్టు ప్రపోజల్ రూపంలో www.inspireawards-dst.gov.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఎంపికైన ప్రతిపాదనలకు ఒక్కొక్కరికీ రూ.10 వేల ఆర్థిక సహాయం ప్రాజెక్టు రూపకల్పన కోసం అందిస్తారన్నారు. దీనికి సంబంధించిన అదనపు సమాచారం అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోనూ, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాల్లో లభిస్తుందని తెలిపారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు సమగ్ర సమాచారాన్ని అందించడానికి బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 'మనటీవీ'-నిపుణ చానెల్ ద్వారా టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తారని వెల్లడించారు. అందులో ఫోన్ ద్వారా ఇంటరాక్షన్‌కు అవకాశముంటుందని, అన్ని పాఠశాలల విద్యార్థులు, సైన్స్ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని శేషుకుమారి సూచించారు.

బీఎస్ఎన్ఎల్ వర్షాకాల ఆఫర్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ వర్షాకాల ఆఫర్‌లో భాగంగా ప్రీ పెయిడ్‌ప్లాన్-1312పై రూ. 201 డిస్కౌంట్ ప్రకటించింది. సంస్థ రూ. 1111కే ఈ ప్లాన్ అందిస్తోంది. 365 రోజుల కాలపరిమితితో ఏ నెట్‌వర్క్‌కైనా అపరిమిత కాల్స్, 5జీబీ డేటా, 1000 ఎస్ఎంఎస్‌లు ఈ ప్లాన్‌లో వర్తిస్తాయి. ఈ ఆఫర్ జూలై 3 వరకు అందుబాటులో ఉంటుంది. మరిన్ని వివరాల కోసం 1503 లేదా 18001801503 నంబర్లకు కాల్ చేయొచ్చని బీఎస్ఎన్ఎల్ సీజీఎం వి. సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ట్రైటా అధ్యక్షుడిగా విష్ణువర్ధన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గురుకుల విద్యాలయాల ఉపాధ్యాయ సంఘం (ట్రైటా) అధ్యక్షుడిగా కె.విష్ణువర్ధన్‌రెడ్డి ఎన్నికైనట్లు ట్రైటా ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి అంకితభావంతో పని చేస్తానని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఆస్ట్రేలియాలో నగర యువకుడి మృతి

గుండెపోటుతో కన్నుమూత

హైదరాబాద్: ఆస్ట్రేలియాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న నగరానికి చెందిన యువకుడు సామ అర్జున్‌రెడ్డి (36) మంగళవారం అక్కడ గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో అతని తల్లిదండ్రులు నివాసం ఉంటున్న వనస్థలిపురంలో విషాదం నెలకొంది. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గొల్లపల్లికి చెందిన సామ రఘురాంరెడ్డి రిటైర్డు ఆర్టీసీ ఉద్యోగి. ఇతని కుటుంబం వనస్థలిపురం భాగ్యలతా బీడీఎల్ కాలనీలో నివాసం ఉంటోంది. ఇతనికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. కాగా పెద్ద కుమారుడు అర్జున్‌రెడ్డి ఎంఎస్ కోసం ఆస్ట్రేలియా వెళ్లి అక్కడే స్థిరపడ్డాడు. సిడ్నీలో భార్య మహేశ్వరి, రెండున్నరేళ్ల కుమార్తె ఇషికలతో కలసి ఉంటున్నాడు. ఇటీవలే సొంతంగా కన్సల్టెన్సీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో మంగళవారం యథావిధిగా ఆఫీసుకు వెళ్లిన అర్జున్‌రెడ్డికి గుండెపోటు రావడంతో భార్యకు పోన్‌చేసి చెప్పాడు. తోటి ఉద్యోగులు అంబులెన్స్ తీసుకొచ్చేసరికి అతను మృతి చెందాడు. అర్జున్‌రెడ్డి మృతదేహాన్ని త్వరగా ఇండియాకు తీసుకువచ్చేందుకు సహకరించాలని కుటుంబసభ్యులు ప్రభుత్వాన్ని కోరారు.

మున్సి'పోల్స్'కి రెడీ..!



- 30వ తేదీలోపు ఎన్నికల ఏర్పాట్లు చేయండి
- 132 పుర, నగర పాలక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సన్నద్ధం

సాక్షి, హైదరాబాద్: మున్సి'పోల్స్' నిర్వహణకు ప్రభుత్వం చకచకా ఏర్పాట్లు చేస్తోంది. జూలై ఆఖరులోగా ఎన్నికలు నిర్వహించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించిన నేపథ్యంలో పట్టణ, పురపాలకశాఖ ఎన్నికల కసరత్తును వడివడిగా చేస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం చేస్తూ.. ముందస్తు క్రతువును ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని డెడ్‌లైన్ విధించింది. ఈ మేరకు పురపాలకశాఖ ఇన్‌చార్జి ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మ మంగళవారం జిల్లా కలెక్టర్లకు లేఖ రాశారు. టైమ్‌లైన్‌కు అనుగుణంగా ప్రతిరోజూ ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 132 స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాల్సివుంది. ఇందులో 56 పుర, నగర పాలక సంస్థల పదవీకాలం జూలై 2వ తేదీతో ముగియనుంది. అలాగే కొత్తగా ఏర్పడ్డ 76 మున్సిపాలిటీలకు కొత్త పాలకవర్గాలను ఎన్నుకోవాల్సివుంది. దీంతో ఎన్నికలకు సమాయత్తం కావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ స్టేషన్లవారీగా రూపొందించిన ఓటర్ల జాబితాకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల గుర్తింపునకు డోర్ టు డోర్ సర్వే నిర్వహిస్తున్న తరుణంలో మిగతా ప్రక్రియను 30లోపు పూర్తి చేయాలని ఆదేశించింది. ఈ మేరకు ముందస్తు కసరత్తుకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. వార్డుల పునర్విభజన, వార్డులవారీగా ఓటర్ల జాబితా ప్రచురణ, వార్డులు, మేయర్, వైస్‌పర్సన్ల రిజర్వేషన్ల ఖరారు, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల సిబ్బంది గుర్తింపు, శిక్షణ, బ్యాలెట్ పేపర్ల ముద్రణ, బ్యాలెట్ బాక్సులు సమకూర్చుకోవడంతోపాటు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన ఆదేశించారు.

రెండు విడతల్లో మున్సి'పోల్స్'!

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన కసరత్తులో రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) నిమగ్నమైంది. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలన్నింటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తే.. రెండు విడతల్లో ఎన్నికలు పూర్తి చేయాలని ఎస్ఈసీ భావిస్తున్నట్లు సమాచారం. వార్డుల పునర్వ్యవస్థీకరణతో పాటు రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ పూర్తి చేసి జాబితా ఇస్తే ఎన్నికల నిర్వహణకు సంసిద్ధంగా ఉన్నట్టుగా గతంలోనే ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. గ్రేటర్ హైదరాబాద్ పాలకవర్గానికి ఏడాదిన్నరకు పైగా, గ్రేటర్ వరంగల్‌కు ఇంకా రెండేళ్ల పదవీకాలం ఉన్నందున పాలకవర్గాల పదవీకాలం ముగియని వాటిని కొనసాగించాలా లేక నూతన చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చాక అన్నింటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలా అనే అంశంపై ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా ఎస్ఈసీ తదుపరి చర్యలు తీసుకోనుంది.



చిటారుకొమ్మన మిఠాయిపొట్లం..

ఈ గజరాజు పేరు ఫ్రెడ్.. ఫ్రెడ్‌కో చిత్రమైన జబ్బు ఉంది.. ఏంటో తెలుసా? చాలాసార్లు తాను ఏనుగునన్న విషయం మరిచిపోతుంటాడు.. మేకనను కుంటాడో ఏమిటో.. అమాంతం అలా కాళ్లను లేపి.. చిటారుకొమ్మన ఉన్న పళ్ల కోసం ఇలా ఫీట్లు చేస్తుంటాడు. ఈ దృశ్యం జింబాబ్వేలోని మనాపూల్స్ నేషనల్‌పార్క్‌లోనిది. అక్కడ ఎండాకాలంలో నీళ్లు, ఆహారం దొరకడం కాస్త తక్కువే. దాని వల్ల చెట్లపై ఉన్న పళ్లను అందుకోవడానికి ఇక్కడి గజరాజులు కొన్ని తమ వెనుక కాళ్లపై లేచి నిల్చోవడం నేర్చుకున్నాయి. 'సాధారణంగా సర్కస్ ఏనుగులు ఇలాంటి ఫీట్లు చేస్తాయి. మామూలు ఏనుగులు చేయడం అరుదే. దీనికితోడు ఆ పళ్లు సరిగా అందక ఏనుగులు తమ వెనుక కాళ్లపై అటుఇటు తిరుగుతున్నప్పుడు అవి డ్యాన్స్ చేస్తున్నట్లు భలే కామెడీగా ఉంటుంది. చూసేవాళ్లకు కన్నులపండుగే' అని ఈ చిత్రాలను తీసిన ఆస్ట్రేలియన్ ఫొటోగ్రాఫర్ డేవిడ్ చెప్పారు.

ప్రక్రియ పూర్తి చేయండి

- మున్సి'పోల్స్'పై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- 119 రోజులు గడువు.. ఆ తర్వాత 30 రోజుల్లో ఎస్ఈసీ ఎన్నికలు నిర్వహించాలి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు ప్రక్రియకు సమయాన్ని నిర్ణయిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. వార్డుల పునర్విభజన, నోటిఫికేషన్, ఓటర్ల జాబితా వెల్లడి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల గుర్తింపు, వార్డులు, మున్సిపల్ చైర్మన్/మేయర్ పోస్టుల రిజర్వేషన్ల ఖరారు.. తదితర ప్రక్రియను 119 రోజుల్లో పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ తంతు పూర్తయ్యాక 30 రోజుల్లో ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. జూలై 2తో మున్సిపాలిటీలు/కార్పొరేషన్ల పాలకవర్గాల గడువు పూర్తవుతుందని, ఈలోగా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రక్రియ చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల సంఘం హైకోర్టును ఆశ్రయించింది. నిర్ణీత గడువులోగా ఎన్నికలు నిర్వహించేలా ఆదేశాలివ్వాలని బీసీ సంక్షేమ సంఘం, ఇతరులు కూడా వ్యాజ్యాలు దాఖలు చేశారు. వీటిని మంగళవారం విచారించిన న్యాయమూర్తి పైవిధంగా ఆదేశాలు జారీ చేశారు.

బీసీలకు 21.5 శాతం రిజర్వేషన్లు..
రాష్ట్ర ఎన్నికల సంఘం లేఖలు రాసినా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టలేదని పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది కేజీ కృష్ణమూర్తి వాదించారు. రాజ్యాంగంలోని 243(3) అధికరణ ప్రకారం.. ఐదేళ్ల పాలకవర్గం ముగిసేలోగా ఎన్నికలు నిర్వహించాలని అందుకు ప్రభుత్వ చర్యలు లేవన్నారు. బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు ఉండేలా ఆదేశించాలన్నారు. దీనిపై ప్రభుత్వం తరపున అదనపు అడ్వొకేట్ జనరల్ జె.రామచంద్రరావు కల్పించుకుని.. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం 50 శాతం రిజర్వేషన్లు దాటరాదన్నారు. అందుకు అనుగుణంగా ఆర్డినెన్స్ జారీ చేస్తామని, బీసీలకు 21.5 శాతం రిజర్వేషన్లు ఉంటాయన్నారు. దీనిపై పిటిషనర్ న్యాయవాది అభ్యంతరం చెప్పారు. బీసీల జనాభా లెక్కించి అందుకు అనుగుణంగా చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించిందని గుర్తు చేశారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ.. ఈ అంశంపై ఆరు వారాల తర్వాత విచారణ జరుపుతామని ప్రకటించారు. పార్లమెంట్ ఎన్నికలు, ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు, తాజాగా పంచాయతీరాజ్ సంస్థలకు ఎన్నికలు వరుసగా జరిగాయని, ఈ పనుల్లోనే ప్రభుత్వం తలమునకలైందని ఏఏజీ వివరణ ఇచ్చారు. పెద్ద పంచాయతీలను 68 మున్సిపాలిటీలుగా చేశామని, సమీపంలోని 42 మున్సిపాలిటీలు/కార్పొరేషన్లల్లో 131 గ్రామ పంచాయతీలను విలీనం చేశామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తికి 141 రోజులు, ఓటర్ల జాబితాకు 28 రోజులు అవసరం అవుతాయన్నారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ.. 119 రోజుల్లోగా ఎన్నికలకు అవసరమైన ముందస్తు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఆ తర్వాత 30 రోజుల్లో రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించాలన్నారు.

రైతులకు సాయంపై జాప్యమేల?

- వ్యవసాయ ముఖ్య కార్యదర్శి స్వయంగా విచారణకు హాజరు కావాలి
- ఆదిలాబాద్ జిల్లాలో అకాల వర్ష

సాక్షి, హైదరాబాద్: ఆదిలాబాద్ జిల్లాలో 2018లో కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన 28 వేల మంది రైతులకు వ్యవసాయ శాఖ ఎందుకు సాయం చేయలేదో వివరించాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. జూలై 1న జరిగే తదుపరి విచారణకు ఆయన స్వయంగా కోర్టుకు వచ్చి వివరణ ఇవ్వాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఆదేశించింది. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ వంటివి ఇవ్వకపోవడాన్ని తప్పుబడుతూ ఆ జిల్లాకు చెందిన ఒక రైతు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని ధర్మాసనం మరోసారి విచారించింది. పత్తి, సోయా, మొక్కజొన్న వంటి పంటలు 17 వేల హెక్టార్లల్లో దెబ్బతిన్నాయని, 28 వేల మందికిపైగా రైతులు నష్టపోయారని పిటిషనర్ తరపు న్యాయవాది చెప్పారు. రాష్ట్ర, జాతీయ విపత్తుల సహాయ నిధుల నుంచి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీలు ఇవ్వలేదన్నారు. రైతులకు రూ.12.13 కోట్లు చెల్లించాలని జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక పంపి 5 నెలలు అవుతున్నా, ఇప్పుడు రైతులు మళ్లీ సాగుకు సమాయత్తం అవుతున్నా, ఇప్పటి వరకూ సహాయం అందలేదన్నారు. దీంతో కలెక్టర్ నివేదిక పంపితే వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి ఎందుకు చర్యలు తీసుకోలేదని ధర్మాసనం ప్రశ్నించింది. దీనిపై ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది శరత్ కుమార్ జోక్యం చేసుకుంటూ.. ఎక్కువ మొత్తంలోనే చెల్లింపులు చేయాల్సివుందని, కౌంటర్ దాఖలుకు 2 నెలల సమయం కావాలన్నారు. సంబంధిత ఫైలు సీఎం వద్ద ఉందని, దీనిపై ఆయనే నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. ఎంత చెల్లించాలో చెప్పకుండా పెద్ద మొత్తమని చెప్పడమేంటని, ఎంత చెల్లించాలో వివరాలతో వచ్చే విచారణ సమయంలో చెప్పాలని స్పష్టంచేసింది.

తెలంగాణలో ఎల్పీయూ కౌన్సెలింగ్ కేంద్రాలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, వరంగల్ ప్రాంతాల్లో సంస్థ తరపున అడ్మిషన్లు, కౌన్సెలింగ్ కేంద్రాలను ప్రారంభించినట్లు లర్నీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ(ఎల్పీయూ) మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. తెలంగాణ నుంచి ఏటా వందల సంఖ్యలో విద్యార్థులు పలు రకాల కోర్సుల్లో విద్యనభ్యసించేందుకు తమ వర్సిటీలో చేరుతున్నారని పేర్కొంది. దీంతో విద్యార్థులకు వర్సిటీ అందించే కోర్సులు, ఇతర వివరాలు అందించాలన్న ఉద్దేశంతోనే కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఎల్పీయూ స్కాలర్‌షిప్‌తో అడ్మిషన్లు పొందాలనుకునే విద్యార్థులు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అలాగే విద్యార్థులు ఎల్పీయూలో అడ్మిషన్లకు జూలై 31వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. ఈ కేంద్రాలు జూన్ 30వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు పనిచేస్తాయని తెలిపింది. వివరాలకు టోల్‌ఫ్రీ నంబర్లు 1800 274 0615, 1800 102 4431ల్లో సంప్రదించాలని సూచించింది.

ఆ పిల్లల స్థితిగతులపై నివేదిక ఇవ్వండి: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: అక్రమ రవాణా నుంచి యాదాద్రిలో విముక్తి పొందిన మహిళలు, ఆడ పిల్లల సంక్షేమం కోసం పనిచేస్తున్న ప్రజ్వల రెస్క్యూ హోమ్‌లోని 26 మంది పిల్లల స్థితిగతులపై జూలై 9 లోగా నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. యాదాద్రిలో పిల్లలకు పోలీసులు విముక్తి కల్పించి సంరక్షణ గృహాలకు తరలించారు. వారిలో 26 మంది ప్రజ్వల అనే ఎన్జీవో సంస్థ నిర్వహించే సంరక్షణ గృహంలో గతేడాది జూలై నుంచి ఉంటున్నారు. సంరక్షణ గృహంలో ఉన్న పిల్లల జీవన పరిస్థితులను తెలుసుకోవాలని భావిస్తున్నామని, పిల్లలకు ఎలాంటి ఆహారం అందజేస్తున్నారో, వారికి అవసరమైనప్పుడు ఏ మందులు వాడుతున్నారో, విద్యా బోధన ఎలా ఉందో నివేదిక ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాఘవేంద్ర సింగ్ చౌహాన్, జస్టిస్ షమీమ్ అక్తర్లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. కిడ్నాప్, తప్పిపోయిన పిల్లలను వ్యభిచార కూపంలోకి నెట్టేస్తున్నారంటూ పత్రికల్లో వచ్చిన వార్తా కథనాలను ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించిన హైకోర్టు.. ఆ పిల్‌ను మంగళవారం మరోసారి విచారించింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది శరత్ కుమార్ వాదిస్తూ.. సంరక్షణ గృహంలో పిల్లలు క్షేమంగానే ఉన్నారని, రక్షణ దృష్ట్యా వారిని స్కూళ్లకు పంపలేకపోతున్నామన్నారు. ప్రజ్వల హోం నిర్వాహకులు అక్కడే వారికి చదువు చెబుతున్నారని తెలిపారు. పిల్లలను దత్తత తీసుకున్నామని చెప్పి కొందరు వారిని కలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నా తాము అనుమతించట్లేదన్నారు. ప్రజ్వల హోం తరపు న్యాయవాది దీపక్ మిశ్రా వాదిస్తూ హోంలో 150 మంది ఉండేందుకు వసతులున్నాయని, పిల్లల యోగక్షేమాలను నిర్వాహకులు చూసుకుంటున్నారని తెలిపారు. విచారణ వచ్చే నెల 9కి వాయిదా పడింది.

State Economy Fame
NAGARJUNA Sir
APPSC TSPSC Gr-2 NEW BATCH
Demo @ 11 a.m. 27-6-2019
Special Batch ECONOMY
NAGARJUNA's STUDY CIRCLE
ASHOK NAGAR, HYDERABAD.
040-27604111 / 9989104111

మేడిగడ్డ బ్యారేజీని పరిశీలిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి

కాళేశ్వరం.. ఖర్చుల ప్రాజెక్టు

- తుమ్మడిహెట్టి వద్ద నిర్మాణం జరిగితే ఖర్చు తగ్గేది: చాడ
- కాళేశ్వరంతో నీటి, విద్యుత్ వినియోగ భారం
- పాత ఆదిలాబాద్ జిల్లాకు చుక్క నీరు రాదు
- కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన సీపీఐ బృందం

కాళేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కలల ప్రాజెక్టు కాదని.. తెలంగాణకు ఖర్చుల ప్రాజెక్టు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పార్టీ నేతలతో కలసి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు, కన్నెపల్లి పంపుహౌస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జలయజ్ఞం పేరుతో శ్రీపాద ఎల్లంపల్లి నిర్మాణం చేపట్టారని, ఆ తర్వాత తుమ్మడిహెట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని పేర్కొన్నారు. అయితే తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత తుమ్మడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించకుండా మేడిగడ్డ వద్ద గోదావరికి అడ్డంగా బ్యారేజీ నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో నీటి వినియోగం, విద్యుత్ వినియోగం భారీగా పెరిగి తెలంగాణ ప్రజలపై భారం పడుతోందని చెప్పారు. తుమ్మడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం జరిగితే పాత ఆదిలాబాద్ జిల్లాకు సాగు, తాగు నీరు అందేదని, కానీ ఇప్పుడు ఎడారిగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టులోని పంపుహౌస్‌లు, బ్యారేజీలు పరిశీలించి వాటిపై అన్ని పార్టీలతో చర్చించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. పార్టీ రాష్ట్ర నాయకుడు పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టు పనులన్నీ పూర్తి చేసి అన్ని జిల్లాలకు నీరందేలా చూడాలని, లేని పక్షంలో మరో ఉద్యమం మొదలు పెడుతామని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు, కన్నెపల్లి పంపుహౌస్‌ల నిర్మాణం గురించి డీఈఈ తిరుపతిరావు, ఏఈఈలు వలి, రమణ, యాకయ్య తదితరులు సీపీఐ నేతలకు వివరించారు. వారి వెంట రాష్ట్ర సహాయక కార్యదర్శి సాంబశివరావు, కార్యవర్గ సభ్యులు గుండా మల్లేష్, పద్మ, శ్రీనివాసరావు, బాల మల్లేష్ తదితరులు ఉన్నారు.